సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 15 | సంచిక: 351

సోమవారం 13-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



'తెలుగు' కన్వీనర్‌గా మృణాళిని

కేంద్ర సాహిత్యఅకాడమీ తెలుగు విభాగంలో తొలి మహిళా కన్వీనర్‌గా ఎన్నిక. -14లో



కోహ్లి కొట్టిన సెంచరీతో...

నాలుగో టెస్ట్‌పై భారత్ పట్టు. 91 పరుగుల ఆధిక్యం. -12లో



ఆ పెళ్లిళ్లు చట్టవిరుద్ధమే

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలన్న పిటిషన్లను సుప్రీంకోర్టులో కేంద్రం వ్యతిరేకించింది.

- వివరాలు 6లో▶



నాకు సమాధి తవ్వే పనిలో..

దేశాభివృద్ధి కోసం తాను పనిచేస్తుంటే విపక్షాలు తనకు సమాధి తవ్వే పనిలో నిమగ్నమయ్యాయని మోదీ విమర్శించారు.

- వివరాలు 6లో▶



మహిళను చంపి, ముక్కలు చేసి..

కశ్మీర్‌లో తనతో పెళ్లికి ఒప్పుకోని మహిళ (30)ను ఓ దుర్మార్గుడు చంపి మృతదేహాన్ని ముక్కలు చేశాడు.

- వివరాలు 6లో▶



పట్టణాన్ని నిర్మించనున్న మస్క్

ప్రపంచ కుబేరుడు, అమెరికాకు చెందిన ఎలాన్ మస్క్ సొంతంగా ఒక పట్టణాన్నే నిర్మించనున్నారు.

- వివరాలు 6లో▶

'హనీట్రాప్'తో లీక్

టీఎస్‌పీఎస్సీకి చెందిన ఇద్దరు ఉద్యోగులే పేపర్ లీకేజీ సూత్రధారులు

ప్రభుత్వ మహిళా టీచర్ కోరడంతో పేపర్ బయటికి తెచ్చిన ప్రవీణ్

- సెక్షన్ ఆఫీసర్‌కు చెందిన కంప్యూటర్ నుంచి తస్కరణ
- దళారీ ద్వారా ముగ్గురికి విక్రయించిన సదరు టీచర్, ఆమె భర్త
- రూ.14 లక్షలు వసూలు.. అందులో రూ.10 లక్షలు ప్రవీణ్‌కు..
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న బేగంబజార్ పోలీసులు
- 12 మందిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్
- 'అసిస్టెంట్ ఇంజనీర్' పేపర్ కూడా లీకై ఉంటుందేమోనన్న సందేహాలు!



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించాల్సిన 'టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్' పరీక్ష పేపర్ లీకేజీ వెనుక హనీట్రాప్ ఉన్నట్టు బయటపడింది. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనిత రామచంద్రన్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ తనకు సన్నిహితంగా ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ప్రోద్బలంతో ప్రశ్నపత్రాన్ని బయటికి తెచ్చినట్టు తేలింది. ఆ టీచర్ కోరిక మేరకే ప్రవీణ్ ప్రశ్నపత్రాన్ని తీసుకురాగా.. సదరు టీచర్ మాత్రం ఓ దళారీ సాయంతో ముగ్గురు అభ్యర్థులకు పేపర్‌ను విక్రయించినట్టు వెల్లడైంది. ఈ క్రమంలోనే పేపర్ లీకేజ్ విషయం బహిర్గతమైంది. దీనిపై టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఫిర్యాదు మేరకు బేగంబజార్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని 'టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్' పోస్టులకు ఆదివారం పరీక్ష జరగాల్సి ఉండగా.. దీనిని టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసిన విషయం తెలిసిందే.

సోదరుడి కోసమంటూ అడిగి

హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రేణుకకు కొన్నాళ్లుగా ప్రవీణ్‌కుమార్‌తో పరిచయం ఉంది. ప్రస్తుతం జరుగుతున్న టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు రేణుక సోదరుడు కూడా దరఖాస్తు చేసుకున్నాడు. ఆదివారం టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష రాయాల్సి ఉంది. పోటీ ఎక్కువగా మిగతా 5వ పేజీలో ▶

కమిషన్ ప్రతిష్టకు దెబ్బ

ఇంకేమైనా పేపర్లు లీకయ్యాయా అనే ఆందోళనలో లక్షలాది మంది అభ్యర్థులు 5లో

అరెస్టులు జరగొచ్చు!

బీజేపీ వ్యతిరేక ప్రచారం జరిగితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి రాష్ట్ర నేతల భేటీలో అమిత్‌షా సూచనలు?



- ఎలాంటి పరిణామాలు ఎదురైనా ఎదుర్కోవాలి
- దర్యాప్తు సంస్థల విచారణ తీరును ప్రజలకు వివరించాలి
- ఏదేమైనా తెలంగాణను చేజిక్కించుకోవాల్సిందేనని స్పష్టీకరణ
- హైదరాబాద్‌లో సీఐఎస్‌ఎఫ్ రైజింగ్‌డేలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి
- కొచ్చికి వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపంతో నాలుగున్నర గంటలు ఇక్కడే వెయిటింగ్
- ఆ సమయంలోనే సంజయ్, లక్ష్మణ్, కిషన్‌రెడ్డిలతో మంతనాలు

సాక్షి, హైదరాబాద్: సీబీఐ, ఈడీ తదితర దర్యాప్తు సంస్థల విచారణలు, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి అరెస్టులు వంటివి అనివార్యంగా జరిగే అవకాశాలు ఉన్నాయని.. అప్పుడు బీజేపీకి ప్రతికూలంగా జరిగే ప్రచారాన్ని ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర బీజేపీ నేతలకు కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా సూచించినట్టు తెలిసింది. జాతీయ దర్యాప్తు సంస్థలు చేస్తున్న విచారణ, బయటపడుతున్న వాస్తవాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పినట్టు సమాచారం. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను ఈడీ ప్రశ్నించడం, ఈ నేపథ్యంలో ఢిల్లీలో, హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ నిరసనలు, కేంద్రాన్ని, ప్రధాని మోదీని, దర్యాప్తు సంస్థలను తప్పుబడుతూ జరుగుతున్న ప్రచారాన్ని ఆధారాలతో సహా తిప్పికొట్టాలని అమిత్‌షా ఆదేశించినట్టు తెలిసింది. ఈ నెల 16న కవిత మరోసారి ఈడీ విచారణకు హాజరవుతున్నందున.. కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్ నేతలపై అవినీతి, అక్రమ ఆరోపణలను విస్తృతంగా ప్రచారం చేసి బీజేపీకి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలని సూచించినట్టు సమాచారం.

విమానంలో సమస్యతో..: ఆదివారం హైదరాబాద్‌లో సీఐఎస్‌ఎఫ్ రైజింగ్‌డే కార్యక్రమంలో అమిత్‌షా పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన 11.40 గంటలకు బీఎస్‌ఎఫ్ ప్రత్యేక విమానంలో కేరళలోని కొచ్చికి వెళ్లాలి. కానీ విమానంలో సాంకేతిక సమస్య ఏర్పడటంతో దాదాపు నాలుగున్నర గంటల పాటు హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోనే ఉండిపోయారు. ఆయనకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కూడా అక్కడే ఆగారు. ఈ సందర్భంగా వారు పలు విడతలుగా రాష్ట్ర అంశాలపై అమిత్‌షాతో చర్చలు జరిపినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ సర్కారు, కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు, ఢిల్లీ లిక్కర్ స్కాంపై అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం.

దర్యాప్తులపై స్పష్టత ఇవ్వండి

ఢిల్లీ లిక్కర్ స్కాంలో దర్యాప్తు సంస్థలు ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించలేదన్న విషయాన్ని.. ఈ కేసులో బయటపడిన వాస్తవాలు, ఆధారాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర నేతలకు అమిత్‌షా సూచించినట్టు మిగతా 2వ పేజీలో ▶

ఏం జరిగింది.. ఏం చేద్దాం?

- సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన ఎమ్మెల్సీ కవిత
- 16న మళ్లీ రావాలని ఈడీ నోటీసులిచ్చిన నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ నేపథ్యంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో ఎమ్మెల్సీ కవిత ఆదివారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. శనివారం ఢిల్లీలో ఈడీ సుదీర్ఘ విచారణను ఎదుర్కొని అర్ధరాత్రి హైదరాబాద్ వచ్చిన కవిత నేరుగా ప్రగతిభవన్‌కు వెళ్లి కేసీఆర్‌ను, ఇతర కుటుంబసభ్యులను కలిశారు. అనంతరం బంజారాహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు. కాగా, ఆదివారం మిగతా 2వ పేజీలో ▶

ఈ వేసవి గండం గట్టెక్కగలమా?



- మార్చిలోనే సూరీడు మండిపోతున్నాడు. ఈ ఏడాది వేసవి భగభగలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండే ఎండలకు తోడు ఎన్నో సమస్యలు ఎదురు కానున్నాయి. వడగాడ్పులు, విద్యుత్ సంక్షోభం, నీటి ఎద్దడి బాధించనున్నాయి. 1901 తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి అత్యంత వేడి నెలగా రికార్డులకెక్కింది. సగటు ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్‌కు దాటాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

- వివరాలు 6లో▶

కలసి నడుద్దాం..



- కామ్రేడ్లు ఎన్నికలకు రంగం సిద్ధం చేసు కుంటున్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కీలకమైన అయిదారు వేలమంది క్రియాశీలక కార్యకర్తలతో వచ్చే నెల 9వ తేదీన హైదరాబాద్‌లో ఉమ్మడి సమావేశం నిర్వహించాలని సీపీఐ, సీపీఎంలు నిర్ణయించాయి. ఈ సందర్భంగా ఉభయ పార్టీల నేతలు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఎంబీ భవన్‌లో సమావేశమయ్యారు.

- వివరాలు 2లో▶

ఒకే వేదికపైకి రాజయ్య, నవ్య

- జానకీపురం సర్పంచ్, ఆమె భర్తతో కలసి ఎమ్మెల్యే ప్రెస్‌మీట్
- తన వల్ల ఎవరికైనా బాధ కలిగితే క్షమించాలని కోరిన రాజయ్య
- స్త్రీలపట్ల అసభ్యంగా మాట్లాడితే సహించనన్న నవ్య - 2లో

నువ్వా.. నేనా?



- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ నేడే
- బరిలో 21 మంది అభ్యర్థులు.. గట్టిపోటీ ఐదారుగురి మధ్యే - 3లో

తవ్విన కొద్దీ... 'చీట్స్'

అక్రమాలపుట్ట మార్గదర్శిలో నలుగురు మేనేజర్ల అరెస్టు ఒక్క రూపాయి కూడా లేకుండా కంపెనీ పేరిట వేలాది చిట్లు



- డిస్కౌంట్‌నే తమ చందాగా చూపిస్తూ రికార్డుల కనికట్టు
- ఈ గొలుసు తెగితే చందాదారుల పరిస్థితి అగమ్యగోచరం
- ఒక్క బ్యాంకు ఖాతా నుంచే మొత్తం లావాదేవీలు
- చట్ట విరుద్ధంగా గ్రూపు సంస్థల్లోకి, షేర్లలోకి మళ్లింపు
- హైరిస్క్ ఉన్న మ్యూచువల్ ఫండ్లలోకీ మళ్లిస్తున్న సంస్థ
- కాగితపు రసీదులిస్తూ అక్రమంగా డిపాజిట్ల సేకరణ
- టీడీఎస్ మినహాయింపు లేదని చెప్పి మరీ స్వీకరణ
- రామోజీ రాజ్యంలో... అడుగడుగునా అతిక్రమణలే
- నలుగురు బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసిన సీఐడీ
- కొందరికి ఈ నెల 24 వరకు రిమాండు

- వివరాలు 10లో▶

బండెక్కితే భయమే!

- రోడ్డెక్కగానే బండిని రయ్‌మంటూ పరుగెత్తిస్తారు.. హైవేలపై అయితే వాయు వేగంతో పోటీ పడతారు.. ఇలా దూసుకుపోతే ఆ కిక్కే వేరనుకుంటారు.. దీని కోసం ట్రాఫిక్ నిబంధనలనూ బేఖాతరు చేస్తారు.. ఇందులో కిక్కు ఎంత వస్తుందో వారికే తెలుసుగానీ.. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోవడం మాత్రం పెరిగిపోతోంది. రహదారులపై బ్లాక్ స్పాట్లు, వాహన వేగ నియంత్రణలో వైఫల్యం, హెల్మెట్, సీటుబెల్టు పెట్టుకోవడంలో నిర్లక్ష్యం వంటివి వేలకొద్దీ మరణాలకు కారణ మవుతున్నాయి.

- వివరాలు 5లో▶





పెట్టుబడులన్నీ ఒకేచోట ఉంటే రిస్క్..

- దీర్ఘకాలంలో ఈక్విటీలలో వచ్చినంత రాబడి మరే సాధనంలోనూ ఉంటుందని చెప్పలేం. కానీ, అన్ని కాలాలకూ, పెట్టుబడులు అన్నింటికీ ఈక్విటీ ఒక్కటే వేదిక కాకూడదు. ఏదైనా సంక్షోభం ఎదురైతే.. వేరే సాధనంలోని పెట్టుబడులు కొంత రక్షణనిస్తాయి. ఇన్వెస్టర్లు తమ రిస్క్ సామర్థ్యం ఆధారంగా ఈక్విటీతోపాటు ఇతర సాధనాల మధ్య కూడా కొంత పెట్టుబడులను వైవిధ్యంగా చేసుకోవాలి. అప్పుడే పెట్టుబడుల ప్రయాణం సాఫీగా సాగుతుంది.

- వివరాలు 13లో▶

అన్ని స్థానాల్లో ఆత్మీయ సమ్మేళనాలు

బీఆర్‌ఎస్ నేతలకు మంత్రి కేటీఆర్ పిలుపు





- నాయకుల మధ్య బంధాన్ని బలోపేతం చేసుకునే దిశలో కార్యాచరణ.. ప్రతి 10 గ్రామాలతో ఒక యూనిట్
- సమ్మేళనాల షెడ్యూల్‌ను పార్టీకి పంపాలి
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలోగా ఇవి పూర్తి చేయాలి
- విద్యార్థి విభాగం పటిష్టానికి చర్యలు చేపట్టండి
- ఘనంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహిద్దాం
- జిల్లా పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో మంత్రి టెలి కాన్ఫరెన్స్

- వివరాలు 2లో▶









క్లుప్తంగా...

దేశాన్ని దోచుకునేందుకే బీఆర్‌ఎస్ పార్టీ: తరుణ్‌ఛుగ్



సాక్షి, హైదరాబాద్/వరంగల్: తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దేశాన్ని దోచుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ పేరుతో ఢిల్లీకి వస్తున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్ ఆరోపించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని జకోటియా కాంప్లెక్స్ వద్ద ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. దోపిడీదారుల నుంచి తెలంగాణను ముక్తి చేసేందుకు బీజేపీ ముందుకు వస్తున్నదని, నవంబర్‌లో సీఎం కేసీఆర్ పదవీ విరమణ చేస్తారని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కేసీఆర్ బీటీంలోని వ్యక్తే అని ఆరోపించారు. తెలంగాణలో నేరస్తులు 'సత్యాగ్రాహీ'లుగా ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇది ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణ ఎపిసోడ్‌లో స్పష్టంగా వెల్లడైందన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు పేరిట కవిత కృత్రిమ నిరసనలు, మరుసటిరోజు ఈడీ విచారణ ఎదుర్కొంటున్న సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు ధర్నాల పేరిట పెద్ద ఎత్తున డ్రామాలు చేశారన్నారు. ఈ నెల 16న మరోసారి బీఆర్‌ఎస్ ఇలాంటి డ్రామాలకు తెరతీసి ప్రధాని మోదీ, ఇతర సంస్థలపై తప్పుడు ప్రచారాన్ని నిర్వహిస్తారని జోస్యం చెప్పారు. ఈడీ దర్యాప్తును నిలిపివేసేందుకు సీఎం కేసీఆర్‌తో పాటు కుటుంబం ఒత్తిళ్లు, ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు



సాక్షి, హైదరాబాద్: తాను ఢిల్లీలో బీఆర్‌ఎస్ మహిళా నాయకురాళ్లకు ఆశ్రయం ఇచ్చానని, ఆ సందర్భంగా ఫొటో దిగానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. బెంగళూరులోని తన తండ్రి దగ్గరికి వెళ్తున్న సమయంలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో బీఆర్‌ఎస్ మహిళా నాయకురాళ్లు కలిశారని వివరించారు. ఆ సందర్భంగా దిగిన ఫొటోను సోషల్‌మీడియాలో పెట్టి తప్పుడు ప్రచారం చేయడం తగదని ఆమె హితవు పలికారు.

'చలో రాజ్‌భవన్' వాయిదా

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఈనెల 13న నిర్వహించాల్సిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమం వాయిదా పడింది. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున ఎన్నికల నియమావళిని గౌరవిస్తూ ఆందోళన కార్యక్రమాన్ని 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

కేసీఆర్.. మీ టైం అయిపోయింది: పొంగులేటి



సత్తుపల్లి: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మైకు పట్టుకుంటే వందల కోట్ల హామీలు ఇస్తారని, కానీ, ఆచరణలో మాత్రం రూ.10 లక్షలు కూడా ఇవ్వరని, మాయమాటలు చెప్పటంలో ఆయన సిద్ధహస్తుడని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. 'కేసీఆర్ మీ టైం అయిపోయింది..' అని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని సత్తుపల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎనిమిదిన్నరేళ్లలో చేయలేని పనులు ఏడు నెలల్లో చేస్తానంటూ మంత్రివర్గ సమావేశాల్లో కేసీఆర్ చెప్పడం ఎన్నికల స్టంటేనని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను, మద్దతు పలికిన బీజేపీని కాదని కేసీఆర్‌ను సీఎంను చేస్తే బంగారు తెలంగాణ అంటూనే రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలో నెట్టారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో 500 మందికి దళితబంధు ఇస్తామని చెప్పారని, ఈ ఐదు నెలల్లో ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, రాష్ట్ర మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్ పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం: జయేశ్ రంజన్

మాదాపూర్: మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఆదివారం బిజినెస్ విమెన్ ఎక్స్‌పో-2023లో భాగంగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్ క్లబ్ 'వీ డూ హైదరాబాద్ చాప్టర్'ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో సౌకర్యం ద్వారా మహిళలకు బ్రాండింగ్, ప్యాకేజింగ్ వంటి ప్రతి సహాయాన్ని అందించనుందన్నారు. గ్రామీణ మహిళలు, గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి మండల స్థాయిలో సింగిల్ విండో సౌకర్యం ఉంటుందన్నారు. ఇప్పటికే 50 మంది ఇందులో చేరారని, మరికొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు 'వీ డూ హైదరాబాద్ చాప్టర్, విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ క్లబ్' అధ్యక్షులు సంజనా దూబే తెలిపారు. ఈ సందర్భంగా విజనరీ ఉమెన్ కలెక్టివ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అన్ని స్థానాల్లో ఆత్మీయ సమ్మేళనాలు

బీఆర్‌ఎస్ నేతలకు మంత్రి కేటీఆర్ పిలుపు

- నాయకుల మధ్య బంధాన్ని బలోపేతం చేసుకునే దిశలో కార్యాచరణ
- ప్రతి 10 గ్రామాలతో ఒక యూనిట్.. సమ్మేళనాల షెడ్యూల్‌ను పార్టీకి పంపాలి
- జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో టెలీకాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్త నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకుల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని బలోపేతం చేసుకునే దిశలో కార్యాచరణ రూపొందించుకోవాలని, ఇందుకోసం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'ఆత్మీయ సమ్మేళనాలు'నిర్వహించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె. తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తూ, 60 లక్షల మంది పార్టీ శ్రేణులను మరింత చైతన్యపరిచేలా విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టాలని ఆయన కోరారు. ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు రూపొందించిన కార్యక్రమాల షెడ్యూల్‌ను ఆయన ఈ సందర్భంగా పార్టీ నేతలకు వివరించారు. వీలున్నంత మేరకు నాయకులు ప్రజల్లో ఉండేలా ఈ కార్యక్రమాలను రూపొందించామని చెప్పారు.

కార్యకర్తలే బలం..

బీఆర్‌ఎస్‌కు పార్టీ కార్యకర్తలే బలమని, వారితో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్‌లో నాయకులకు సూచించారు. 'ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రతి 10 గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకోండి. ఆ 10 గ్రామాల కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయండి. పట్టణాల్లో అయితే పట్టణానికి ఒక యూనిట్‌గా లేదంటే కొన్ని డివిజన్లను ఒక యూనిట్‌గా చేసి సమ్మేళనాలు నిర్వహించండి. ఈ సమావేశాలకు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, ఇతర పార్టీ ముఖ్యులను ఆహ్వానించండి'అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏప్రిల్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ సమ్మేళనాలు పూర్తయ్యేలా ఏ రోజు ఏ యూనిట్‌లో నిర్వహిస్తారనే షెడ్యూల్‌ను తేదీలతో సహా జిల్లా అధ్యక్షులు పార్టీకి తెలియజేయాలని సూచించారు.

విద్యార్థి విభాగం బలోపేతం..

2023–24 విద్యాసంవత్సరం జూన్ నెల నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్టీ విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని, సభ్యత్వ నమోదు చేపట్టడంతో పాటు విద్యార్థి విభాగానికి నూతన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, ఇంటర్ నుంచి వృత్తి విద్యాకోర్సుల వరకు అన్ని స్థాయిల్లోని విద్యార్థులకు స్వాగత సభలు నిర్వహించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా నియోజకవర్గాల వారీగా పార్టీ ప్రతినిధుల సమావేశాలు ఏర్పాటు చేయాలని, పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం చేయాలని సూచించారు. ఈ అంశాలన్నింటిపై పూర్తిస్థాయి కార్యాచరణ కోసం వారం రోజుల్లోగా రాష్ట్ర పార్టీ సమావేశం నిర్వహిస్తామని కేటీఆర్ పార్టీ నేతలకు తెలిపారు.

అంబేడ్కర్ స్ఫూర్తిని గౌరవించుకుంటున్నాం

పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలను కూడా పూర్తి చేసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బి.ఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని, ఆ దిశగా జయంతి కార్యక్రమాల షెడ్యూల్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. 'దేశంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మరోవైపు నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టుకుంటున్నాం. దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా అంబేడ్కర్ వారసత్వ స్ఫూర్తిని ఇంత ఘనంగా గౌరవించుకోలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పార్టీ చేపట్టిన ఈ అద్భుత కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ఉత్సవాలు నిర్వహించాలి'అని చెప్పారు.

అర్వింద్ వర్సెస్ సంజయ్!

- కవితపై సంజయ్ వ్యాఖ్యలను తప్పుబట్టిన ఎంపీ అర్వింద్
- బీజేపీలో చర్చనీయాంశంగా మారిన నేతల మధ్య విభేదాలు
- ఇద్దరి మధ్య అగాథం పెంచిన నిజామాబాద్ నేత చేరిక అంశం





సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర ముఖ్యనేతల మధ్య లుకలుకలు మరోసారి బయటపడ్డాయి. వారిలో ఒకరు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కాగా, మరొకరు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్. తాజాగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఉద్దేశించి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం సృష్టించిన విషయం తెలిసిందే. తెలంగాణ యాసలో సంజయ్ చేసిన వ్యాఖ్యల్లో తప్పుబట్టాల్సిందేమీ లేదంటూ బీజేపీ నాయకులు సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తుండగా, మరోవైపు అర్వింద్ తప్పుపట్టారు. ఆదివారం అర్వింద్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కవితపై సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని సూచించారు. అర్వింద్ సూచనపై సంజయ్ ఏ విధంగా స్పందిస్తారనేది పార్టీలో చర్చనీయాంశమైంది. తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలు పార్టీ నేతల మధ్యనున్న భేదాభిప్రాయాలు, అసంతృప్తులను వెల్లడి స్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రహోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌లో ఉండగానే అర్వింద్ చేసిన వ్యాఖ్యలు బీజేపీలో హాట్‌టాపిక్‌గా మారాయి. కవిత ప్రస్తావన వస్తేనే అగ్గిమీద గుగ్గిలం మాదిరిగా ఎగిరిపడే అర్వింద్ బహిరంగంగా సంజయ్‌కు ప్రతికూలంగా స్పందించడం బీజేపీలోని పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సంజయ్‌కి సొంత పార్టీ ఎంపీ నుంచే మద్దతు లభించకపోవడంపై పార్టీ నాయకుల్లో కలవరం వ్యక్తమవుతోంది. రాష్ట్ర అధ్యక్ష పదవి అంటే పవర్ సెంటర్ కాదని, అధ్యక్షుడిగా అందరిని సమన్వయం చేయాలని అరవింద్ సూచించడంతో వారిద్దరి మధ్య ఉన్న విభేదాలు బయటపడ్డాయంటున్నారు.

చేరికల అంశంపై చెరోదారి!

నిజామాబాద్ జిల్లాలో ఇతర పార్టీల నుంచి నేతలు బీజేపీలో చేర్చుకునే విషయంలో వీరిద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు ఉత్పన్నమైనట్టు తెలుస్తోంది. బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఓ నేతను చేర్చుకునే విషయంలో సంజయ్ ఉత్సాహం చూపుతుంటే అర్వింద్ అడ్డుచెబుతున్నట్టు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో తాను చెప్పినవారినే చేర్చుకోవాలని, జిల్లాలో తనను సంప్రదించాకే ఏ నిర్ణయమైనా తీసుకోవాలనే ధోరణితో అర్వింద్ ఉండటం, ఆయన వైఖరిని సంజయ్ వ్యతిరేకిస్తుండటంతో పార్టీలో చర్చనీయాంశమైంది. ఇద్దరు ఎంపీలు, ముఖ్యనేతల మధ్య విభేదాలు ఎటు దారితీస్తాయోనన్న చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది.

సంజయ్ వ్యాఖ్యలు సమర్థించను

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితపై తమ నాయకుడు బండి సంజయ్ చేసిన 'సామెత'వ్యాఖ్యలను సమర్థించబోనని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. సామెతలు ఉపయోగించేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆ వ్యాఖ్యలు సంజయ్ వ్యక్తిగతమని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణకు సహకరించలేదని తమకు సమాచారం వచ్చిందన్నారు. ఎందుకు? ఏమిటి? ఎలా? అని అధికారులు ప్రశ్నిస్తే ఏమో? తెలియదు! గుర్తురాలేదు.. అంటూ కవిత సమాధానమిచ్చారని ఎద్దేవా చేశారు. ఆమె చేతికి రూ.20 లక్షల గడియారం, కోట్లాది రూపాయిల నగలు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలందరికీ తెలుసునన్నారు. కల్వకుంట్ల కుటుంబం మొత్తం అవినీతిలో మునిగి తేలిందన్నారు. కానీ, బీజేపీ వాజ్‌పేయి హయాం నుంచి అవినీతిని అంతం చేయాలని కంకణం కట్టుకుందన్నారు. కవిత ఈడీ విచారణకు వస్తే, రాష్ట్రంలో పాలన విడిచిపెట్టి వచ్చిన మంత్రులకు ఢిల్లీలో పనేంటని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు బీఆర్‌ఎస్ శ్రేణులకు అంత రచ్చ చేయాల్సిన అవసరం ఏంటన్నారు. జెంటిల్మెన్ మాగుంట ఫ్యామిలీని కూడా ఇబ్బందుల్లో పడేశారన్నారు. కేసీఆర్, కవిత ఒత్తిడి చేయడం వల్లే పిళ్లై తన స్టేట్‌మెంట్ ఉపసంహరణకు పిటిషన్ వేశారని ఆరోపించారు.

అరెస్టులు జరగొచ్చు!

▶ మొదటి పేజీ తరువాయి

తెలిసింది. ఈ వ్యవహారంలో బీజేపీకి, ప్రధాని మోదీకి ఎలాంటి సంబంధం లేదని వివరించాలని ఆదేశించినట్టు సమాచారం. కొన్నినెలల్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో కేసీఆర్ సర్కారు తీరును ఎండగట్టాలని, రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిన విషయాన్ని బలంగా ప్రచారం చేయాలని పేర్కొన్నట్టు తెలిసింది. మొత్తంగా నేతలంతా సమష్టిగా, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని, ముఖ్యంగా నేతల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని నొక్కి చెప్పారని.. తెలంగాణలో అధికారాన్ని సాధించాలని స్పష్టం చేశారని సమాచారం. ఇక రాష్ట్రంలో కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలపై ప్రజలు ఏమనుకుంటున్నారని అమిత్ షా ఆరా తీశారని తెలిసింది. ఈ సందర్భంగా కొన్ని రోజుల కింద ఢిల్లీలో అమిత్‌షాతో జరిగిన రాష్ట్ర కోర్‌కమిటీ భేటీ అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై బండి సంజయ్ ఓ నివేదికను అందజేసినట్టు సమాచారం.

అంతా ఢిల్లీకి..

బీఎస్ఎఫ్ విమానానికి మరమ్మతులు పూర్తయ్యాక అమిత్‌షా ఢిల్లీకి బయలుదేరినట్టు సమాచారం. మరోవైపు సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు పునః ప్రారంభం అవుతుండటంతో కిషన్‌రెడ్డి, సంజయ్, లక్ష్మణ్ కూడా ఆదివారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

సీఎం కోసం హోంమంత్రి ప్రార్థనలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండాలని.. హోం శాఖ మంత్రి మహమూద్ అలీ ఆదివారం ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా, హజ్రత్ అమీర్ ఖుస్రో, హజ్రత్ ఖ్వాజా బఖ్తియుద్దీన్ దర్గాల్లో ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్సీ కె.కవిత సమస్యలు పరిష్కారం కావాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితను ఈడీ అనవసరంగా ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్న కవితకు దేశవ్యాప్తంగా మహిళలు మద్దతు తెలుపుతున్నారని స్పష్టం చేశారు.

ఒకే వేదికపైకి రాజయ్య, నవ్య

- జానకీపురం వెళ్లిన ఎమ్మెల్యే.. సర్పంచ్ నవ్య దంపతులతో ప్రెస్‌మీట్
- తన వల్ల ఎవరికైనా బాధ కలిగితే క్షమించాలని కోరిన రాజయ్య
- గ్రామ అభివృద్ధికి రూ.25 లక్షలు ఇస్తున్నట్టు ప్రకటన
- గతంలో జరిగిన తప్పులను క్షమిస్తున్నా: సర్పంచ్

సాక్షి ప్రతినిధి, వరంగల్/ధర్మసాగర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జానకీపురం సర్పంచ్ నవ్య ఆరోపణలకు సంబంధించి.. ఆమెతోపాటు ఎమ్మెల్యే టి.రాజయ్య ఒకే వేదికపైకి వచ్చారు. ఆదివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామానికి వెళ్లిన రాజయ్య.. సర్పంచ్ కురుసపల్లి నవ్య, ఆమె భర్త ప్రవీణ్‌లతో చర్చించారు. తర్వాత వారంతా కలిసి జానకీపురంలోనే మీడియా సమావేశంలో మాట్లాడారు.

బాధ కలిగితే క్షమాపణలు చెప్తున్నా: రాజయ్య

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ.. ''నా వల్ల ఎవరికైనా బాధ కలిగితే క్షమాపణలు కోరుతున్నాను. జరిగిన పరిణామాలకు చింతిస్తున్నాను. నాకు నలుగురు చెల్లెళ్లు. ఊపిరి ఉన్నంత వరకు మహిళల ఆత్మగౌరవం కోసం పనిచేస్తా. నేను పనిచేసే క్రమంలో ఎక్కడైనా, ఎవరైనా మానసిక క్షోభకు గురైతే మహిళా సమాజానికి క్షమాపణలు చెప్తున్నా.. తెలిసీ తెలియక తప్పులు జరిగితే ఒప్పుకోక తప్పదు. జానకీపురం గ్రామ అభివృద్ధికి రూ.25 లక్షలు కేటాయిస్తున్నా. సర్పంచ్ నవ్య, ప్రవీణ్‌లను అన్నిరకాలుగా కాపాడుకుంటాను. నేను చేసిన శిఖండి వ్యాఖ్యలపై తర్వాత మాట్లాడుతా. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు..''అని పేర్కొన్నారు.


పార్టీ పెద్దల ఆదేశాలతో..

సర్పంచ్ కె.నవ్యపై ఎమ్మెల్యే రాజయ్య లైంగిక వేధింపులకు పాల్పడినట్టుగా వచ్చి ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలోనూ దీనిపై దుమారం రేగింది. ఈ క్రమంలో పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని వివాదాన్ని పరిష్కరించుకోవాల్సిందిగా ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకే.. రాజయ్య, కొందరు పార్టీ నేతలతో కలిసి జానకీపురం వెళ్లినట్టు తెలిసింది.

రాజయ్యకు మహిళా కమిషన్ నోటీసు


సర్పంచ్ నవ్య ఆరోపణల అంశాన్ని సుమోటోగా తీసుకోవాలని ట్విట్టర్ వేదికగా వచ్చిన అభ్యర్థనపై మహిళా కమిషన్ ఆదివారం స్పందించింది. రాజయ్యకు నోటీసులు జారీ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ ఘటనపై విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్‌కు కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి లేఖ రాసినట్టు తెలిపింది.

మహిళల పట్ల పిచ్చి వేషాలు వేయొద్దు: నవ్య



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రాజయ్య, సర్పంచ్ నవ్య దంపతులు

ఎవరైనా సరే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే, వివక్ష చూపితే సహించేది లేదని సర్పంచ్ నవ్య పేర్కొన్నారు. ''చెడును కచ్చితంగా ఖండిస్తాను. ఎవరికైనా పార్టీలో విలువ ముఖ్యం. ఎమ్మెల్యే రాజయ్య వల్లే నేను సర్పంచ్ అయ్యాను. అయితే రాజకీయాల్లో అణచివేతలు, వేధింపులు ఉండొద్దు. ఎవరైనా మహిళలపై పిచ్చివేషాలు వేస్తే పెట్రోల్ పోసి తగలబెట్టడానికైనా వెనుకాడను. ముఖ్య నాయకులు వారి పద్ధతి మార్చుకుని మహిళలను గౌరవించాలి. ఇక మీదట తప్పులు చేయకూడదు. గతంలో జరిగిన తప్పులను క్షమిస్తున్నాను. బీఆర్‌ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తాను. నేను చేసిన ఆరోపణలు నిజం. సమాజంలో మహిళలు కొన్ని విషయాల్లో కొందరి చేత మోసపోతున్నారు. అలాంటి వారు బయటికి వచ్చి నిలదీయాలి. ఎవరికైనా అన్యాయం జరిగితే వారిపక్షాన నేను ముందుండి కొట్లాడుతా..''అని చెప్పారు. ఎమ్మెల్యే రాజయ్య జానకీపురం గ్రామ అభివృద్ధికి ఎలాంటి సహకారం అందించడం లేదని.. ఇప్పటికైనా అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.



'సెంట్రల్' ఏసీలే!

ఎయిర్ కండీషనర్ల వినియోగం కేంద్ర పాలిత ప్రాంతాల్లోనే అధికం

దేశవ్యాప్తంగా కేంద్ర పాలిత ప్రాంతాల్లోనే ఎయిర్ కండీషనర్ల వినియోగం అధికంగా ఉంది. అత్యధికంగా చండీగఢ్‌లో 54.1 శాతం కుటుంబాలు ఏసీ నీడన సేదతీరుతున్నాయి. దేశంలో 4.9 శాతం కుటుంబాలకు ఏసీ సదుపాయం ఉన్నట్లు నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక వెల్లడించింది. దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉన్న కేరళలో 10.4 శాతం, ఏపీలో 8.1 శాతం కుటుంబాలు ఏసీలను వాడుతున్నాయి. తెలంగాణలో 6.6 శాతం, తమిళనాడులో 6.1 శాతం కుటుంబాలకు ఏసీలున్నాయి. అత్యల్పంగా బిహార్‌లో 0.4 శాతం, ఒడిశాలో 1.5 శాతం, కర్ణాటకలో 1.8 శాతం కుటుంబాలు ఏసీలను వినియోగిస్తున్నాయి.


– సాక్షి, అమరావతి

సగటు ఏసీ వినియోగం	భారత్	పట్టణాల్లో	గ్రామాల్లో
	4.9%	12.6%	1.2%

వ్యత్యాసం ఎందుకంటే..?

కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభా తక్కువగా ఉండటం, అత్యధికంగా ఉపాధి అవకాశాలు, పన్నులు తక్కువ ఉండటం లాంటి కారణాలు కొనుగోలు శక్తిని పెంచుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధికంగా వ్యవసాయం, కూలీలు ఎక్కువగా ఉండటం ఏసీ వినియోగం తక్కువగా ఉండటానికి కారణం. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, కొనుగోలు శక్తి తక్కువగా ఉంటాయి.

– ఎం.ప్రసాదరావు, ఏయూ ఎకనామిక్స్ విభాగం విశ్రాంత అధిపతి



యూటీ / రాష్ట్రాల వారీగా సగటున ఏసీ వాడే కుటుంబాల శాతం

ఏం జరిగింది.. ఏం చేద్దాం?

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం కేసీఆర్‌ని కలవాలని భావించారు. ఈ మేరకు హరీశ్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఉదయమే ప్రగతిభవన్‌కు వెళ్లగా, కవిత కొంత ఆలస్యంగా వచ్చారు. కవితతో పాటు హరీశ్‌రావు, కేటీఆర్, సీఎం కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఈడీ జరిపిన 9 గంటల సుదీర్ఘ విచారణలో ఏం జరిగిందనే అంశాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి ఈడీ అధికారులు ఏం ప్రశ్నలు అడిగారు... ఏం సమాధానాలు చెప్పారనే విషయంపై సీఎం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై న్యాయనిపుణులతో చర్చించినట్లు తెలిసింది. అనంతరం ఈ నెల 16న మరోసారి విచారణకు హాజరయ్యే అంశంపై కూడా కేసీఆర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. దీనిపై న్యాయనిపుణులతో మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. ఈడీ విచారణలో ఎలా వ్యవహరించాలనే దానిపై కవితకు కేసీఆర్ కొన్ని కీలక సలహాలు, సూచనలు చేసినట్లుగా సమాచారం.

బీజేపీకో హటావో.. దేశ్ కో బచావో

- ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం
- జూన్ 1 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర
- జూలై మొదటి వారంలో లక్షలాది మందితో బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని. చిత్రంలో పల్లా వెంకట్‌రెడ్డి, చాడ వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సీపీఐ ఆధ్వర్యంలో 'బీజేపీ కో హటావో..దేశ్ కో బచావో' పేరుతో ఏప్రిల్ 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ఇంటింటికీ సీపీఐ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఒకవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ... మరోవైపు రాష్ట్ర ప్రజలసమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. హైదరాబాద్‌లో రెండురోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని సీపీఐ ముఖ్య నేతలు కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, తాను రాష్ట్ర నలుమూలల ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో బహిరంగసభ నిర్వహిస్తామని, వాటికి నారాయణ, పార్లమెంటరీ పార్టీ నేత బినొయ్ విశ్వం హాజరవుతారని చెప్పారు.

జూన్ 1 నుంచి బస్సు యాత్ర


అనంతరం జూన్ 1 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రకు సంకల్పించినట్లు కూనంనేని తెలిపారు. ఈ కార్యక్రమం ముగింపుగా జూలైలో హైదరాబాద్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తామని, అదేవిధంగా విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 25న బయ్యారం నుంచి 'ప్రజా పోరు'పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, హన్మకొండ, వరంగల్ జిల్లాల్లో సాగే ఈ పాదయాత్ర ఏప్రిల్ 25న హన్మకొండలో జరిగే బహిరంగసభతో ముగుస్తుందన్నారు.

గవర్నర్ ఎందుకు స్పందించలేదు?

ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఎందుకు స్పందించలేదని కూనంనేని ప్రశ్నించారు. గతంలో షర్మిల కూర్చున్న కారును పోలీసులు లాక్కెళ్లినప్పుడు ఒక మహిళగా స్పందించిన గవర్నర్, కవిత విషయంలో ఎందుకు స్పందించలేదన్నారు. ఈ వ్యవహారంలో మేయర్ వినతి పత్రం ఇచ్చేందుకు కూడా అనుమతించరా? అని నిలదీశారు. సంజయ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని, ఆయనపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

కలసి నడుద్దాం

- ఎన్నికల్లో ఉమ్మడి పోరుకు కామ్రేడ్లు సిద్ధం
- ఏప్రిల్ 9న సీపీఐ, సీపీఎం భారీ సభ
- జాతీయ నేతలకు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: కామ్రేడ్లు ఎన్నికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కీలకమైన అయిదారు వేలమంది క్రియాశీలక కార్యకర్తలతో వచ్చే నెల 9వ తేదీన హైదరాబాద్‌లో ఉమ్మడి సమావేశం నిర్వహించాలని సీపీఐ, సీపీఎంలు నిర్ణయించాయి. ఈ సందర్భంగా ఉభయ పార్టీల నేతలు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఎంబీ భవన్‌లో సమావేశమయ్యారు. సీపీఐ తరపున కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, సీపీఎం తరపున తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని నిర్ణయించారు. వచ్చే నెల జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశంలో క్యాడర్‌కు మార్గనిర్దేశం చేసేందుకు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలకు చెందిన జాతీయ నేతలను ఆహ్వానిస్తారు. ఎన్నికల నాటి పరిస్థితులను బట్టి బీజేపీయేతర పార్టీలతో పొత్తులుంటాయి. పొత్తులతో సంబంధం లేకుండా 10 వేలకు పైగా ఓట్లున్న.. దాదాపు 20 అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. పొత్తులో భాగంగా ఆ స్థానాలను కోరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు రెండు పార్టీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకరిపై ఒకరు పోటీ చేసుకోకూడదనేది ప్రాథమికంగా నిర్ణయించారు.

పొత్తులపై ఇప్పటికీ గందరగోళమే..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తో సీపీఐ, సీపీఎంల పొత్తు వ్యవహారం ఇప్పటికీ గందరగోళంగానే ఉంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలకు పొత్తులో భాగంగా సీట్లు కేటాయించేది లేదని, కేవలం ఎమ్మెల్సీ స్థానాలు ఇచ్చి సరిపెడతామని బీఆర్‌ఎస్ అంటున్నట్టు జరుగుతున్న ప్రచారంపై కామ్రేడ్లు ఇంకా గరంగరంగానే ఉన్నారు. అవసరమైతే కాంగ్రెస్‌తోనైనా పొత్తుకు వెనుకాడబోమని వామపక్షాలు భావిస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

భద్రత ఉంటేనే అభివృద్ధి సాధ్యం

సీఐఎస్ఎఫ్ వ్యవస్థాపక వేడుకలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

సాక్షి, హైదరాబాద్/జవహర్‌నగర్: ఏ దేశమైనా అంతర్గతంగా సురక్షితంగా, శాంతిభద్రతలతో ఉంటేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. దేశాన్ని అంతర్గతంగా సురక్షితంగా ఉంచడంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) కీలకంగా పనిచేస్తోందన్నారు. భవిష్యత్‌లో దేశ ఆర్థికాభివృద్ధి, అన్ని రంగాల వికాసంలోనూ సీఐఎస్ఎఫ్ ప్రముఖ పాత్ర పోషించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నిసా)లో సీఐఎస్ఎఫ్ 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమిత్‌షా ఈ కార్యక్రమానికి హాజర య్యారు. తొలుత స్మారక స్థూపం వద్ద సీఐఎస్ఎఫ్ అమర జవాన్లకు ఆయన నివాళులర్పించారు. ఆ తర్వాత సీఐఎస్ఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని కేంద్ర ప్రభుత్వ భవన సముదాయాలు, ఎయిర్‌పోర్టుల వంటి అనేక సంస్థలకు భద్రత కల్పించడంలో సీఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని.. కేంద్ర హోం మంత్రిగా తాను ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నానన్నారు.



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వందో స్వాతంత్ర్య వేడుకల వరకు 5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడుల సేకరణను లక్ష్యంగా నిర్దేశించారని, ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు వచ్చేందుకు భద్రత అనేది కీలక అంశమని అన్నారు. 1930 మార్చి 12న మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారని, అదేరోజున సీఐఎస్ఎఫ్ వ్యవస్థాపక వేడుకలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సీఐఎస్ఎఫ్ భద్రత విధుల్లో సాంకేతికత వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం..

గతంతో పోలిస్తే కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాదుల హింసాత్మక ఘటనలు తగ్గాయని, ప్రజల్లోనూ కేంద్ర బలగాలపై విశ్వాసం పెరుగుతోందని అమిత్‌షా అన్నారు. భవిష్యత్తులోనూ ఉగ్రవాదాన్ని సహించేది లేదని, ప్రధాని మోదీ సర్కార్ అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, బండి సంజయ్, సీఐఎస్ఎఫ్ డీజీపీ షీల్‌వర్ధన్ సింగ్, నిసా డైరెక్టర్ కె.సునీల్ ఇమాన్యుయెల్, తెలంగాణ డీజీపీ అంజనీకుమార్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు..

హకీంపేటలోని నిసాలో ఆదివారం నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉగ్రమూకల దాడులను ఎలా తిప్పికొడతారు.. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది పనితీరు, అగ్నిప్రమాదాల సమయంలో సహాయక చర్యల వంటి విన్యాసాలను కళ్లకుకట్టినట్టు సీఐఎస్ఎఫ్ సిబ్బంది చూపారు. మహిళా సిబ్బంది ప్రదర్శించిన కలరిపయట్టు విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతకు ముందు 'అర్జున'పేరిట ఫైరింగ్ రేంజ్‌ను అమిత్‌షా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన అధికారులు, జవాన్లకు బహుమతులను అందజేశారు.

నువ్వా.. నేనా?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ నేడే

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం పోలింగ్ జరుగనుంది.మొత్తం 29,720 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 15,472, మహిళలు 14,246, ఇతరులు ఇద్దరు ఓటర్లు ఉన్నారు. 137 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. టీచర్లు వివిధ ప్రాంతాలకు బదిలీ అవ్వడంతో కొంతమందికి రెండుచోట్ల ఓట్లున్నట్టు అభ్యర్థులు అభ్యంతరాలు లేవనెత్తడంతో అధికారులు వాటిని తొలగించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల అంశాలు ఓటర్లను ప్రభావితం చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. 317 జీవో వల్ల నష్టపోయిన టీచర్లు, బదిలీలు, పదోన్నతులపై ఆశలు సన్నగిల్లిన టీచర్లను సంతృప్తిపర్చడం ఉపాధ్యాయ సంఘాలకు ఇబ్బందికరంగా మారింది. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 2017 ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు పోటీపడగా ఈసారి 21 మంది బరిలో ఉన్నారు. వరుసగా రెండుసార్లు విజయం సాధించిన కాటేపల్లి జనార్దన్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. ఆయన గత ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ మద్దతుతో గెలవగా, ఈసారి పీఆర్‌టీయూ తెలంగాణ మద్దతుతో పోటీ చేస్తున్నారు. పీఆర్‌టీయూటీఎస్ ఈసారి గుర్రం చెన్నకేశవరెడ్డిని బరిలోకి దించింది. వీరిద్దరి మధ్య ఓట్ల విభజన ఎలా ఉంటుందనేది కీలకం. తెలంగాణ యూటీఎఫ్ అభ్యర్థిగా మాణిక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఏవీఎన్ రెడ్డిని బీజేపీ అనుకూల సంఘాలు బలపరుస్తున్నాయి. సీపీఐ అనుబంధ సంఘం ఎస్‌టీయూటీఎస్ అభ్యర్థిగా బి.భుజంగరావు, టీపీటీఎఫ్, బీఎస్పీ మద్దతుతో ఆచార్య వినయ్‌బాబు, బీసీటీఏ నుంచి విజయకుమార్ పోటీచేస్తున్నారు. టీయూటీఎఫ్ మద్దతులో మల్లారెడ్డి, జీటీఏ సహకారంతో ప్రభాకర్, లోకల్ కేడర్ జీటీఏ మద్దతుతో రవీందర్ పోటీలో ఉన్నారు. కాటేపల్లి జనార్దన్ రెడ్డికి అప్పట్లో టీఆర్ఎస్ మద్దతు తోడైంది. ఈసారి అధికార పార్టీతో సంబంధం లేకుండా ప్రచారం నిర్వహించారు.

ఏపీలో ఎమ్మెల్సీ స్థానాలకు నేడు పోలింగ్

సాక్షి, అమరావతి : ఏపీలో సోమవారం జరగనున్న 9 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మూడు పట్టభద్రులు, రెండు టీచర్లు, నాలుగు స్థానిక సంస్థల నియోజక వర్గాలకు సంబంధించి మొత్తం 9 ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల భవిష్యత్తును 10,59,420 మంది ఓటర్లు నిర్ణయించనున్నట్లు చెప్పారు.

ఆఖరి వరకూ ప్రచారం

ప్రచారంలో అన్ని పక్షాలూ ఉపాధ్యాయ సంఘాలు ఓట్లున్న ప్రతీ స్కూల్, కాలేజీకి వెళ్లాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చివరి నిమిషం వరకూ ప్రయత్నించాయి. మూడు నెలలుగా అభ్యర్థులు వారి వ్యూహాల్లో మునిగి తేలుతున్నా, ఆఖరి మూడురోజుల్లో మాత్రం పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు డబ్బులు కూడా పంచినట్టు కొందరు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.



భట్టి విక్రమార్కది సాహసోపేత యాత్ర

ఏఐసీసీ కార్యదర్శి నదీమ్‌జావెద్

సాక్షి, హైదరాబాద్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సాహసోపేత యాత్ర చేస్తున్నారని, దానిని విజయవంతం చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావెద్ కోరారు. మండుటెండలను కూడా లెక్క చేయకుండా ఈ నెల 16 నుంచి జూన్ 15 వరకు రాష్ట్రంలోని 39 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 91 రోజులపాటు 1,365 కిలోమీటర్ల మేర నడవాలని భట్టి నిర్ణయించుకున్నారని, ఈ యాత్ర రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు దోహదపడుతుందన్నారు. భట్టి యాత్ర నేపథ్యంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలతో ఆదివారం గాంధీభవన్‌లో సమావేశం జరిగింది. భట్టి యాత్ర విజయవంతం చేసే ప్రణాళి కపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చర్చించారు. నదీమ్ జావెద్ మాట్లాడుతూ ఏఐసీసీ ఆదే శాల మేరకు చేస్తున్న ఈ యాత్రను విజ యవంతం చేసేందుకు నియోజక వర్గాల సమన్వ యకర్తలు కృషి చేయాలని చెప్పారు. ఏఐసీసీ మరో కార్యదర్శి రోహిత్‌చౌదరి మాట్లా డుతూ రేవంత్, భట్టిలతోపాటు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ కూడాయాత్ర ప్రారంభిస్తారని చెప్పారు.







Regd. Office: Hero MotoCorp Ltd., The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj - Phase -II, New Delhi - 110070, India. CIN: L35911DL1984PLC017354. It is our endeavour to improve our product. This could lead to changes in product specifications without notice. Accessories and features shown may not be a part of the standard fitment. Always wear a helmet while riding a two-wheeler. **As per the cumulative global production volume till 21st January 2021. ***Highest sales for any 2 Wheeler Corporate Entity in the world for Calendar Year 2022 - Data source: DNA Consult & Advisory's report Assessment of Global Two Wheelers Market (CY22). #Price is subject to change without any prior notice. *The offer is valid on select scooter models in select cities only, till stocks last, and is subject to change without any prior notice. T&C apply. For further information, contact nearest Hero MotoCorp authorised outlet (s) or call Toll Free No. 1800-266-0018 or visit website www.heromotocorp.com

Authorised Dealers: Hyderabad: Mody Hero, R.P. Road: Ph: 9289922146, Phoenix Hero, Habsiguda: Ph: 9289922515, Ramanthapur: Ph: 9246394475, Nagole: Ph: 9246394476, Kushaiguda: Ph: 9246824193, Bhanu Hero, Erragadda: Ph: 9289922148, Kukatpally: Ph: 9392525885, Miyanpur: Ph: 8790667999, Venkateshwara Hero, Narayanguda: Ph: 9289922145, 7799884320, Pragnapur: Ph; 8886642271, Sri Lakshmi Hero, Malakpet: Ph: 9289922155, Saroornagar: Ph: 9246223479, Vanasthalipuram: Ph: 9246223423, Phoenix Hero, Hi-tech City: Ph: 9289922759, Hafeezpet: Ph: 7799017976, Gopannapalli, Ph: 7093947427, Dealwel Hero, Nampally: Ph: 9289922827, Asifnagar: Ph: 9110704727, Narsingi: Ph: 97054 27429, Bibinagar: Ph: 6305974768, Attapur: Ph: 9177888606, Krishna Sai Hero, Malkajgiri: Ph: 9289922972, Lakshmi Hero, Somajiguda: Ph: 9289922147, Sri Venkanna Hero, Serilingampally: Ph :9640515185, Patancheru: Ph: 9289922150, Sowjanya Hero, Bahadurpura: Ph: 9289923133, Geetha Hero, Suchitra: Ph: 9289923134, Mahbubnagar: Ashvini Hero (Yenugonda) - Ph:9289922435, Ashvini Hero (Patha Palamoor) - Ph: 9949111933, Gadwal: Meghanath Hero, Ph:9289922967, Karimnagar: Bharadwaj Hero, Ph: 9289922510, Devesh Hero, Ph: 9289923163, Ramagundam: Siddi Shri Vinayaka Hero, Ph: 9289923076, Warangal: Sri Sri Sri Hero, Ph: 9289923103, Sree Vaishnavi Hero, Ph: 9289922498, Nizamabad: Sri Sai Durga Hero, (Kanteshwar) Ph: 9289922876, Venkateshwara Enterprises, (Vinayaka Nagar), Ph: 9289922153, Adilabad: Chandra Hero, Ph: 9289922156, khammam: Sri Sri Sri Hero, Ph: 9289922159, Kothagudem: Rajyalakshmi Hero, Ph: 9289922642, Bhadrachalam: Sri Ram Motors, Ph: 9289923048, Nalgonda: Venkataramana Hero, Ph: 9289922536, Miryalaguda: Sri Krishna Hero, Ph: 9289922161, Suryapeta: Sri Venkata Lakshmi Hero, Ph: 9289923007, Mancherial: Vera Motors, Ph: 9154973681, Sangareddy: Prudhvi Automotives, Ph:8978956777.



“ ఆశ అనేది మెలకువతో ఉన్న స్వప్నం.
– అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, మార్చి, 13

మాటలు పలుచన

జె.డి.శాలింజర్ తన నవల 'క్యాచర్ ఇన్ ద రై'తో ప్రఖ్యాతం. అమెరికాలో లక్షల మంది అభిమానులను సంపాదించుకుని ఒక్కసారి కలిస్తే చాలు, చెప్పేది వింటే బాగుండు అని తహతహలాడించాడు. కాని ఎప్పుడూ జనం మధ్యలోకి రాలేదు. శాలింజర్‌ని ఇంటర్వ్యూ చేయడానికి మహామహులు ప్రయత్నిస్తే ఆశాభంగమే ఎదురైంది. అమెరికాలో తన నవల 'హౌ టు కిల్ ఎ మాకింగ్‌బర్డ్'తో సంచలనం సృష్టించిన రచయిత్రి హార్పర్ లీ ఎవరినీ తన ఇంటిలోకి అడుగు పెట్టనీయలేదు. ఆమెని చూడాలని, ఇంటర్వ్యూ చేయాలని ఎందరో ప్రయత్నించి ఆమె ఇంటి గేట్ బయట నుంచే వెనుతిరిగే వారు. ప్రఖ్యాత కవి సాహిర్ లూధియాన్వీ తాను పాల్గొనే ముషాయిరాల్లో కవితా జ్ఞానం లేని శ్రోతలను గమనించాడంటే నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టేవాడు. సంఘంలో గొప్పలు చెప్పుకోవడానికి కొంతమంది శ్రీమంతులు అతడు పాల్గొనే ప్రయివేటు ముషాయిరాలకు వచ్చినా వారికీ అదే గతి పట్టేది. అతణ్ణి ఇంటర్వ్యూ చేయడం దుర్లభం. చేయాలనుకున్న వ్యక్తికి ఉర్దూ సాహిత్యం, కవిత్వం కూలంకషంగా తెలిసి ఉండాలి. 'నా గురించి నీకేం తెలుసో చెప్పు. అప్పుడు ఇంటర్వ్యూ ఇస్తాను' అనేవాడు.

మాటలకు చాలా విలువ ఉంటుంది. మాట్లాడే మనిషిని బట్టి, మాటలను వెలికి తీసే మనిషిని బట్టి ఆ సంభాషణ, ముఖాముఖికి విలువ వస్తుంది. ఓప్రా విన్‌ఫ్రే తన ఇంటర్వ్యూలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ఆమె తన నైపుణ్యంతో ఎదుటివారి మాటల్లో ఉండే జ్ఞాపకాల గాఢతను వెలికి తెస్తుంది. ఆమె మైకేల్ జాక్సన్‌ని ఇంటర్వ్యూ చేస్తే ఆ రోజుల్లో కోట్ల మంది టీవీలకు అతుక్కుపోయి చూశారు. ఇప్పటికీ అమెరికన్ టెలివిజన్ చరిత్రలో అదే ఎక్కువ వ్యూయర్‌షిప్ పొందిన ఇంటర్వ్యూ. అడిగేవారి అంతస్తు చెప్పే వారి అంతస్తు తాలుమేలుగా కలిసినప్పుడు వచ్చే విలువ, గౌరవం అది.

మన దేశంలో కూడా మంచి సంభాషణతో వ్యక్తిత్వాలను వెలికి తీసే పని స్త్రీలే మొదలెట్టారు. దూరదర్శన్‌లో నాటి బాలనటి తబస్సుమ్ చేసే టాక్ షోలకు విశేషంగా ఆదరణ ఉండేది. ఆమె తమను ఇంటర్వ్యూ చేయడం చాలామంది గౌరవంగా భావించేవారు. ఆ తర్వాత నటి సిమీ గెరేవాల్ చాలా విపులమైన ఇంటర్వ్యూలు చేసి అది చాలా శ్రద్ధతో పని చేయవలసిన రంగమని చాటింది. జయలలిత వంటి మొండిఘటం చేత తన ఇంటర్వ్యూలో పాట పాడించింది సిమీ. రతన్ టాటా, రాజీవ్ గాంధీ, రాజ్ కపూర్... వీరందరూ ఆమెతో మాట కలిపినవారిలో ఉన్నారు. రజత్ శర్మ 'ఆప్ కీ అదాలత్' ఒక భిన్నమైన ఫార్మాట్‌తో నింద–సంజాయిషీల ద్వారా చాలా మంది వ్యక్తిత్వాలను ప్రదర్శనకు పెట్టింది. ఆ తర్వాత చాలా కాలానికి ఆమిర్ ఖాన్ 'సత్యమేవ జయతే' షోతో ముఖాముఖి కార్యక్రమాలు తన వంటి సూపర్ స్టార్ నిర్వహించడం వల్ల వచ్చే సీరియస్‌నెస్‌ను, సామాజిక ప్రయోజనాన్ని లోకానికి తెలియచేశాడు.

అయితే రాను రాను ఈ మాటల సేకరణ ఒక జీవనోపాధిగా మారింది. ప్రముఖులతో సంభాషణలు వినోదానికి, హాస్యానికి, కాలక్షేపానికి వనరుగా మారాయి. కరణ్‌జోహార్ వంటి హోస్ట్‌లు మునిగాళ్ల లోతుకే ఎదుటివారిని ఉంచుతూ సగటు ప్రేక్షకులను ఉత్సుకత పరిచే కబుర్లను వినిపించడం మొదలెట్టారు. శేఖర్ సుమన్ 'మూవర్స్ అండ్ షేకర్స్' ఇదే కోవలోకి వస్తుంది. కపిల్ శర్మ వంటి వారు బయలుదేరి హాస్యం కోసం ఎదుట ఉన్నది ఎవరైనాసరే వారితో నేలబారు మాటలు మాట్లాడించవచ్చని నిరూపించారు. ప్రచారం కోసం, ఏదో ఒక విధాన గుర్తుండటం కోసం ఒకనాడు తమ తమ రంగాలలో ఎంతో కృషి చేసినవారు కూడా ఇలాంటి షోలకు హాజరయ్యి 'మీ ఇంట్లో సబ్బు అరిగిపోతే ఏం చేస్తారు?' వంటి ప్రశ్నలకు జవాబులు ఇస్తూ వారి అభిమానులను చానల్ మార్చేలా చేస్తున్నారు.

ఇప్పుడు ఈ మాటల సేకరణ పతాక స్థాయికి చేరింది. యూ ట్యూబ్ పుణ్యాన ప్రతి ఒక్కరూ కాసిన్ని వీడియోల కోసం, వాటి మీద వచ్చే జరుగుబాటు కోసం మైక్ పట్టుకుని సాంస్కృతిక, కళారంగాల్లో ఉన్న రకరకాల స్థాయి పెద్దల వెంటబడుతున్నారు. వీరికి తాము ఇంటర్వ్యూ చేస్తున్న కళాకారుల/సృజనకారుల గురించి ఏమీ తెలియదు. అధ్యయనం చేయరు. గతంలో ఏం జరిగిందో తెలియదు. ఇప్పుడు ఏం జరుగుతున్నదో తెలుసుకోరు. 'చెప్పండి సార్... చెప్పండి మేడమ్' అంటూ 'చెప్పండి' అనే ఒక్కమాట మీద ఇంటర్వ్యూలు 'లాగిస్తున్నారు'. విషాదం ఏమంటే గొప్ప గొప్ప గాయనీ గాయకులు, నటీనటులు, సంగీతకారులు, రచయితలు, రాజకీయవేత్తలు, దర్శకులు, నిర్మాతలు... వీరి 'బారిన' పడుతున్నారు. తమను అడుగుతున్నవారు 'పిల్లకాకులు' అని తెలిసినా క్షమించి జవాబులు చెబుతున్నారు. 'హోమ్ టూర్' అని వస్తే తమ ఇళ్లు బార్లా తెరిచి చూపిస్తున్నారు. పిచ్చి ప్రశ్నలకు హతాశులవుతూనే ఏదో ఒకటి బదులు ఇస్తున్నారు. వారికి ఉన్న అభిమానులు వారి పట్ల ఉండే గౌరవాన్ని పోగొట్టుకునేలా ఈ ఇంటర్వ్యూలు ఉంటున్నాయి. అన్నింటినీ మించి వీరి ఇంటర్వ్యూలలోని శకలాలను వక్రీకరించే థంబ్‌నైల్స్‌తో పోస్టులు వస్తుండటం దారుణం.

దినపత్రికలు పలుచబడి, అచ్చులో వచ్చే ఇంటర్వ్యూల స్థలం కుదింపునకు లోనయ్యాక సంభాషణలు, ముఖాముఖీలు ఇప్పుడు ఎలక్ట్రానిక్/డిజిటల్ మీడియాలోనే సాగుతున్నాయి. కొత్తగా మొదలైన ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ తమ సబ్‌స్క్రిప్షన్‌లు పెంచుకోవడానికి పాపులర్ సినిమా స్టార్‌లను రంగంలోకి దింపి ఆ స్టార్‌ల ములాజాతో ఇతర స్టార్‌లను పిలిపించి టాక్‌షోలు నిర్వహిస్తున్నాయంటే ఊహించుకోవచ్చు. ఈ షోలన్నీ ఉంటే ఉండొచ్చు. కాని మాటను పలుచన చేయరాదు.

పెద్దలారా! మాటకు విలువివ్వండి! మీ పెద్దరికానికి మాటతో మాట రానీకండి!!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.షష్ఠి సా.6.33 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: అనూరాధ తె.5.30 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: ఉ.9.58 నుండి 11.34 వరకు, దుర్ముహూర్తం: ప.12.32 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: రా.7.22 నుండి 8.54 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 6.05
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

కాంగ్రెస్ కథ ముగిసినట్టా?

కామెంట్



కరణ్ థాపర్

తమ పార్టీ తిరిగి ఎలాగైనా లేస్తుందని ఏ రాజకీయ నాయకుడైనా నమ్ముతాడు. ఆ పునరుజ్జీవనం తదుపరి ఎన్నికల్లో లేదా కొన్ని ఎన్నికల తర్వాత జరగవచ్చు. అలాంటప్పుడు ఆ పార్టీ పని అయిపోయిందని చెప్పడం 'హాస్యాస్పదమైన ఆలోచన' అవదా? కానీ వరుసగా రెండుసార్లు ఘోర పరాజయాలు ఎదుర్కొన్న కాంగ్రెస్ పార్టీ విషయంలో అది ఎంతమాత్రమూ హాస్యాస్పదం కాకపోవచ్చు. పార్టీలు ప్రభ కోల్పోతాయన్న విషయాన్ని ఆమోదించడానికి మీరు ఒకప్పటి బ్రిటన్ ఉజ్జ్వలమైన ఉదారవాదుల కేసి చూడనవసరం లేదు. మన దేశంలోనే అలాంటి ఘటనలు చాలా సమీపంలో జరిగాయి. స్వతంత్ర, జనతా పార్టీ, బహుశా భారత కమ్యూనిస్టు పార్టీకి కూడా అలాంటి స్థితి ఏర్పడింది. కాంగ్రెస్ సొంత ఉదంతం విషయానికి వస్తే – బిహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల్లో క్షీణతను చవిచూశాక, అది అధికారంలోకి రాలేకపోయింది.

ఓటమికి సంబంధించిన నిరాశా నిస్పృహల నడుమ ఉంటున్నప్పటికీ, తమ పార్టీల పునరుజ్జీవన సంకేతాలను రాజకీయ నాయకులు చూస్తున్నట్లయితే అది అర్థం చేసుకోదగినదే. ఆ పునరుజ్జీవనం తదుపరి ఎన్నికల్లో లేదా కొన్ని ఎన్నికల తర్వాత జరగవచ్చు. అలాంటప్పుడు వరుసగా రెండుసార్లు ఘోర పరాజయాలు ఎదుర్కొన్న కాంగ్రెస్ పని అయిపోయిందని చెప్పడం 'హాస్యాస్పదమైన ఆలోచన' అవుతుందా? కచ్చితంగా కాదు.



ప్రభ కోల్పోయిన పార్టీలు

పార్టీలు ప్రభ కోల్పోతాయన్న విషయాన్ని ఆమోదించడానికి మీరు ఒకప్పటి బ్రిటన్ ఉజ్జ్వలమైన ఉదారవాదుల కేసి చూడనవసరం లేదు. మన దేశంలోనే అలాంటి ఘటనలు చాలా సమీపంలో జరిగాయి. స్వతంత్ర, జనతా పార్టీ, బహుశా భారత కమ్యూనిస్టు పార్టీకి కూడా అలాంటి స్థితి ఏర్పడింది. కాంగ్రెస్ సొంత ఉదంతం విషయానికి వస్తే – బిహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల్లో క్షీణతను చవిచూశాక, అది అధికారంలోకి రాలేక పోయింది.

అయినప్పటికీ, కాంగ్రెస్ కథ 'ముగిసిందని' చెప్పడం హాస్యాస్పదమైనదని రాహుల్ గాంధీ అతిశయిస్తున్నారంటే దాన్ని నిజమని రుజువు చేయాల్సి ఉంటుంది. ఊరికే వేచి ఉండడం ద్వారా, మంచి జరుగుతుందని ఆశించడం ద్వారా అది జరగదు. ప్రొఫెసర్ సుహాస్ పల్శీకర్ ఎత్తి చూపినట్లుగా, 'బహుళ పార్టీ సమాఖ్య రాజకీయాల్లో పోటీలో ఉండటం' అనేది దాదాపు కాంగ్రెస్‌కు 35 ఏళ్లనుంచీ సవాలుగానే ఉంటోంది. 1989లో పార్టీ అధికారం కోల్పోయినప్పుడు ఇది ప్రారంభమైంది. అప్పటి నుంచి అది ప్రభుత్వంలో ఉంటూ వచ్చినప్పటికీ, మెజారిటీని ఎన్నడూ గెలుచుకోలేదు. త్వరలోనే ఈ సవాలు 'దాటలేనిది'గా మారి పోయింది.

అలా జరగకూడదంటే, కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా, రాజకీయ సమీకరణల పరంగా రెండు రంగాల్లో తప్పక పనిచేసితీరాలని పల్శీకర్ విశ్వాసం. ఆ పార్టీ ఆయన సలహాను పాటించడానికి సమ్మతించక పోయినప్పటికీ, ఉజ్జ్వల ప్రతిపక్షాన్ని కోరుకుంటూ, కాంగ్రెస్ పునరుత్థానం పై నమ్మకం పెట్టుకున్న మనలాంటి వారికి అది మంచి ఆశను కలిగిస్తోంది.

ఎన్నికలే ప్రాణవాయువు

రాజకీయ సంస్థ గురించి పల్శీకర్ రెండు అంశాలు చెబుతున్నారు. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, పార్టీ పనితీరును ప్రజాస్వామ్యీకరించడమే! వర్కింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించకపోవడం ద్వారా, పార్టీ ప్రజాస్వామ్యీకరణ విషయంలో కాంగ్రెస్ విఫలమైంది. ఎన్నికలు సృష్టించే మథనం పార్టీకి 'ప్రాణ వాయువు'ను ఇస్తుంది కాబట్టి ఇది ముఖ్యమైనదని పల్శీకర్ అంటారు. నామినేషన్లు అనేవి సుప్తావస్థను కొన సాగేలా చేస్తాయి.

రెండో సంస్థాగతమైన అవసరం ఏమిటంటే, ఒక కుటుంబానికి ఒక పదవి అనే నిబద్ధతను పూర్తి చేయడమే! ఇది గాంధీలకు మాత్రమే అన్వయించదు. 'స్థానిక పార్టీ యూనిట్లను నియంత్రించే అనేక కుటుంబాల స్థిరపడిన ఆసక్తులతో ఇది ఎక్కువగా ముడిపడి ఉంది. ఇది ఎక్కువగా స్థానిక రాజకీయాల నిర్వహణకు సంబంధించినది'. ఈ ఆధిపత్య కుటుంబాలు 'యువ కార్యకర్తలను స్పర్థాత్మక రాజకీయాల్లోకి అనుమతించడం' ముఖ్యమని గుర్తించాల్సిన అవసరం ఉంది.

రాజకీయ సమీకరణపై కూడా పల్శీకర్ రెండు అంశాలను జోడించారు. పెద్ద మాటలు, పవిత్రమైన ఆశలను పక్కనపెడితే... కాంగ్రెస్ పార్టీ నిర్దాక్షిణ్యమైన పోటీదారును ఎదుర్కొంటున్న సమయంలో సంకీర్ణం కోసం సరైన ఫార్ములాను ఎంచుకోవలసిన అవసరముంది. ఆయన సలహా సరళమైనదే కానీ పదునైనది. 'కాంగ్రెస్ పార్టీ మరింత నమ్రతతో ఉండడానికి సిద్ధం కావలసి ఉంటుంది'. మరో మాటలో చెప్పాలంటే, కాంగ్రెసే నాయకత్వం వహిస్తుందని పట్టుబట్టొద్దు.

సమర్థంగా వివరించాలి

సమీకరణ గురించిన రెండో అంశం మరింత సవాలుతో కూడుకున్నది. ఇది కాంగ్రెస్ సైద్ధాంతిక సందేశానికి సంబంధించింది. 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, మతతత్వం వంటి అంశాలపై ప్రజారాశులను పార్టీ ఎలా మేల్కొల్పబోతోంది?' ఎందుకంటే ఇవి సాధారణ ప్రజలు పెద్దగా పట్టించుకోని నైరూప్య భావనలు. వారి రోజువారీ జీవితాలకు అనువుగా వీటిని సమర్థంగా వివరించకుంటే ఫలితం ఉండదు. ఇప్పటికైతే వీటిని చెబుతున్నప్పుడు వాటి అర్థం నష్టపోతోంది.

బీజేపీకి వ్యతిరేకంగా మతతత్వ ఆరోపణల గురించి మాట్లాడే విషయాలను పల్శీకర్ ప్రత్యేకించి నొక్కి చెప్పారు. 'మంచి హిందువుగా ఉండటం లేదా మంచి జాతీయవాదిగా ఉండటానికి ముస్లిం వ్యతిరేకిగా ఉండాల్సిన అవసరం లేదని సగటు హిందువుకు అర్థం అయ్యేట్టు చెప్పాలి, ఇది కొంచెం కష్టమైన పనే'. దీనికి సమాధానం ఏమిటంటే తన సొంత హిందూ విశ్వసనీయతపై ఆడంబరంగా చెప్పుకోవలసిన పనిలేదు కానీ హిందూయిజం గురించి కాంగ్రెస్ మాట్లాడాల్సి ఉంది. దానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం గురించి అది విభిన్నరీతిలో నొక్కి చెప్పాల్సి ఉంది. కానీ ఇది చేయడం కంటే చెప్పడం సులభం!

హాస్యాస్పదం కాదు

కాంగ్రెస్ పార్టీ తన సందేశాన్ని సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించడం ఓటర్ల దృష్టిలో ఎంతో విలువైన విషయం. కులం, తెగ, సంస్కృతి, ఆహార ప్రాధాన్యతలు వంటి అంశాల్లో వ్యత్యాసాలను అధిగమించడం చాలా కష్టమైన పని.

ఇది నేను ఎక్కడ మొదలెట్టానో అక్కడికే నన్ను తీసుకెళుతోంది. సవాలును కాంగ్రెస్ అధిగమించలేకపోతే, పార్టీ భవిష్యత్తు సందేహంలో పడుతుందని సుహాస్ పల్శీకర్ చెప్పడం నిజంగా హాస్యాస్పదమైన విషయమేనా? కాకపోతే ఈశాన్య భారత్‌లో ఫలితాలు భిన్నమైన విషయాన్ని సూచిస్తున్నాయి. అయినా కూడా రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను నిలుపుకోవడంలో విఫలమైతే, కర్ణాటకలో గెలుపు సాధించలేకపోతే మాత్రం అది స్పష్టమైన సంకేతం. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికలు ఎటూ ఉండనే ఉన్నాయి.

అయితే, అయితే, అయితే... బ్రిటన్‌లో కేమరాన్ నాయకత్వంలో తిరిగి అధికారంలోకి రావడానికి ముందు వరుసగా మూడు ఎన్నికల్లో టోరీలు ఓడిపోయారు. లేబర్ పార్టీ అదృష్టాన్ని టోనీ బ్లెయిర్ మార్చివేయడానికి ముందు నాలుగు సార్లు ఆ పార్టీ కూడా అపజయం ఎదుర్కొంది. అయితే, రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి అలాంటిది తెచ్చిపెట్టగలరా అనేదే ప్రశ్న!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గోలగోల!



ఇండియన్ ఎయిర్ పోర్టు లౌంజులు ఈరోజుల్లో చేపల మార్కెట్లలా ఉంటున్నాయి. మొత్తంగా విస్మరించదగినవి!

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

అంతటా ఉన్నారు



వీధుల్లో లైంగిక హింసకు ఎక్కువగా పాల్పడేది ఉత్తర భారత మగవాళ్లు అని కొంతమంది చెబుతున్నారు. నిజం చెప్పాలంటే, ఇలాంటి వ్యాఖ్యలు చేసేవాళ్లు దేశంలో తగినంతగా ప్రయాణించలేదని అర్థం.

– మంజులా నారాయణ్, జర్నలిస్ట్

ఆమె తీరు



నేను విమానంలో ఉన్నాను. ఫస్ట్ క్లాసులో నా పక్కన కూర్చున్న వ్యక్తికి లక్ష డాలర్లు చెల్లిస్తానన్నా కూడా తన మాస్కును తీయడానికి ఒప్పుకోలేదు. అది కూడా అవి పనిచేయవని నేను వివరించిన తర్వాత! ప్రయాణమంతా మాస్కులోనే ఉంది. ఆమె ఒక ఫార్మా కంపెనీలో పనిచేస్తోంది.

– స్టీవ్ కిర్ష్, కోవిడ్–19 ట్రీట్‌మెంట్ ఫండ్ స్థాపకుడు

నచ్చని మాట



నాకు 'సాలీ ఆధీ ఘర్‌వాలీ' (మరదలు అర పెళ్లాం) అన్న వాక్యం విన్నప్పుడల్లా అసహ్యం పుడుతుంది. అసలు ఎవరైనా అలా ఎందుకు అనాలి? ఆమె నీ అర్ధ భార్య ఎంత మాత్రమూ కాదు!

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

అసలు రంగు



మహిళలు, బాలికల పట్ల చెడుగా ప్రవర్తించడానికి హోలీ ఒక సాకు కాగలదని ఒప్పుకొందాం. నీచమైన వ్యాఖ్యలు, చిల్లర తంత్రాలకు రంగులు, తాగుబోతుతనం అనేవి మాస్కులుగా మారాయి. చాలామంది మహిళలు ఈ రకమైన హింసను అనుభవించినవారే. ఇది పండుగను తప్పు పట్టడం కాదు. మగవాళ్లు ఏం చేయగల సమర్థులో బయటపెట్టడం.

– వైశాలీ మాథుర్, ప్రచురణకర్త

ఇలా చేయొచ్చు



ప్రతీ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా చాలామందిని 'ఫ్లూ' ప్రభావితం చేస్తుంది. ఈ సంవత్సరం హెచ్3ఎన్2 ప్రత్యేకించి చీకాకైన అనారోగ్యం కలిగిస్తోంది. లక్షణాలు ఏవంటే– తీవ్ర జ్వరం, చలి, దగ్గు, ముక్కు దిబ్బడ, డయేరియా, తల, ఒంటి నొప్పులు. దీనికి చికిత్స: ప్యారాసెటమాల్ మాత్రలు, విశ్రాంతి, ద్రవాలు, ఆవిరి పట్టడం, పుక్కిలింతలు.

– జోయితా, ఫిజీషియన్

స్వేచ్ఛాదేశం



సున్నీ ముస్లింలు తమ మతాన్ని ఇరాన్‌లో స్వేచ్ఛగా అనుసరించలేరు. షియా ముస్లింలు తమ మతాన్ని సౌదీ అరేబియాలో స్వేచ్ఛగా అనుసరించలేరు. అహ్మదీయ ముస్లింలు తమ మతాన్ని పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా అనుసరించలేరు. షియాలు, సున్నీలు, అహ్మదియాలు స్వేచ్ఛగా తమ మత హక్కును అనుసరించగలిగే దేశం– ఇండియా!

– ఒమర్ ఘాజీ, రచయిత

అక్షర రూపంతో అందరికీ ఉపయోగమే!

విశ్లేషణ



మంగారి రాజేందర్

న్యాయవాది (స్థాయి)ని చూసి కోర్టులు తీర్పులు ఇస్తాయన్న అభియోగం ఉంది. ప్రజలు ఆ విధంగా అనుకునే విధంగా పరిస్థితులూ ఉన్నాయి. రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఉన్నప్పటికీ ఫేస్ వ్యాల్యూ కోసం ఢిల్లీ నుంచి పెద్ద తలకాయను దాదాపు ప్రతి రాష్ట్రం దిగుమతి చేస్తూనే ఉంది. ఈ అభిప్రాయం పోవాలంటే ఆ న్యాయవాదులు ఏం వాదనలు వినిపిస్తారో ప్రజలకు తెలియాలి. అది తెలిస్తే ఈ అభిప్రాయం తొలగిపోవడానికి అవకాశం ఉంది.

ఈ మధ్య కోర్టులోని వాదనలనూ, అదేవిధంగా ప్రొసీడింగ్స్‌నూ లైవ్‌లో చూపించే విధంగా సుప్రీంకోర్టు, హైకోర్టులు చర్యలు తీసుకుంటున్నాయి. అయితే వీటిని మొదట కోర్టులో ప్రయోగాత్మకంగా చేస్తున్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు మరో ప్రయోగాన్ని చేస్తోంది. న్యాయవాదులు చేసే వాదనలన్నీ వెనువెంటనే అక్షర రూపంలోకి మార్చడానికి అవసరమైన చర్యలను ప్రయోగాత్మకంగా సుప్రీంకోర్టు చేపట్టింది. ఈ విషయాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఇటీవల ప్రకటించారు. ఆ విధంగా అక్షర రూపంలోకి మారిన వాదనలను 'శాశ్వత రికార్డు'గా కూడా ఉంచే విధంగా ప్రయత్నం చేస్తామని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ ప్రయోగాన్ని రాజ్యాంగ బెంచి విచారణల కోసం మాత్రమే పరిమితం చేశారు.

దేశంలోని అన్ని వ్యవస్థల కన్నా కోర్టులు చాలా బెటర్. ఇవి బహిరంగ విచారణలు చేస్తాయి. భారత ప్రధాన న్యాయమూర్తి కోర్టులో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి ప్రజలు ఎవరైనా ఆ కోర్టుకి వెళ్ళి చూడ వచ్చు. న్యాయమూర్తుల చర్చలు బహిరంగ కోర్టులో ఉంటాయి. ఈ పరిస్థితిని ఏ రాజ్యాంగ సంస్థలలోనూ చూడలేం. అయినా కూడా ప్రజలకు ఏవో అభిప్రాయాలు కోర్టుల మీద ఉన్నాయి. ప్రత్యక్ష ప్రసారాల వల్ల కోర్టుల పనితీరును దేశంలోని మారుమూల ప్రజలు కూడా తెలుసు కునే అవకాశం ఏర్పడుతుంది. ట్రాన్స్‌క్రిప్షన్ అనేది మరో అడుగు. దీనివల్ల న్యాయవ్యవస్థ ప్రజలకు మరింత చేరువ వుతుంది. ఈ వాదనల అక్షరీకరణ ఎలా పని చేస్తుందో చూడాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. ఈ చర్యను దేశంలోని అనేక మంది న్యాయవాదులు స్వాగతించారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయని అంటున్నారు. న్యాయస్థానాల్లో వాదనలు కూడా మెరుగుపడతాయని భావిస్తున్నారు.

కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను ఈ పని కోసం వినియోగిస్తున్నారు. కోర్టులో జరిగే వాదనలు, న్యామూర్తులు వేసే ప్రశ్నలు, జవాబులు అన్నీ ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా అక్షర రూపం దాలుస్తాయి. జరిగిన వాదనలను ఆ మరురోజు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లోకి పంపించి ప్రజలకి అందుబాటులో ఉంచుతారు. అంతేకాదు, ముందుగా వీటి ప్రతులను ఆ వాదనలను చేసిన న్యాయవాదులకి అందజేసి వైరుధ్యాలు ఉంటే సరి చేస్తారు.

ఒకేసారి ఇద్దరు ముగ్గురు మాట్లాడితే అది అక్షర రూపంలోకి మారడంలో కొంత సమస్యగా మారే అవకాశం ఉంది. ఈ అక్షర రూపంలోకి మారిన వాదనలను ఎట్లా అప్‌లోడ్ చేయాలన్న విషయంలో ఎలాంటి నియమాలూ ఖరారు కాలేదు. పారదర్శకత, జవాబుదారీతనం కోసం కోర్టు



కార్యకలాపాలను ప్రసారం చేయాలని సుప్రీంకోర్టు 2018లో పేర్కొంది. ప్రత్యక్ష ప్రసారాల గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయవాది ఇందిరా జైసింగ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆడియో వీడియో విజువల్స్‌ను, అక్షర రూపంలో వాదనలను మార్చడం మంచిదని అప్పటి అటార్నీ జనరల్ కె.కె వేణుగోపాల్ సిఫార్సు చేశారు. జాతీయ ప్రాముఖ్యం ఉన్న కేసుల్లో విద్యార్థులకు తమ జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి.

ఈ ప్రయోగం వల్ల అనవసర వాదనలు తగ్గు ముఖం పడతాయి. వాదనలు అక్షర రూపంలో అందు బాటులోకి రావడం వల్ల న్యాయవాదులకు, పరిశోధకులకు అదే విధంగా న్యాయ వ్యవస్థలోని భాగస్వాములందరికీ ఇది ఉపయోగపడుతుంది. న్యాయవాదుల్లో తెలియకుండానే ఓ క్రమశిక్షణ ఏర్పడి అవసరమైన వాదనలను మాత్రమే కోర్టు ముందు చేస్తారు.

వాదనలను అక్షర రూపంలోకి మార్చే ప్రక్రియ ద్వారా తమ ప్లీడింగ్స్‌లోనే వాదనలను సమకూరుస్తారనీ, ఇవి న్యాయ వాదులకు గొప్ప వనరుగా ఉపయోగపడతాయనీ ప్రొఫెసర్ మోహన్ గోపాల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. న్యాయవాదులు చేసిన వాదనలు కోర్టు తీర్పుల్లో కనిపించడం లేదని చాలామంది న్యాయవాదులు తరుచూ అంటూ ఉంటారు. ఆ విధంగా తీర్పులు చెప్పే పరిస్థితి కూడా తగ్గి పోయే అవకాశం ఉంది.

కోర్టు కార్యకలాపాలను చాలా వెబ్‌సైట్లు రిపోర్టు చేస్తు న్నాయి. ఆ రిపోర్టు కూడా మంచిగా రావడానికి ఇవి ఉపయోగపడతాయి. ప్రత్యక్ష ప్రసారాల వీడియోలను ఆసాంతం చూడడం కొన్నిసార్లు కష్టసాధ్యం అవుతుంది. ఆ వాదనలు, న్యాయమూర్తుల ప్రశ్నలు – జవాబులు అక్షర రూపంలోకి మారడం వల్ల చదువుకోవడం సులువవుతుంది. అవసరమైన భాగాన్ని హైలెట్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.


కొద్ది సంవత్సరాలుగా 'లైవ్ లా', 'బార్ అండ్ బెంచ్' అన్న వెబ్‌సైట్లు కోర్టుల్లోని ప్రముఖమైన కేసులలోని వాదన లను ఎప్పటికప్పుడు పాఠకులకు అందిస్తున్నాయి. ఇప్పుడు ఈ వాదనలు అక్షర రూపంలోకి మారడం వల్ల కోర్టులో సీనియర్ న్యాయవాదులు ఎలా వాదనలు చేశారన్న విషయం తెలుస్తుంది. యువ న్యాయవాదులకే కాదు, దేశంలోని చాలా మందికి కోర్టు కార్యకలాపాలు తెలుసుకునే వీలు కలుగుతుంది. సీనియర్ న్యాయవాదులు ఉంటేనే కేసులు గెలుస్తామన్న అభిప్రాయం కూడా తగ్గిపోయే అవకాశం ఉంది. వాదనల గురించి తెలిస్తే కేసు గురించి బాగా తెలుస్తుంది. కేసు గెలవడానికి, ఓడిపోవడానికి దారి తీసిన పరిస్థి తులు బోధపడతాయి.

కోర్టు కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాలు ఎంత అవసరమో, వాదనలు అప్పటికప్పుడు అక్షరరూపం దాల్చి ప్రజలకు అందుబాటులోకి రావడమూ అంతే అవసరం. ఇది విజయవంతం అయితే న్యాయ చరిత్రలో మరో మైలురాయి చేరుకున్న వాళ్ళం అవుతాం.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి

అహింసా స్వరూపం

ఇది హింస, ఇది అహింస అని స్పష్టంగా నిర్వచించడానికి సాధ్యం కాదు. నదులు, సముద్రాలు, భూమి, ఆకాశం అన్నీ ప్రాణులతో కూడుకుని ఉన్నాయి కాబట్టి... అన్ని పనులలో కొంత హింస జరగక తప్పదు. హింస అస్సలు చేయకుండా మానవ జీవితం గడవదు. ఈ విషయాన్ని గుర్తించలేని కొందరు తాము ఎప్పుడూ హింస చేయలేదని భావిస్తూ ఉంటారు. కేవలం కందమూలాలూ, ఫలాలూ తిని జీవించే మునులు కూడా అహింసావ్రతులు కారు. కంద మూలాలలోనూ ప్రాణం ఉంటుంది కదా! అదీ హింసే అవుతుంది. నాగలితో రైతు భూమిని దున్నేటప్పుడు ఆ నాగలి కర్రుకు తగిలి ఎన్ని జీవాలు చచ్చిపోతాయి? అది హింస కాదనగలమా! మనుషులు నేలపై నడిచేటప్పుడు కాళ్ళ కింద వేల కొద్దీ ప్రాణులు చచ్చిపోతాయి. ఇది హింస కాదా! రోజూ మనం దోమలను అసంఖ్యాకంగా చంపుతుంటాం. అదీ హింసే! కాని వాటిని నిర్మూలించకపోతే మన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.



జ్యోతిర్మయం

అహింసా స్వరూపంలో ధర్మ సూక్ష్మముంది. మన ప్రాణాలకు, జీవితాలకు హాని కలుగుతున్నప్పుడు ఇటువంటి హింస చేయక తప్పదు. ఇతరులకు మేలు చేసే అసత్యం చెప్పటంలో తప్పులేనట్లే ఇదీనూ! అందువల్ల, హింస చేయనివారు ఒక్కరైనా ఉండరు. అయితే, తమకు సాధ్యమైనంత వరకూ హింసకు దూరంగా ఉండి జీవన యాత్ర సాగించటం ఉత్తమ లక్షణం.

ఇతరులకు అనవసరంగా బాధ కలిగించటం, హాని చేయటం మానసిక హింస. అసత్యాలు పలకటం; కఠినంగా, పరుషంగా మాట్లాడటం వాచిక హింస. ఇతరుల్ని గాయపరచడం, కొట్టడం, చంపడం శారీరక హింస. ఇటువంటి పనులు చేయకుండా ఇతర ప్రాణులకు మనసా, వాచా, కర్మణా కీడు తలపెట్టకుండా ఉండడమే అహింస. అన్ని ధర్మాలలోకీ అహింస ఉత్తమోత్తమ ధర్మమని పెద్దలు చెబుతారు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

3న పార్లమెంట్ వద్ద ప్రదర్శన


చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): జనాభా ప్రాతిపదికన బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 3న పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో ఆర్.కృష్ణయ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50శాతం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీల దామాషా నిష్పత్తి కంటే ఎక్కువగా 11 ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చిన ఘనత ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

ఏప్రిల్ నుంచి పే స్కేల్ ఇవ్వాలి

- వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర చైర్మన్ విజయ్


సభకు ర్యాలీగా వస్తున్న వీఆర్‌ఏలు

యాదగిరిగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచి పే స్కేల్ అమలు చేయాలని తెలంగాణ వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర చైర్మన్ ఆర్.విజయ్ డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆదివారం తెలంగాణ వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కె.సత్యనారాయణ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఏలు హాజరైన సభలో విజయ్ మాట్లాడుతూ.. హామీల అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 80 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశామని తెలిపారు. ఆ సమయంలో 70మంది వీఆర్‌ఏలు మరణించారని.. మూడు నెలల జీతం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో మునుగోడు ఉప ఎన్నిక రావడంతో మంత్రి కేటీఆర్ చర్చలు జరిపి నవంబర్ 7న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఉప ఎన్నిక ముగిసి 5 నెలలవుతున్నా హామీలు నెరవేర్చకపోవడంతో మునుగోడు నుంచి యాదాద్రి వరకు 98 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు కంది శిరీషారెడ్డి పాల్గొన్నారు.

షర్మిలపై వ్యాఖ్యలు కమిషన్‌కు కనిపించలేదా?

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత


అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌టీపీ నేతల నిరసన

కవాడిగూడ (హైదరాబాద్): ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపిన బీఆర్‌ఎస్ నేతలు.. వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అనేకమార్లు పరుష పదజాలం వాడినప్పుడు ఎందుకు స్పందించలేదని పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గడిపల్లి కవిత ప్రశ్నించారు. మహిళలపై బీఆర్‌ఎస్ నేతలు అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు గడిపల్లి కవిత ఆధ్వర్యంలో ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ మహిళలతో కలిసి వినతిపత్రం అందజేశారు.

పూర్వ నేతలకు కాంగ్రెస్‌లో ప్రాధాన్యం

సాక్షి, హైదరాబాద్: గతంలో ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ పార్టీల్లో పనిచేసిన వారంతా వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఎన్‌ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్‌లలో గతంలో పనిచేసిన వారికి పార్టీలో ప్రాధాన్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ మాజీ నేతల సమావేశం జరిగింది. ఇందులో ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బండెక్కితే భయమే!

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

రోడ్డెక్కగానే బండిని రయ్‌మంటూ పరుగెత్తిస్తారు.. జన సంచారం ఉండని హైవేలపై అయితే వాయు వేగంతో పోటీ పడతారు.. ఇలా దూసుకుపోతే ఆ కిక్కే వేరనుకుంటారు.. దీనికోసం ట్రాఫిక్ నిబంధనలనూ బేఖాతరు చేస్తారు.. ఇందులో కిక్కు ఎంత వస్తుందో వారికే తెలుసుగానీ.. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోవడం మాత్రం పెరిగిపోతోంది. రహదారులపై బ్లాక్ స్పాట్లు, వాహన వేగ నియంత్రణలో వైఫల్యం, హెల్మెట్, సీటుబెల్టు పెట్టుకోవడంలో నిర్లక్ష్యం వంటివి వేలకొద్దీ మరణాలకు కారణమవుతున్నాయి. కరోనా అనంతరం వ్యక్తిగత వాహనాల వినియోగం బాగా పెరిగింది. దీనితో రోడ్లపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువై ప్రమాదాలు–మరణాల శాతం పెరగడానికి దారితీస్తోందని నిపుణులు చెప్తున్నారు. ప్రమాద మృతుల్లో 35ఏళ్ల లోపు వారే 46.3శాతం ఉంటుండటంపై ఆందోళన కరమని పేర్కొంటున్నారు. 2021 సంవత్సరానికి సంబంధించి కేంద్ర రవాణాశాఖ ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో వెల్లడించిన గణాంకాలు ఈ పరిస్థితిని స్పష్టంగా చూపుతున్నాయి.

కరోనా తర్వాత పెరిగిన వాహన ప్రమాదాలు

- మితిమీరిన వేగం, నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యంతో మరణాలు
- ప్రమాద మృతుల్లో 18–35 ఏళ్ల మధ్యవారే అత్యధికం
- ఢిల్లీ, చెన్నైతోపాటు హైదరాబాద్‌లోనూ ఇదే పరిస్థితి
- రోజూ 20 మరణాలతో దేశంలో టాప్ టెన్‌లో తెలంగాణ
- బ్లాక్ స్పాట్ల గుర్తింపు, సరిదిద్దడంపై నెమ్మదిగా సాగుతున్న కార్యాచరణ



అతి వేగమే.. చంపేస్తోంది

- రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారిలో 18–35 ఏళ్లలోపు వారే అత్యధికంగా (46.3శాతం) ఉన్నారు. ఇందులోనూ 45.1శాతం టూవీలర్స్‌పై, 12.9 శాతం కార్లలో ప్రయాణిస్తున్నవారుకాగా.. 18.9శాతం మంది పాదచారులు.
- 71.7శాతం ప్రమాదాలు అతివేగంతో డ్రైవర్ వైఫల్యం వల్లే చోటు చేసుకున్నాయి. ఇందులో 31 శాతం కొత్త వాహనాలు (5 ఏళ్లలోపువే) నడిపే వారే చేశారు. 9.5 శాతం మంది మద్యం–సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదాల బారినపడ్డారు.
- ప్రమాదాలు చేసిన వారిలో ఏడు శాతం మందికి లైసెన్స్‌లు కూడా లేకపోవడం గమనార్హం.
- నేషనల్ హైవేలపైనే అత్యధిక ప్రమాదాలు–మరణాలు చోటు చేసుకున్నాయి. 2021లో 1,28,825 (31.6శాతం) ప్రమాదాలు, 56,007 మరణాలు హైవేలపైనే నమోదయ్యాయి. ఆ ఏడాది తెలంగాణలోని హైవేల 2,735 మంది చనిపోయారు.
- 10 లక్షలు జనాభా దాటిన నగరాల్లో రోడ్డు ప్రమాదాల విషయంలో చెన్నై, ఢిల్లీ, జబల్‌పూర్‌లో తొలి మూడు స్థానాల్లో ఉండగా.. హైదరాబాద్ 8వ ప్లేస్‌లో ఉంది. మహానగరాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 25 శాతం మంది పాదచారులే.

హైవేలపై లోపాలు సరిదిద్దక..

తెలంగాణ మీదుగా వెళుతున్న ప్రధాన హైవేలపై లోపాలను సరిదిద్దే అంశం వేగంగా ముందుకు కదలటం లేదు. అత్యధిక ప్రమాదాలు జరిగే హైవే–65 (మచిలీపట్నం- హైదరాబాద్- పుణే), హైవే–44 (కన్యాకుమారి–కశ్మీర్), హైవే–563 (భూపాలపట్నం–హైదరాబాద్)లపై పలుచోట్ల ఇంజనీరింగ్ లోపాలను గతంలోనే గుర్తించారు. వాటితో ప్రమాదాలు జరుగుతున్నట్టూ తేల్చారు. కానీ వాటిని సరిదిద్దే విషయంలో జాప్యం జరుగుతోంది. ముఖ్యంగా హైవే–65పై కోదాడ, మునగాల, కట్టంగూర్, చిట్యాల, చౌటుప్పల్ ప్రాంతాల్లో అండర్‌వేలు నిర్మించాల్సి ఉంది. మూడేళ్లుగా టెండర్ల ప్రక్రియే పూర్తికాలేదు. హైవే–44లోనూ నిర్మల్, కామారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఇంజనీరింగ్ లోపాలు అలానే ఉన్నాయి.



2021లో రోడ్డు ప్రమాదాల తీరు..

అంశం	దేశంలో	తెలంగాణలో
మొత్తం రోడ్డు ప్రమాదాలు	4,12,432	21,315
ఈ ప్రమాదాల్లో మృతులు	1,53,972	7,557
సగటున రోజుకు ప్రమాదాలు	1,130	58
సగటున రోజుకు మృతులు	421	20


ఇప్పుడేం చేయాలి?

తెలంగాణలో ప్రమాదాల నియంత్రణ దిశగా నూతన మోటార్ వెహికల్ యాక్ట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్స్‌లో లోపాలను సరిచేయడం, సైన్‌బోర్డులు, ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పెంచటం, ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందే చర్యలు తీసుకోవడం అవసరమని స్పష్టం చేస్తున్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణించకుండా తగిన అవగాహన కల్పించాలని పేర్కొంటున్నారు.

ప్రమాదాల్లో యూఎస్.. మరణాల్లో భారత్..

వరల్డ్ రోడ్ స్టాటిస్టిక్స్–2020 నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యధికంగా అమెరికాలో 19,27,654 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో సంభవించిన మరణాల సంఖ్య (36,650)లో మూడో స్థానంలో నిలిచింది. భారత్ 4,12,432 ప్రమాదాలతో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉండగా.. 1,53,972 మృతులతో మరణాల సంఖ్యలో మాత్రం టాప్‌లో నిలిచింది.

2021లో రోడ్డు ప్రమాద మృతులు అధికంగా ఉన్న రాష్ట్రాలు





అమ్మానాన్నను రోడ్డు మింగింది

గత ఏడాది డిసెంబర్ 11న సూర్యాపేట జిల్లా అనంతగిరి నుంచి ఖమ్మం జిల్లా జల్లేపల్లికి వెళ్తున్న ఆటోను బస్సు ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో రమేష్–రేణుక దంపతులు మృతిచెందడంతో.. వారి పిల్లలు కార్తీక్, హాసిని అనాథలుగా మారిపోయారు.

రైతు కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో రైతులతో ముఖాముఖి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/మోర్తాడ్(బాల్కొండ)/భీమ్‌గల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల సమస్యల పరిష్కారం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్ మాదిరిగా 'రైతు కమిషన్'ఏర్పాటు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి ఆదివారం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి వద్ద రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రసంగించారు. రైతులను ఆదుకునేందుకు చేసిన వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేసే బాధ్యతను తీసుకుంటానని ఈ సందర్భంగా చెప్పారు. రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామన్నారు. ఇందిరమ్మ భరోసా పథకం ద్వారా భూమి లేని రైతులకు రూ. 12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇస్తున్నట్లుగా వరికి క్వింటాలుకు రూ. 2,660 మద్దతు ధర ఇస్తామన్నారు. కాగా కేసీఆర్ ప్రభుత్వం వరి వేస్తే ఉరి అంటూ క్రాప్ హాలిడే ప్రకటిస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే నిజాం షుగర్ ఫ్యాక్టరీని ఆరు నెలల్లో తెరిపిస్తామన్నారు. అలాగే పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు, ఆరోగ్యశ్రీ కింద రూ. 5 లక్షలు చెల్లిస్తామన్నారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రైతులు తామెలా మోసపోయామో ఆలోచించాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, ఎరువులు, విత్తనాలకు సబ్సిడీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వం ఇవన్నీ ఇవ్వడం మానేసి కేవలం రైతుబంధు పేరిట ఎకరానికి రూ.10వేలు ఇచ్చి రైతులకు ద్రోహం చేస్తోందన్నారు.

పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లే..: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న కేసీఆర్‌పై కోపంతో బీజేపీ వైపు చూస్తే ప్రజలు పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లేనని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం బాండ్ పేపర్ రాసిచ్చి ఎంపీగా గెలిచిన అర్వింద్ మాటతప్పారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపి కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

రాజన్న జ్ఞాపకాలు పదిలం..

రైతులు, పేద, మధ్యతరగతి ప్రజల కష్టాలను గుర్తెరిగిన నేతగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తీసుకున్న నిర్ణయాలతో ఆయన పాలన సమయం స్వర్ణయుగంగా వర్ధిల్లిందని రైతులు, కాంగ్రెస్ నేతలు కొనియాడారు. కమ్మర్‌పల్లిలో జరిగిన రైతు ముఖాముఖి కార్యక్రమంలో వారు రాజన్న జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డికి రైతుల సమస్యలు తెలుసు కాబట్టి ప్రకృతి వల్ల పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు.

సీఎం కూతురునే ఓడించారు

హామీలను నెరవేర్చని సీఎం కూతురు కవితనే ఓడించిన ఘనత నిజామాబాద్ జిల్లా రైతులకు ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్టపై లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం గుట్ట కింద విలేకరులతో మాట్లాడారు. 'సీఎం కేసీఆర్ నేను ఏది చెబితే అది చేస్తారని మంత్రి ప్రశాంత్ రెడ్డి పదేపదే అంటారని.. అలాంటప్పుడు ఇక్కడి చెరుకు పరిశ్రమను తెరిపించాల్సిన బాధ్యత ఆయనకు లేదా?'అని ప్రశ్నించారు. కోటి ఎకరాలకు నీళ్లు ఇస్తున్నామని చెప్పే మంత్రి.. భీమ్‌గల్ ప్రాంతానికి కాళేశ్వరం నీళ్లు ఎందుకు తేలేదని రేవంత్‌రెడ్డి నిలదీశారు.

బస్సులో ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య

- తొర్రూరు మండల కేంద్రంలో ఘటన


బస్సులో ఉరివేసుకున్న మహేందర్‌రెడ్డి

తొర్రూరు: ఆర్టీసీ కండక్టర్ బస్సులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూ రు మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తోన్న మండల పరిధి కంటాయపాలెం గ్రామానికి చెందిన గార్లపాటి మహేందర్‌రెడ్డి(54) తొర్రూరు టీచర్స్‌కాలనీలో స్థిరపడ్డాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఇటీవల మూడు రోజులు సెలవు పెట్టాడు. వాటిని రద్దు చేసుకుని ఆదివారం ఉదయం 10 గంటలకు విధుల్లో చేరేందుకు డిపోకు వచ్చాడు. సెక్యూరిటీ కార్యాలయం రిజిస్టర్‌లో సంతకం పెట్టి బస్సులోకి వెళ్లిన మహేందర్‌రెడ్డి ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది వెళ్లి చూడగా బస్సులోని కడ్డీకి ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే డిపో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే కండక్టర్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు చెబుతున్నారు.

'హనీట్రాప్'తో లీక్!

▶ మొదటి పేజీ తరువాయి

ఉండటంతో తన సోదరుడిని ఎలాగైనా గట్టెక్కించాలని భావించిన రేణుక తన భర్తతో కలిసి ప్రవీణ్‌ను సంప్రదించింది. టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం కావాలని కోరింది. అప్పటికే ఆమెతో సన్నిహితంగా ఉంటున్న ప్రవీణ్ వెంటనే అంగీకరించాడు. టీఎస్‌పీఎస్సీలో నెట్‌వర్క్ అడ్మిన్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌తో కలిసి పేపర్ తస్కరణకు పథకం వేశాడు. ఈ పేపర్లు కమిషన్‌కు చెందిన సెక్షన్ ఆఫీసర్ శంకరమ్మ అధీనంలో, ఆమె కంప్యూటర్‌లోనే ఉంటాయి. ఈ విషయం తెలిసిన ప్రవీణ్, రాజశేఖర్ ఆ కంప్యూటర్‌పై నిఘా పెట్టారు.

28న తస్కరణ.. 2న కాల్చివేత..

ప్రవీణ్, రాజశేఖర్ పలుమార్లు శంకరమ్మకు చెందిన కంప్యూటర్‌ను పరిశీలించారు. సరైన లాక్, ఫైర్‌వాల్స్ లేవని నిర్ధారించుకుని.. గత నెల 28న రంగంలోకి దిగారు. కార్యాలయం నుంచి అంతా వెళ్లిపోయేదాకా వేచిచూసిన ఈ ఇద్దరూ.. మెల్లగా ఆ పేపర్‌ను ఓ పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసుకున్నారు. దాన్ని తీసుకెళ్లి రాజశేఖర్ కంప్యూటర్ నుంచి ప్రింట్ ఔట్ తీసుకున్నారు. ప్రవీణ్ ఈ ప్రశ్నపత్రాన్ని తీసుకువెళ్లి రేణుక, ఆమె భర్తకు అప్పగించాడు. కేవలం రేణుక సోదరుడు చదువుకోవడానికే వినియోగించాలని, మరునాడే తిరిగి ఇచ్చేయాలని చెప్పాడు. దీనికి అంగీకరించిన రేణుక, ఆమె భర్త ఆ పేపర్ తీసుకువెళ్లారు. అయితే రేణుక పేపర్‌ను సోదరుడికి ఇవ్వడంతోపాటు జిరాక్సు తీసి పెట్టుకుంది. తమ స్వగ్రామం సర్పంచ్ కుమారుడితో తన వద్ద టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్ ఉందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉంటే విక్రయిస్తానని చెప్పింది. సర్పంచ్ కుమారుడు తనకు తెలిసిన ముగ్గురు అభ్యర్థులను ఏర్పాటు చేశాడు. వారికి రూ.14 లక్షలకు పేపర్‌ను విక్రయించిన రేణుక రూ.4 లక్షలు తాను తీసుకుని, రూ.10 లక్షలను ప్రవీణ్‌కు ఇచ్చింది. అతడు ఇచ్చిన పేపర్‌ను ఈ నెల 2న తిరిగి ఇచ్చేసింది.

ఓ అభ్యర్థి రూమ్మేట్‌కు తెలియడంతో..

రేణుక పరీక్ష ప్రశ్నపత్రాన్ని విక్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రవీణ్.. తనకు తిరిగిచ్చిన పేపర్‌ను సైదాబాద్‌లోని తన ఇంటికి తీసుకువెళ్లి కాల్చేశాడు. అయితే ప్రశ్నపత్రం కొన్న అభ్యర్థుల్లో ఒకరు హైదరాబాద్‌లోని ఓ ప్రాంతంలో స్నేహితులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. అతడి రూమ్మేట్ సైతం కొన్నాళ్లుగా టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. శుక్రవారం రాత్రి మాటల సందర్భంలో సదరు అభ్యర్థి పేపర్ లీకేజీని రూమ్మేట్‌కు చెప్పాడు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకవడంపై కంగుతిన్న రూమ్మేట్ ఇతర స్నేహితులతో కలిసి శనివారం టీఎస్‌పీఎస్సీ వద్దకు వెళ్లి ఆరా తీశాడు. అక్కడి నుంచే 'డయల్–100'కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. కమిషన్ కార్యాలయం వద్దకు వచ్చిన పోలీసులు.. ఈ విషయం ఆరా తీసి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ దృష్టికి విషయం తీసుకువెళ్లడంతోపాటు పరిశీలన జరపగా పేపర్ లీకేజీపై ప్రాథమిక ఆధారాలు లభించాయి.

'అసిస్టెంట్ ఇంజనీర్' పేపర్ సైతం లీక్?

టౌన్ ప్లానింగ్ పేపర్ లీకేజీపై బేగంబజార్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి.. ప్రవీణ్, రాజశేఖర్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో రేణుకతోపాటు ఇతరుల పాత్ర బయటికి వచ్చింది. పోలీసులు మొత్తం 12 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని.. వారి నుంచి టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్ ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో చేతులు మారిన రూ.14 లక్షలను రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నిందితులను బేగంబజార్ పోలీసులకు అప్పగించారు. వీరిని విచారిస్తున్న నేపథ్యంలోనే.. గత వారం టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన 'అసిస్టెంట్ ఇంజనీర్' పరీక్ష పేపర్లు కూడా లీక్ అయ్యాయనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆ దిశగా కూడా దర్యాప్తు చేపట్టినట్టు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న నిందితులను సోమవారం అరెస్టు ప్రకటించే అవకాశం ఉంది. పేపర్ లీకేజీ అంశంపై టీఎస్‌పీఎస్సీ అధికారులు కూడా అంతర్గత విచారణ ప్రారంభించారు.

సీఎం కేసీఆర్‌కు స్వల్ప అస్వస్థత

- గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు
- సీటీస్కాన్, ఎండోస్కోపీ పరీక్షలు..
- కడుపులో చిన్న అల్సర్ గుర్తింపు
- మందులతో నయం అవుతుందని ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఉదయం హుటాహుటిన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఏఐజీ వైద్యులు ఆయనకు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. కడుపునొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. సాధారణ పరీక్షల్లో భాగంగానే ముఖ్యమంత్రి వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నా.. గ్యాస్ట్రిక్ సమస్యతోనే ఆస్పత్రికి వచ్చినట్లు తెలుస్తోంది. కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, కూతురు కవిత, కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావు, ఎంపీ సంతోష్ కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్, మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి మరికొందరు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. ముఖ్యమంత్రిని పరీక్షించిన తర్వాత ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ ఉదయం పొత్తికడుపులో అసౌకర్యంగా ఉందని చెప్పారని, దీంతో ఆయనను ఆస్పత్రికి తీసుకొచ్చి సీటీ, ఎండోస్కోపీ పరీక్షలు చేశామని నాగేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. కడుపులో ఒక చిన్న అల్సర్ ఉన్నట్లు నిర్ధారించామన్నారు. అయితే దీనిని మందుల ద్వారా నయం చేయవచ్చని వివరించారు. ఇతర అన్ని రకాల పరీక్షలు సాధారణంగానే ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రికి అవసరమైన మందులు ఇచ్చామని చెప్పారు. కాగా, రాత్రి 7.15 గంటల సమయంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన కేసీఆర్ ప్రగతి భవన్‌కు వెళ్లిపోయారు.

సీఎం సత్వరంగా కోలుకోవాలి: గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సత్వరం కోలుకోవాలని, స్వస్థత చేకూరాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు.

వేతనం రాక.. వెతలు తీరక

- పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య


కొంగరి బాబు (ఫైల్)

బీబీపేట: నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిన ఓ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మరో పదిరోజుల్లో ఆయన భార్య బిడ్డకు జన్మనివ్వనుండగా... ఈలోపే తన భర్త ఆత్మహత్య చేసుకోవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది. కామారెడ్డి జిల్లా బీబీపేట పంచాయతీలో ఆదివారం జరిగిన ఈ విషాద ఘటన వివరాలిలా ఉన్నాయి. బీబీపేట గ్రామ పంచాయతీలో వాటర్‌మన్‌గా పని చేస్తోన్న కొంగరి బాబు(32)కు 4 నెలలుగా వేతనం రావడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. భార్యకు ప్రసవ సమయం సమీపిస్తుండటం, చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో మనోవేదనకు గురైన బాబు.. ఆదివారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బాబు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. పోలీసులు సర్దిచెప్పడానికి ప్రయత్నించినా ఆందోళన విరమించలేదు. సర్పంచ్‌తో పాటు పాలకవర్గం సభ్యులు, ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకుని బాధితుడి కుటుంబానికి న్యాయం చేస్తామని, కుటుంబంలో ఒకరికి అదే ఉద్యోగాన్ని ఇస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి భార్య దేవలక్ష్మి, కుమారుడు భరత్, కూతురు మేఘన ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ ప్రతిష్టకు దెబ్బ!

- నోటిఫికేషన్లు వాయిదా పడతాయేమోనన్న ఆవేదన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రతిష్టకు ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ల జారీ, దరఖాస్తుల స్వీకరణ, హాల్‌టికెట్ల పంపిణీ, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన దాకా ఆధునిక విధానాలను అనుసరిస్తూ దేశంలోనే ఉత్తమ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా టీఎస్‌పీఎస్సీ గుర్తింపు పొందింది. కానీ ఇప్పుడు పేపర్ లీకవడం, కమిషన్ ఉద్యోగులే దీనికి పాల్పడటంతో ఒక్కసారిగా అలజడికి గురైంది.

మూడో వంతు టీఎస్‌పీఎస్సీ ద్వారానే..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దాదాపు 80వేల ఉద్యోగాల భర్తీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో మూడో వంతుకుపైగా టీఎస్‌పీఎస్సీ ద్వారానే చేపడుతున్నారు. ఇప్పటికే దాదాపు 20వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసిన కమిషన్.. వాటిలో కొన్నింటికి దరఖాస్తులు స్వీకరిస్తోంది కూడా. ఇందులో కీలకమైన గ్రూప్–1 పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్షలు పూర్తవగా.. మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తోంది. వివిధ కేటగిరీల్లో ఇంజనీరింగ్ ఉద్యోగ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. మరికొన్ని కేటగిరీలకు త్వరలో అర్హత పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఇలాంటి తరుణంలో కమిషన్‌కు చెందిన సీక్రెట్ కంప్యూటర్ల నుంచి సమాచారం బయటకు వెళ్లడంతో టీఎస్‌పీఎస్సీ పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కంప్యూటర్లు హ్యాక్ అయ్యాయంటూ.. ఆదివారం జరగాల్సిన టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, ఈనెల 15, 16 తేదీల్లో జరగాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాల అర్హత పరీక్షలను టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసింది. కానీ టౌన్ ప్లానింగ్ పేపర్‌ను ఓ ఉద్యోగి స్వయంగా లీక్ చేసినట్టు వెల్లడికావడం కలకలం రేపింది.

ఇంకా ఏమైనా లీకయ్యాయా?

టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు/ఉద్యోగ పరీక్షల కోసం రాష్ట్రంలో లక్షలాది మంది అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. పేపర్ లీకేజీ ఘటనతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రస్తుతం వాయిదా వేసిన రెండు పరీక్షల సమాచారం మాత్రమే బయటకు పొక్కిందా? లేక ఇంతకుముందే జరిగిన పరీక్షలు, త్వరలో జరగాల్సిన పరీక్షల సమాచారం ఏమైనా బయటికి వెళ్లిందా? అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాసిన, రాయాల్సిన ఉద్యోగ పరీక్షలతోపాటు నియామక ప్రక్రియలు నిలిచిపోతాయేమోననే ఆవేదనలో మునిగిపోతున్నారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ పరీక్షకు సంబంధించి లీకేజీపై స్పష్టత రావడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మిగతా పరీక్షల పేపర్లు ఏమైనా లీకయ్యాయా అన్న కోణంలోనూ విచారణ జరుపుతున్నట్టు తెలిసింది.

ఉద్యోగుల బాధ్యతలపై 'సమీక్ష'!: ఈ పరిణామాలతో అసలు కమిషన్‌లో అంతర్గతంగా ఏం జరుగుతోందన్న దానిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. 'లీకేజీ'వీరులు ఇంకెందరు ఉన్నారనే కోణంలో పరిశీలన జరుపుతున్నారు. ప్రతి ఉద్యోగి నుంచి వివరాలు సేకరించడంతోపాటు ఉద్యోగులు నిర్వహిస్తున్న విధులను సమీక్షిస్తున్నారు. ప్రస్తుత కేసు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఉద్యోగుల విధులు/బాధ్యతల్లో ప్రక్షాళన చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం


బాలుడి మృతదేహం

కేసముద్రం: ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి 4 నెలల బాలుడు మృతి చెందాడు. వివరాలివి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రంగాపురానికి చెందిన భుక్యా వీరన్న, మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. 4 నెలల వయసున్న రెండో కుమారుడు కొద్ది రోజులుగా జ్వరం, విరేచనాలతో బాధపడుతుండగా.. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు భుక్యా హాలును సంప్రదించారు. శనివారం ఉదయం హాలు ఇంజక్షన్ ఇచ్చిన కాసేపటికి బాలుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివా రం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతోనే తమ కొడుకు మృతి చెందాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పురపాలక సంఘ కార్యాలయము:: నల్గొండ

ROC NO.A1/96/2023 — బహిరంగ వేలం ప్రకటన — తేది: 09-03-2023

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, జి.ఓ.యం.యస్.నెం.56, యం.ఎ & యు.డి (బి1) డిపార్ట్‌మెంట్ తేది: 05-02-2011 మరియు కౌన్సిల్ తీర్మానం నెం.914/2022-23, తేది:27-02-2023 అనుసరించి, నల్గొండ పురపాలక సంఘ పరిధిలో తులసీనగర్‌లో గల జూబ్లీహాల్ (న్యూప్రేమ్ టాకీస్/ పి.వి.యస్ సినీమ్యాక్స్‌ను) యధాతథ స్థితిలో నెలసరి అద్దె ప్రాతిపదికపై 5 సంవత్సరముల కాలమునకు బహిరంగ వేలము, పురపాలక సంఘ కార్యాలయములో తేది: 18-03-2023 రోజున ఉదయం గం.11.00 ల నుండి నిర్వహించుటకు ప్రకటన జారీ చేయనైనది. బహిరంగ వేలము వేయు విధానము: 1. బహిరంగ వేలములో పాల్గొనదానికి ఆసక్తికలవారు నిర్ణీత దరఖాస్తు ఫారమును నల్గొండ పురపాలక సంఘము కార్యాలయము నుండి పొందుటకు రూ.5000/- (Non refundable) "శ్రీయుత కమిషనర్, పురపాలక సంఘం, నల్గొండ" గారి పేరున ఏదైనా జాతీయ బ్యాంకులో తీసిన డిమాండు డ్రాఫ్టు ద్వారా లేదా నైఖము చెల్లించి కార్యాలయ పనిదినములలో తేది: 13-03-2023 నుండి 16-03-2023 వరకు పొందవచ్చును. 2. దరఖాస్తుదారు రూ.200000/- (అక్షరాల రెండు లక్షల రూపాయలు మాత్రమే) ధరావత్ సొమ్ము "శ్రీయుత కమిషనర్, పురపాలక సంఘం, నల్గొండ" గారి పేరున నల్గొండలోని ఏదైనా జాతీయ బ్యాంకులో తీసిన డిమాండు డ్రాఫ్టును నిర్ధారిత దరఖాస్తుతో పాటు జతచేసి తేది: 16-03-2023, సాయంత్రం 5.00 గం.ల లోపు నల్గొండ పురపాలక సంఘము కార్యాలయములో సమర్పించవలెను. 3. తేది: 18-03-2023న ఉదయం గం.11.00 ల నుండి పురపాలక సంఘ కార్యాలయములో బహిరంగ వేలము నిర్వహించబడును. 4. బహిరంగ వేలం నియమ నిబంధనలు మరియు ఇతర వివరముల గురించి తెలుసుకొనుటకు కార్యాలయ పనివేళలలో మేనేజర్ (రెవెన్యూ) గారిని సంప్రదించవచ్చును.

DIPR RO No.13172-PP/CL/ADVT/1/2022-23, Dt:10.03.2023 — సం/- కమిషనర్, పురపాలక సంఘం, నల్గొండ

క్లుప్తంగా...

విమానంలో పొగతాగి ప్రయాణికుడి హల్‌చల్

ముంబై: యూకే రాజధాని లండన్ నుంచి మహారాష్ట్ర రాజధాని ముంబైకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో ఓ యువకుడు సిగరెట్ తాగడమే కాకుండా, తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాడు. వారించిన సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించాడు. గట్టిగా అరుస్తూ విమానం తలుపును బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నించాడు. దీంతో విమాన సిబ్బంది అతడి కాళ్లు, చేతులు కట్టేసి సీట్లో కూర్చోబెట్టారు. ఈ సంఘటన మార్చి 11న విమానంలో జరిగిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ''మార్చి 11న లండన్ నుంచి ముంబై వెళ్లే ఏఐ130 విమానంలో 37 ఏళ్ల రమాకాంత్ వాష్‌రూమ్‌లో సిగరెట్ తాగాడు. వెంటనే అలారం మోగింది. పొగ తాగవద్దని సిబ్బంది వారిస్తే వినకుండా వారితో అనుచితంగా ప్రవర్తించాడు. ఘర్షణకు దిగాడు'' అని ఎయిర్ ఇండియా తెలియజేసింది. ముంబైలో విమానం దిగాక అతడిని పోలీసులు అప్పగించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించినందుకు రమాకాంత్‌పై పోలీసులు ఐపీసీ సెక్షన్ 336తోపాటు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్–1937 కింద కేసు నమోదు చేశారు. రమాకాంత్‌కు అమెరికా పౌరసత్వం ఉంది. వాస్తవానికి విమానాల్లో పొగతాగేందుకు అనుమతి లేదు.

కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారి సోదరులు మృతి

న్యూఢిల్లీ: వీధి కుక్కలు రెండు రోజుల వ్యవధిలో సోదరులైన ఇద్దరు చిన్నారులను బలిగొన్నాయి. ఈ దారుణం సాక్షాత్తూ దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకుంది. నగరంలోని వసంత్‌కుంజ్ ప్రాంతానికి చెందిన ఆనంద్(7) కనిపించడం లేదంటూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. అతడి కుటుంబం అటవీ ప్రాంతానికి దగ్గర్లోని గుడిసెలో నివసిస్తుంటుంది. పోలీసులు బాలుడి కుటుంబంతో కలిసి వెదకగా సమీప నిర్మానుష్య ప్రాంతంలో ఆనంద్ మృతదేహం కనిపించింది. శరీరంపై జంతువు చేసిన గాయాలున్నాయి. మేకలు, పందులపై తరచూ దాడి చేసే వీధి కుక్కలే చిన్నారిని చంపేసి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఆదివారం ఆనంద్ తమ్ముడు ఆదిత్య(5) స్నేహితులతో కలిసి ఆటకు వెళ్లాడు. స్నేహితులకు దూరంగా ఒంటరిగా వెళ్లిన ఆదిత్యను కూడా వీధి కుక్కలు ముట్టడించి తీవ్రంగా గాయపరిచాయి. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రెండు ఘటనలపై వివిధ కోణాల్లో ఆధారాలు సేకరించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




ఈ వేసవి గండం గట్టెక్కగలమా?


మార్చిలోనే సూరీడు మండిపోతున్నాడు. ఈ ఏడాది వేసవి భగభగలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండే ఎండలకు తోడు ఎన్నో సమస్యలు ఎదురు కానున్నాయి. వడగాడ్పులు, విద్యుత్ సంక్షోభం, నీటి ఎద్దడి బాధించనున్నాయి. 1901 తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి అత్యంత వేడి నెలగా రికార్డులకెక్కింది. సగటు ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్‌కు దాటాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కొంకణ్, కచ్ ప్రాంతాల్లో ఫిబ్రవరిలోనే వేడి గాడ్పులపై ప్రభుత్వం ప్రజల్ని అప్రమత్తం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్చి నుంచి మే వరకు వడగాడ్పులు తీవ్రంగా ఉంటాయని అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో వేసవి గండాన్ని ఎలా ఎదుర్కొంటామన్న ఆందోళనలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 6న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి వేసవిని ఎదుర్కోవడానికి కావాల్సిన సన్నద్ధతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య నిపుణులు, స్థానిక అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలతో కలిసి వేసవి కాలాన్ని ఎదుర్కోవడానికి ఏమేం చర్యలు చేపట్టాలన్న దానిపై చర్చించారు.

వేసవి ప్రభావం ఇలా.. ప్రపంచ బ్యాంకు 2022లో ఇచ్చిన నివేదిక ప్రకారం భారత్‌లో వేసవి మరణాలు ఇక అధికం కానున్నాయి. కాంక్రీట్ జంగిళ్లుగా మారిన నగరాలు వడగాడ్పులతో వేడెక్కనున్నాయి.

- ఎండవేడిమికి 2000-04 నుంచి 2017-21 మధ్య 55శాతం మరణాలు పెరిగిపోయాయి.
- 2021లో ఎండలకి 16,700 కోట్ల కార్మికుల పని గంటలు వృథా అయ్యాయి.
- ఎండాకాలంలో కార్మికులు పనుల్లోకి వెళ్లకపోవడం వల్ల దేశ జీడీపీలో గత ఏడాది 5.4% ఆదాయం తగ్గిపోయింది.
- 2022లో దేశ వ్యాప్తంగా 203 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో వడగాడ్పులు వీచాయి. వందేళ్ల తర్వాత ఇదే అత్యధికం
- ఉత్తరాఖండ్‌లో అత్యధికంగా 28 రోజులు, రాజస్తాన్‌లో 26 రోజులు, పంజాబ్, హరియాణాలో 34 రోజులు చొప్పున వడ గాడ్పులు వీచాయి.
- వేసవికాలం వచ్చిందంటే కార్చిచ్చుల సమస్య వేధిస్తుంది. 2017లో కొండప్రాంతంలో ఉన్న ఉత్తరాఖండ్‌లో 1,244 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చులు దహిస్తే 2021 నాటికి మూడు రెట్లు ఎక్కువగా 3,927 హెక్టార్లు కార్చిచ్చుతో నాశనమయ్యాయి.




- ఇప్పటికే హిమానీనదాలు కరిగిపోతూ ఉండడంతో సముద్ర తీర ప్రాంతాలు ముప్పులో ఉన్నాయి. వేసవిలో ఎండ ఎక్కువగా ఉంటే మరింత మంచు కరిగి ముప్పు తీవ్రత ఎక్కువైపోతుంది



- ఢిల్లీ రాజధాని ప్రాంతంలో గత ఏడాది ఎంత తీవ్రతకి 300 పిట్టలు మృతి చెందాయి. వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకోవడానికి ఊళ్లపై పడి బీభత్సం సృష్టించే ఘటనలు పెరిగిపోతాయి.

వేసవి కాలం ఎండలు ఎక్కువ ఉండడం రబీ సీజన్ పంటలపై తీవ్రంగా ప్రభావం పడుతుంది. ముఖ్యంగా ప్రపంచ గోధుమ ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉన్న భారత్‌లో ఈ ఏడాది గోధుమ దిగుబడిపై ప్రభావం ఉంటుందనే ఆందోళనలున్నాయి.

ఏయే ప్రాంతంలో వడగాడ్పులు ఉండబోతున్నాయి?



మార్చి నుంచి మే వరకు దేశంలో ఉక్కబోత భరించలేనంతగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో ఎండ వేడిమి ఎక్కువగా ఉంటుంది.మధ్య భారతం, వాయవ్య రాష్ట్రాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకునే అవకాశాలున్నాయి. ఉత్తరాదితో పోల్చి చూస్తే దక్షిణాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా నమోదవుతాయి. ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ) అంచనాల ప్రకారం వడగాడ్పులు తరచుగా వీస్తాయి. రానున్న సంవత్సరాల్లో ఎండవేడిమి మరింతగా పెరిగిపోతుంది. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో కాలానుగుణంగా వచ్చే మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితి ఏర్పడుతుందని అందువల్ల వేసవికాలం మరింత వేడిగా మారుతుందని అంచనాలున్నాయి. ఎల్‌నినో సంవత్సరాల్లో పంట దిగుబడి లేక కరువు కాటకాలు ఏర్పడతాయని పలు నివేదికలు చెబుతున్నాయి. ఏళ్లు గడుస్తున్న కొద్దీ వేసవి కాలం ఎదుర్కోవడం అత్యంత దుర్లభంగా మారుతోందని హెల్త్ అండ్ క్లైమేట్ రెసిలెన్స్ ఎన్ఆర్‌డీసీ ఇండియా చీఫ్ అభియంత్ తివారీ చెప్పారు. గత ఏడాది మార్చి 100 ఏళ్లలోనే అత్యంత వేడి మాసంగా నమోదైతే, ఈ ఏడాది ఫిబ్రవరి 122 ఏళ్ల రికార్డుల్ని బద్దలు కొట్టిందని అన్నారు. ఈ సారి వేసవిలో వడగాడ్పులు ఎక్కువగా ఉండడంతో గోధుమ పంటపై తీవ్ర ప్రభావం పడుతుందని, దీంతో ఆహార సంక్షోభం, నిత్యావసర ధరలు పెరిగిపోవడం వంటివి జరగనున్నాయని ఆయన అంచనా వేశారు.

గత ఏడాది వేసవి కాలంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకొని సంక్షోభం ఎదురైంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలైతే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో అత్యధికంగా విద్యుత్ డిమాండ్ 229 గిగావాట్లకు చేరుకోవచ్చునని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా వేసింది. ఇక రాత్రి వేళల్లో కూడా 217

విద్యుత్ కోతలు తప్పవా..?

గిగావాట్లకు విద్యుత్ వినియోగం చేరుకునే అవకాశాలున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో రాత్రిపూట విద్యుత్ వినియోగం కంటే ఇది చాలా ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల వల్ల గ్రిడ్లపై ఒత్తిడి పెరిగిపోతుందని గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. థర్మల్ విద్యుత్ ప్లాంట్లకి బొగ్గు కొరత, జల విద్యుత్ ప్రాజెక్టులకి నీటి కొరత కారణంగా ఈ సారి వేసవి కూడా పెను విద్యుత్ సంక్షోభానికి దారి తీసే అవకాశాలున్నాయి.

ఒడిశా బాటలో...

మన దేశంలో ఒడిశా వేసవికాలంలో ఎదురయ్యే సమస్యల్ని ఒక ప్రణాళికా బద్ధంగా ఎదుర్కొని విజయం సాధించింది. ఇప్పటివరకు ఒడిశా మాత్రమే వేసవికాలాన్ని కూడా ఒక ప్రకృతి విపత్తుగా అధికారికంగా ప్రకటించింది. 1998లో వేసవికాంలో వడదెబ్బకు ఏకంగా 2,042 మంది పిట్టల్లా రాలిపోయారు. ఆ తర్వాత ఏడాది వడదెబ్బ మృతుల సంఖ్య 91కి, తర్వాత ఏడాదికి 41కి తగ్గించగలిగింది. దీనికి ఒడిశా ప్రభుత్వం చేసిందల్లా ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయట ఎవరూ తిరగకూడదంటూ నిబంధనలు విధించింది. మిట్ట మధ్యాహ్నం సమయంలో ప్రభుత్వ కార్యాలయాలు కూడా మూసేసింది. రాష్ట్రంలోని వీధివీధిలోనూ చలి వేంద్రాలు, పందిళ్లు ఏర్పాటు చేసింది. విద్యుత్ కోతలు లేకుండా, నీటికి ఇబ్బంది లేకుండా ముందుగా ఏర్పాట్లు చేస్తూ వచ్చింది. సూర్యుడు అస్తమించిన తర్వాత రాత్రిపూట పనులు చేసేలా చర్యలు తీసుకుంది. వడదెబ్బతో మరణించే వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటోంది. దీంతో ఇతర రాష్ట్రాలు కూడా ఒడిశా బాటలో నడిస్తే మంచిదన్న అభిప్రాయాలైతే వినిపిస్తూ ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

మహిళను చంపి, ముక్కలుగా నరికి..

జమ్మూకశ్మీర్‌లో దారుణం

శ్రీనగర్: ఢిల్లీలో అఫ్తాబ్ పూనావాలా అనే యువకుడు సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్ అనే యువతిని చంపి, 35 ముక్కలుగా నరికి వేర్వేరు ప్రాంతాల్లో పడేసిన దారుణాన్ని గుర్తుకు తెచ్చే ఘటన ఇది. జమ్మూకశ్మీర్‌లోని బుద్గా జిల్లాలో చోటుచేసుకుంది. పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిందనే కోపంతో షబీర్ అహ్మద్ వనీ(45) అనే వ్యక్తి కార్పెంటర్ ఓ మహిళ(30)ను చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా నరికి వేర్వేరు చోట్ల పాతిపెట్టాడు. మార్చి 7వ తేదీన కోచింగ్ క్లాస్‌కని వెళ్లిన తన సోదరి కనిపించకుండా పోయిందంటూ షోయిబుగ్‌కు చెందిన తన్వీర్ అహ్మద్ ఖాన్ అనే వ్యక్తి 8న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు మహిళ సెల్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు మొహన్‌పురా ఒంపొరాకు చెందిన వనీని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించాడు. అతడిచ్చిన సమాచారంతో పాతిపెట్టిన మహిళ శరీర భాగాలను శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం పెళ్లి చేసుకుంటానంటూ వనీ చేసిన ప్రతిపాదనను తిరస్కరించడంతో ఆమెపై పగబట్టినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల పట్ల సున్నితత్వంతో మెలగాలి: రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ: మహిళల పట్ల సున్నితత్వాన్ని అలవర్చుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మీడియాను కోరారు. వార్తలు, కార్యక్రమాలు, వాణిజ్య ప్రకటనలు ప్రసారం చేసేటప్పుడు మహిళల గౌరవాన్ని, భద్రతను దృష్టిలో పెట్టుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రతి భారతీయ పౌరుడు మహిళ గౌరవానికి భంగం కలిగించే చర్యలను విడనాడాలని మన రాజ్యాంగం చెబుతోందని గుర్తు చేశారు. నవభారత్ టైమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆల్ వుమెన్ బైక్ ర్యాలీను జెండా ఊపి ప్రారంభించిన సందర్భంగా ఆమె ఈ మేరకు ఒక వీడియో సందేశం పంపారు. 'మహిళలను గురించి ప్రతి పౌరుడు గౌరవప్రదంగా ఆలోచించాలి. మహిళల పట్ల మర్యాద పూర్వకమైన ప్రవర్తనకు పునాది కుటుంబమే. తల్లులు, సోదరీమణులు తమ కొడుకులు, సోదరుల్లో మహిళలకు గౌరవం ఇచ్చే విలువలను పెంపొందించాలి. విద్యార్థుల్లో మహిళల పట్ల గౌరవాన్ని, సున్నితత్వంగా మెలిగే సంస్కృతిని ఉపాధ్యాయులు పెంపొందించాలి'అని ద్రౌపదీ ముర్ము కోరారు. 'మహిళల్లో మాతృత్వ సామర్థ్యం, నాయకత్వ సామర్థ్యం సహజంగానే ఉంటాయి. అనేక పరిమితులు, సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ మహిళలు తమ అసమానమైన ధైర్యం, నైపుణ్యాలతో కొత్త విజయ రికార్డులను నెలకొల్పారు'అని ఆమె పేర్కొన్నారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆర్థిక బిల్లుకు ఎలాగైనా ఆమోదం పొందాలని అధికార బీజేపీ, అదానీ వ్యవహారం, రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం వంటివి ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రతిపక్ష పార్టీలు చూస్తున్నాయి. వ్యూహరచన చేయడానికి ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఉదయం సమావేశం కానున్నాయి. అదానీ–హిండెన్‌బర్గ్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ చేపట్టాలన్న డిమాండ్‌ను తాము కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకుడు కె. సురేశ్ చెప్పారు. ఢిల్లీ మద్యం పాలసీ అవకతవకల కేసు, లాండ్ ఫర్ జాబ్స్ కేసుల్లో సీబీఐ, ఈడీలను ప్రతిపక్ష పార్టీ నాయకులపైకి ప్రయోగిస్తోందన్న అంశం కూడా ఈ సారి సమావేశాల్లో హాట్ టాపిక్ కానుంది. మార్చి 13న మొదలు కానున్న పార్లమెంటు సమావేశాలు ఏప్రిల్ 6 వరకు కొనసాగుతాయి.

సహకరించండి: ఉపరాష్ట్రపతి

సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని వివిధ పార్టీల నేతలకు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన తన నివాసంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సభ నిర్వహణపై విపక్ష నేతల నుంచి సూచనలు, సలహాలను కోరారు. సమావేశానికి డిప్యూటీ చైర్మన్ హరివంశ్, విజయసాయిరెడ్డి (వైఎస్సార్‌సీపీ), జైరాం రమేశ్ (కాంగ్రెస్) రాంగోపాల్ యాదవ్ (ఎస్పీ), కె.రవీంద్రకుమార్ (టీడీపీ), కేశవరావు (బీఆర్ఎస్)లతో పాటు పలు పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు తమ తమ డిమాండ్లను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ధన్‌ఖడ్ ప్యానెల్ వైస్ చైర్మన్లతో భేటీ అయ్యారు. ప్యానెల్ వైస్ చైర్మన్లు విజయసాయిరెడ్డి, భువనేశ్వర్ కలితా, సరోజ్ పాండే, సుసరేంద్ర సింగ్ నగార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే రాజ్యసభ చైర్మన్‌ను ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ముఖ్యమైన ప్రతి అంశంపైనా చర్చకు ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయని చెప్పారు. ప్రభుత్వాన్ని బాధ్యునిగా చేసేందుకు నిర్మాణాత్మకపాత్ర పోషిస్తాయని అన్నారు.

నాకు సమాధి తవ్వే పనిలో...

విపక్షాలపై ప్రధాని మోదీ మండిపాటు

- పేదల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నా
- ప్రజలే నాకు రక్షణ కవచం
- కర్ణాటకలో రహదారులు, పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- మండ్యలో భారీ రోడ్డు షో



మండ్య జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ సుమలత, సీఎం బొమ్మైతో మోదీ

మండ్య/ధార్వాడ/హుబ్లీ: పేదల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం తాను అవిశ్రాంతంగా శ్రమిస్తుండగా, మరోవైపు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తనకు సమాధి తవ్వే పనిలో తీరిక లేకుండా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కర్ణాటకలో మండ్య వద్ద 118 కిలోమీటర్ల పొడవైన బెంగళూరు–మైసూరు 10 లేన్ల ఎక్స్‌ప్రెస్ రహదారిని ఆయన ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. మైసూరు–కుశాలనగర 4 లేన్ల రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. తనను సమాధి చేయాలని కాంగ్రెస్ కలలు కంటోందని ఆక్షేపించారు. తనకు ఈ దేశ మాతృమూర్తులు, ఆడపిల్లలు, ప్రజలు రక్షణ కవచంగా ఉన్నారనే సంగతిని విపక్షాలు మరచిపోయినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు.

పేదల బతుకుల్లో మార్పు

దేశంలో గడిచిన 9 ఏళ్లలో వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా కోట్లాది మంది పేదల బతుకుల్లో మార్పు వచ్చిందని మోదీ అన్నారు. పేదల కనీస అవసరాలైన సొంత ఇల్లు, తాగునీరు, విద్యుత్, గ్యాస్ సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, ఆస్పత్రుల నిర్మాణం వంటి పనులను బీజేపీ ప్రభుత్వం చేపడుతోందన్నారు. 9 కోట్ల మంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ కింద 40 లక్షల ఇళ్లకు తాగునీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

140 కోట్ల మందిని అవమానించారు

విద్యార్థులు తమ చదువులు దేశాభివృద్ధికి ఉపయోగపడేలా కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. ధార్వాడలో ఐఐటీ విద్యాసంస్థ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. లండన్‌లో బసవేశ్వరుడి విగ్రహాన్ని జాతికి అంకితం చేసే భాగ్యం తనకు కలిగిందన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా లండన్‌లో మాట్లాడారంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై మండిపడ్డారు. 140 కోట్ల మంది భారతీయులను అవమానించారని దుయ్యబట్టారు. ఇలాంటి వ్యక్తులను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నారు.

ప్రపంచ దేశాలకు ఆశాకిరణం

ప్రపంచ దేశాలకు ప్రస్తుతం భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. భారత్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవి ఆరాటపడుతున్నాయని తెలిపారు. దేశంలో విదేశీ పెట్టుబడులు పెరుగుతున్నట్లు చెప్పారు. కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలోనూ కర్ణాటకలో రూ.4 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే ఇది సాధ్యమైందని వివరించారు.

పొడవైన రైల్వే ప్లాట్‌ఫామ్ జాతికి అంకితం

ప్రపంచంలోనే అత్యంత పొడవైనదిగా గిన్నిస్ రికార్డుకెక్కిన కర్ణాటకలో శ్రీ సిద్ధారూఢ స్వామీజీ హుబ్బళ్లి రైల్వే స్టేషన్‌లోని 1,507 మీటర్ల పొడవైన ప్లాట్‌ఫామ్‌ను ప్రధాని ఆదివారం జాతికి అంకితం ఇచ్చారు. పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. విద్యుదీకరించిన హోస్పేట–హుబ్బళ్లి–తినాయ్‌ఘాట్ రైల్వే సెక్షన్‌ను జాతికి అంకితమిచ్చారు. హుబ్బళ్లి–ధార్వాడ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా పలు పనులకు శంకుస్థాపన చేశారు. జయదేవ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి, ధార్వాడ మల్టీ విలేజ్ వాటర్ సప్లై స్కీమ్ పనులకు పునాదిరాయి వేశారు. తుప్పరిహళ్లి ఫ్లడ్ డ్యామేజ్ కంట్రోల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మండ్య జిల్లాకేంద్రంలో ప్రధాని రోడ్డు షోలో పాల్గొన్నారు.

అన్యాయంపై ప్రజాగ్రహమే దండి యాత్ర

న్యూఢిల్లీ: చరిత్రాత్మక దండి యాత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదివారం మహాత్మా గాంధీకి, యాత్రలో పాల్గొన్న నేతలకు నివాళులర్పించారు. బ్రిటిష్ వారిపై ప్రజల పోరాటంగా దండి యాత్ర గుర్తుండిపోతుందన్నారు. అన్యాయంపై ప్రజాగ్రహమే దండి యాత్ర అని ట్విట్టర్‌లో తెలిపారు. మన దేశ చరిత్రలో దండి యాత్ర కీలకమైన ఘట్టమని ఉద్ఘాటించారు. దండి యాత్రగా పేరుగాంచిన ఉప్పు సత్యాగ్రహం 1930 మార్చి 12న ప్రారంభమై ఏప్రిల్ 5న ముగిసింది.

సొంత పట్టణం నిర్మించనున్న ఎలాన్ మస్క్



టెక్సాస్: ప్రపంచ కుబేరుడు, అమెరికాకు చెందిన ఎలాన్ మస్క్ సొంతంగా ఒక పట్టణాన్నే నిర్మించబోతున్నారు. ఇందుకోసం ఆయన కంపెనీలు, అనుబంధ సంస్థలు టెక్సాస్‌లో వేలాది ఎకరాల భూమిని కొనుగోలు చేస్తున్నాయని వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఆస్టిన్‌కు సమీపంలోని బస్ట్రోప్ కౌంటీలోసుమారు 3,500 ఎకరాల భూమిని కొనుగోలు చేశాయి. స్నెయిల్ బ్రూక్ అనే పేరుతో సొంత పట్టణాన్ని నిర్మించే పనుల్లో ఎలాన్ మస్క్ నిమగ్నమై ఉన్నారు. ప్రధానంగా మస్క్‌కు చెందిన బోరింగ్ కంపెనీ, టెస్లా, స్పేస్ ఎక్స్ తదితర సంస్థలకు ఆస్టిన్ సమీపంలో ఉత్పత్తి కేంద్రాలున్నాయి. కొత్త పట్టణంలో మార్కెట్ ధర కంటే చౌకగానే ఆఫీసులను ఏర్పాటు చేయనున్నాయి. ఉద్యోగుల నివాసాలు కూడా ఇందులోనే ఉంటాయి. నూతనంగా రూపుదాల్చే స్నెయిల్ బ్రూక్‌లో 100కు పైగా భవనాలను నిర్మిస్తారు. ఇందులో స్విమ్మింగ్ పూల్, క్రీడా మైదానాల వంటి ఏర్పాట్లూ ఉంటాయి. టెస్లా ప్రధాన కార్యాలయంతోపాటు తన వ్యక్తిగత నివాసాన్ని కాలిఫోర్నియా నుంచి టెక్సాస్‌కు మారుస్తానని గతంలోనే మస్క్ ప్రకటించారని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం గుర్తు చేసింది.

టైర్ పేలడం యాక్ట్ ఆఫ్ గాడ్ కాదు.. ఇన్సూరెన్స్ చెల్లించాల్సిందే: బాంబే హైకోర్టు

ముంబై: కారు టైర్ పేలిపోయి ఒక వ్యక్తి మరణానికి దారితీసిన ఘటనలో ఇన్సూరెన్స్ కంపెనీ నష్టపరిహారం ఎగ్గొట్టడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. టైర్ పేలిపోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ తప్ప, డ్రైవర్ నిర్లక్ష్యం కాదంటూ చేసిన వాదనని బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. కారు ప్రమాదంలో మరణించిన మకరంద్ పట్వర్థన్ కుటుంబానికి రూ.1.25 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సిందేనని తీర్పు చెప్పింది. 2010 అక్టోబర్ 25న పట్వర్థన్ (38) తన ఇద్దరు సహోద్యోగులతో కలిసి కారులో పుణె నుంచి ముంబై వెళుతున్నారు. వారిలో కారుని తెచ్చిన ఒక కొలీగ్ చాలా ర్యాష్‌గా డ్రైవ్ చేయడంతో కారు ముందు టైర్ పేలిపోయి పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో పట్వర్థన్ అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబంలో ఆయన ఒక్కరే సంపాదనపరుడు కావడంతో ట్రిబ్యునల్ అతని కుటుంబానికి న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ 1.25 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. అయితే కారు పేలిపోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ అంటూ ఇన్సూరెన్స్ కంపెనీ డబ్బులు ఎగ్గొట్టడానికి ప్రయత్నించింది. బాంబే హైకోర్టులో పిటిషన్ వేసింది. దానిని విచారించిన కోర్టు టైర్ పేలిపోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ కాదని, ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాల్సిందేనని తీర్పు చెప్పింది.

కరోనా మూలాల్ని తేల్చాలి: డబ్ల్యూహెచ్‌ఓ

జెనీవా: కరోనా మూలాలను కనుగొనడం నైతికావసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అభిప్రాయపడింది. అప్పుడు ముమ్ముందు ఇతర వైరస్‌లు వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయగలమని తెలిపింది. కోవిడ్–19ని మహమ్మారిగా ప్రకటించి మూడేళ్లు అవుతున్న సందర్భంగా డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అధ్నామ్ ఘెబ్రెయాసెస్ మాట్లాడారు. కరోనాతో లక్షలాది మంది మరణించారని, కొన్ని కోట్ల మంది లాంగ్ కోవిడ్‌తో ఇబ్బందులు పడుతున్నారని అందుకే ఈ వైరస్ పుట్టుపూర్వోత్తరాలను కనుగొనాల్సిన నైతిక బాధ్యత ఉందని అన్నారు. కరోనా తొలి కేసు వెలుగులోకి వచ్చిన చైనాలోని వూహాన్‌లో డబ్ల్యూహెచ్‌ఓ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం 2021లోనే కొన్ని వారాలు గడిపి గబ్బిలాల నుంచి మనుషులకి ఈ వైరస్ సోకిందని నివేదిక సమర్పించింది. మరోవైపు అమెరికా అధ్యయనంలో ఈ వైరస్ వూహాన్ ల్యాబ్ నుంచి లీక్ అయిందని తేలింది. ఇలా రెండు పరస్పర విరుద్ధమైన వాదనలు ప్రచారంలో ఉండడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొంది. అందుకే అసలు వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని టెడ్రోస్ చెప్పారు. అత్యంత ప్రమాదకర వైరస్‌లపై అధ్యయనానికి డబ్ల్యూహెచ్‌ఓ ఏర్పాటు చేసిన సైంటిఫిక్ అడ్వయిజరీ గ్రూప్ కూడా ఇప్పటివరకు కరోనా వైరస్ పుట్టుకపై ఎలాంటి నిర్ధారణకు రాలేకపోయింది. కీలకమైన డేటా కనిపించడం లేదని కమిటీ అంటోంది.

భారత్‌లో పెరుగుతున్న కరోనా కేసులు

దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. 113 రోజుల తర్వాత ఒకే రోజు 524 కేసులు నమోదైనట్టుగా కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,618కి చేరుకుంది.

థాయ్‌లాండ్‌లో వాయు కాలుష్యం.. 2 లక్షల మంది ఆస్పత్రి పాలు

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో వాయు కాలుష్యం మితిమీరిపోయింది. కలుషిత గాలిని పీల్చి సుమారు 13 లక్షల మంది అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో సుమారు 2 లక్షల మంది గతవారం ఆస్పత్రుల్లో చేరారు. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, వ్యవసాయ వ్యర్థాల దహనం వంటి కారణాలతో దేశంలో గాలి నాణ్యత స్థాయిలు గణనీయంగా పడిపోయాయి. బ్యాంకాక్‌లోని 50 వరకు జిల్లాల్లో గాలి నాణ్యత సురక్షితం కాని 2.5 పీఎం స్థాయికి పడిపోయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తున్న గాలి కాలుష్య స్థాయిని మించిపోయింది. ఈ స్థాయిలో గాలి కణాలు రక్తంలో కలిసిపోయి అవయవాలను దెబ్బతీస్తాయి.

స్వలింగ వివాహాలు చట్ట విరుద్ధమే!

అలాంటి వివాహాలకు చట్టబద్ధత కల్పించలేం

- అది ప్రాథమిక హక్కుగా పిటిషనర్లు కోరలేరు
- సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్
- నేడు విచారణ చేపట్టనున్న ధర్మాసనం



న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇలాంటి వివాహాలను చట్టబద్ధంగా గుర్తించడం అనేది వ్యక్తిగత చట్టాలు, ఆమోదయోగ్యమైన సామాజిక విలువల మధ్య సమతూకాన్ని దెబ్బతీస్తుందని వెల్లడించింది. అందుకే చట్టబద్ధత కల్పించలేమని వివరించింది. స్వలింగ వివాహాలు ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని పరోక్షంగా తేల్చిచెప్పింది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టనుంది. ఐపీసీ సెక్షన్ 377 కింద స్వలింగ సంపర్కం నేరం కాదని తేల్చినప్పటికీ.. స్వలింగ వివాహాన్ని చట్టబద్ధంగా గుర్తించడాన్ని ప్రాథమిక హక్కుగా పిటిషనర్లు కోరలేరని స్పష్టం చేసింది. స్త్రీ–పురుషుడి సంబంధాలు, వేర్వేరు వ్యక్తుల నడుమ వ్యక్తిగత అవగాహనతో ఏర్పడే సంబంధాలు చట్టవ్యతిరేకం కాదని అఫిడవిట్‌లో కేంద్రం వెల్లడించింది.

స్వలింగ సంపర్కుల సహజీవనం నేరం కాదు

ఇద్దరు స్త్రీలు లేదా ఇద్దరు పురుషుల నడుమ జరిగిన పెళ్లికి వ్యక్తిగత చట్టాలు లేదా రాజ్యాంగబద్ధమైన చట్టాల కింద చట్టబద్ధత కల్పించడం, గుర్తించడం సాధ్యం కాదని కేంద్రం పేర్కొంది. స్వలింగ సంపర్కులు కలిసి జీవించడం నేరం కాదని వెల్లడించింది. కానీ, దీన్ని భార్య, భర్త, పిల్లలతో కూడిన భారతీయ కుటుంబ యూనిట్‌తో పోల్చలేమని కేంద్రం అభిప్రాయపడింది. ఒకవేళ స్వలింగ వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేస్తే అది ప్రస్తుతం ఉన్న వ్యక్తిగత చట్టాలను, నోటిఫైడ్ చట్టాలను ఉల్లంఘించినట్లు అవుతుందని వివరించింది.



అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని మామూత్ లేక్స్‌లో ఇంటిపై మంచును తొలగిస్తున్న స్థానికులు



పోటెత్తిన భక్తజనం

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయమంతా భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.



రాజన్న సేవలో ఎమ్మెల్సీ బస్వరాజ్

వేములవాడ: రాజన్నను ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. పర్యవేక్షకుల ఆధ్వర్యంలో అర్చకులు ఆశీర్వచనం చేశారు.



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన నృసింహుని బ్రహ్మోత్సవాలు



ఆలయ ఆవరణలో భక్తులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని నల్లగొండ సీతారామ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. వారం రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలకు భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దన్నమనేని శ్రీనివాస్‌రావు, ఈవో ఊడుతల వెంకన్న తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారని వివరించారు. ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో సోమవారం మధ్యాహ్నం స్వామివారి హుండీ లెక్కింపు చేపట్టనునట్లు ఆలయ బాధ్యులు పేర్కొన్నారు.

రేపు జిల్లా మహిళా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా మహిళా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 16 ఏళ్ల నిండినవారై ఉండాలని, రన్స్, త్రోస్, జంప్స్ అంశాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 19న హైదరాబాద్‌లో జరిగే ఖేలో ఇండియా ఉమెన్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 14న ఉదయం 7 గంటలకు స్థానిక అంబేద్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న వక్తలు

చొప్పదండి: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను పట్టణంలోని వైశ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెళ్లి చంద్రశేఖర్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 270 మంది విద్యార్థులు పాల్గొనగా, గెలుపొందిన వారికి మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీగాధ సంతోష్, గుర్రం ఆనందరెడ్డి, జి.సంతోష్, సత్యానంద్, గంగారాం, రాజేందర్, రమేశ్, కిరణ్, లహరి, శ్రీజ, నాగమణి, అంజలి, కావ్య, సిరిచందన, ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు అందించాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

హుజూరాబాద్: దళితబంధు పథకాన్ని వెంటనే వర్తింపజేయాలని కోరుతూ ఆదివారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఇంటి ఎదుట దళితబంధు అందని పలువురు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పథకం ఆరంభంలో రేషన్ కార్డు లేకున్నా మంజూరు చేశారని, ప్రస్తుతం రేషన్ కార్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తమకు దళితబంధు అందించాలని కోరారు. కాగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వినతులను గేట్‌కు అతికించారు.

నేడు సీపీఆర్‌పై శిక్షణ

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని అన్ని ప్రధాన శాఖల ఉద్యోగులకు సీపీఆర్‌పై మాస్టర్ ట్రైనర్‌గా జిల్లా స్థా యి శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రతిమ మెడికల్ కాలేజీలో నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని మంత్రి గంగుల కమలాకర్ ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అందరూ హాజరై సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని కోరారు.

జిల్లాపై ఫ్లూ పంజా..!

‘జిల్లా కేంద్రంలోని బోయవాడకు చెందిన తిరుపతికి ఇటీవల జ్వరం రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. అక్కడి వైద్యులు రక్తపరీక్ష చేసి వైరల్ ఫీవర్‌గా నిర్ధారించారు. మందులు, టెస్టులకు రూ.1,600 వరకు ఖర్చయింది. వారం రోజులకు జ్వరం నయం కాగా.. దగ్గు, గొంతునొప్పి, ఒళ్లునొప్పులు అలాగే ఉన్నాయి.’

‘నగరంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన రామచంద్రం పది రోజుల క్రితం జ్వరంతో జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో చేరాడు. ఐదు రోజుల పాటు డాక్టర్లు చికిత్స అందించారు. కాస్త ఆరోగ్యం కుదుటపడగానే డిశ్చార్జ్ చేశారు. జ్వరం పూర్తిగా తగ్గినా గొంతునొప్పి, దగ్గు ఇంకా నయం కాలేదు.’

- రోగుల్లో పెరుగుతున్న వైరస్ తీవ్రత
- 15 రోజులైనా బాధితులు కోలుకోలేని పరిస్థితి
- తగ్గని జలుబు, దగ్గు, జ్వరం, శ్వాసకోశ సమస్యలు
- హెచ్3ఎన్2 వైరస్ లక్షణాలపై అనుమానాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి

జిల్లా ఆసుపత్రిలో రోజూ ఓపీ	750
జ్వరపీడితులు	400 (సుమారు)
జ్వరంతో చేరుతున్న ఇన్‌పేషెంట్లు	150
ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజూ ఓపీ	2,000 (సుమారు)
జ్వర పీడితులు	1,200 (సుమారు)
జ్వరంతో చేరుతున్న ఇన్‌పేషెంట్లు	500 (సుమారు)

కరీంనగర్‌టౌన్: జిల్లాలో ఫ్లూ వైరస్ కంగారుపెడుతోంది. దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. ఎప్పుడైనా చలికాలంలో ఫ్లూ కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతుంటారు. కానీ ప్రస్తుతం ఎండలు ముదురుతున్న సమయంలో ఫ్లూ లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రతి ఐదుగురిలో ఒకరికి జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తున్నాయి. రోజూ జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో 750 వరకు ఓపీ నమోదవుతుండగా, ఇందులో 400 వరకు జ్వరం కేసులే ఉంటున్నాయి. ఇందుకు వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే.. మరోవైపు కొత్త రకం ఫ్లూ వైరస్‌గా వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో జ్వర బాధితుల్లో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు కనిపిస్తుండడం వైద్య ఆరోగ్యశాఖను కొంత కలవరపాటుకు గురిచేస్తోంది. బాధితుల్లో ఎక్కువగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

ఆసుపత్రుల్లో పెరుగుతున్న ఓపీ

జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రస్తుతం ఫ్లూ లక్షణాలతో ఓపీ (అవుట్ పేషెంట్) సేవల కోసం వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి అన్ని ఆసుపత్రుల్లో జనరల్ మెడిసిన్ ఓపీ చికిత్స కోసం వస్తున్న రోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం గమనార్హం. జిల్లాలో ఇప్పటి వరకు ఫ్లూ నిర్ధారణ కానప్పటికీ ఆ లక్షణాలు కనిపిస్తుండడంతో ప్రభుత్వం వైద్యారోగ్యశాఖను అప్రమత్తం చేసింది. సాధారణ ఫ్లూ కంటే ప్రస్తుతం వస్తున్న ఫ్లూ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఏమిటీ.. హెచ్3ఎన్2 వైరస్

ఇది కరోనాకు సంబంధించిన ఉపరకం హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్. నిరంతర దగ్గు, జ్వరం, జలుబు, శ్వాసకోశ సమస్యలు ఉంటాయి. ఈ వైరస్ వేరియంట్‌లు చాలా రకాలుగా ఉంటాయని, దీనికి ఉపరకమై హెచ్1ఎన్1, హెచ్3ఎన్2, ఒమిక్రాన్ వైరస్ అని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న కేసుల్లో హెచ్3ఎన్2 వైరస్ ఉందని గుర్తించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) తెలిపింది. ఫ్లూ లక్షణాలు ఉన్నవారు ఇతరులతో కరచాలనం, ఆలింగనం, కలిసి భోజనం చేయకూడదు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి పెంచే ఆహారం తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు.



అప్రమత్తంగా ఉండాలి

జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లునొప్పులు తదితర కేసులు అధికంగా వస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వైరస్ న్యుమోనియా బారినపడేలా చేస్తోంది. పౌష్టికాహారం తీసుకోవాలి. చల్లని పానీయాలు, బయటి ఆహారాలకు దూరంగా ఉండాలి. – డాక్టర్ ప్రశాంతి, జనరల్ ఫిజీషియన్

సొంత వైద్యం వద్దు

ఫ్లూ జ్వరాలకు భయపడాల్సిన అవసరం లేదు. వైద్యులను సంప్రదించి మందులు వాడాలి. వారం నుంచి 15రోజుల లోపు లక్షణాలు తగ్గుతాయి. జ్వరం తగ్గ లేదని ఇష్టం వచ్చిన యాంటీ బయాటిక్స్ వాడకూడదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ జువేరియా, జిల్లా వైద్యాధికారి



రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో రైస్ మిల్లర్లు

జమ్మికుంట(హుజూరాబాద్): జిల్లాలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జమ్మికుంట రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు, జిల్లా రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న అభ్యర్థి జి.రాజమౌళి అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన మిల్లర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలో రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు ఉన్నందున హుజూరాబాద్, జమ్మికుంట, మానకొండూర్, కరీంనగర్ మిల్లర్ల సహాయ సహకారాలతో ప్రధాన కార్యదర్శి అభ్యర్థిగా పోటీలో ఉంటున్నానని, మిల్లర్ల సంఘం సభ్యులు ఎన్నికలకు సహకరించి ఓటు వేయాలని కోరారు. రానున్న రోజుల్లో మిల్లర్లకు ఏలాంటి సమస్యలు ఉత్పన్నమైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి వుషు జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ఫండస్ స్కూల్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వుషు సంఘం ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈ నెల 15న నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో సాయంత్రం 5 గంటలకు స్కూల్‌లో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 94409 68619 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.


ముదురుతున్న చేపల చెరువు వివాదం



రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు

- పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా
- అధికారులు అన్యాయం చేస్తున్నారని మత్స్యకారుల ఆవేదన

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని చల్లూర్, ఇప్పలపల్లి గ్రామాల మధ్య చేపల చెరువుల పంపకంలో వచ్చిన పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. అధికారులు అన్యాయం చేశారని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట మత్స్యకారులు ధర్నాకు దిగారు. అనంతరం ప్రధాన రోడ్డుపై బైఠాయించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, చేపల చెరువు పంపకంలో అధికారులు అన్యాయం చేయాలని చూస్తున్నారని, దీంతో ఉపాధి కోల్పోతున్నామని చల్లూరు గ్రామానికి చెందిన మత్స్యకార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చల్లూరు, ఇప్పలపల్లి గ్రామాల మత్స్య కార్మికులందరం కలిసి అనేక సంవత్సరాలుగా చెరువులలో చేపలు పట్టుకుంటున్నామని పేర్కొన్నారు. కాగా అధికారులు నాలుగు పెద్ద చెరువులు ఇప్పలపల్లి వారికి వర్తిస్తాయని, చల్లూరు మత్స్య కార్మికులకు ఆనవాళ్లు లేని, నీరులేని చిన్న కుంటలు వర్తిస్తామని ఆదేశాలు ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. దీనిపై కోర్టుకు వెళ్లామని తీర్పు వచ్చే వరకు ఆగకుండా తమపై అక్రమంగా కేసులు పెట్టించి ఇప్పలపల్లి గ్రామస్తులు చేపలు పట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయలని కోరారు. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ధర్నా విరమింపజేశారు. తర్వాత బాధితులు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు సమ్మయ్య, లక్ష్మయ్య, శంకిం ఐలయ్య, సతీష్, సదయ్య, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.






ఉప్పొంగిన భక్తిభావం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రం పులకించింది.. భక్తిభావం ఉప్పొంగింది.. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి రథం లాగి, మొక్కులు చెల్లించుకుని భక్తజనం పునీతులైంది. ఈనెల 3న ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. తొలుత అర్చకులు ముచ్చురు స్వాములు శ్రీలక్ష్మీనృసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథాలపై ఆశీనులు చేశారు. ఆలయం నుంచి పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. వేడుకలు ముగిశాక పవిత్ర గోదావరి నదికి తీసుకెళ్లి చక్ర స్నానంతోపాటు పూజలు జరిపారు.

‘కమలం’లో మంటలకు జగిత్యాల చిచ్చు!

- శ్రావణి వ్యవహారంపై అరవింద్ కినుక
- ఇటీవల ఆమెను పార్టీలో చేర్పించిన అరవింద్
- ఈ కోపంతోనే నేరుగా బండిపై విమర్శనాస్త్రాలు
- చాలాకాలం తరువాత భగ్గుమన్న విభేదాలు



బండి సంజయ్



ధర్మపురి అరవింద్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కమలం పార్టీలో మళ్లీ మాటల మంటలు రేగాయి. ఎమ్మెల్సీ కవిత విషయంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మాటలను నిరసిస్తూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. చాలాకాలంగా వీరి మధ్య రాజకీయంగా విభేదాలు ఉన్న విషయం ఆదివారం ఢిల్లీలో ప్రెస్‌మీట్‌తో బట్టబయలయ్యాయని కమలనాథులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ ఉపసంహరించుకుంటే మంచిదని ధర్మపురి అరవింద్ హితవు పలకడం పార్టీలో చర్చానీయాంశంగా మారింది. పార్టీ అధ్యక్ష పదవి దాని విధివిధానాలు, హద్దులు, సరిహద్దులపై ధర్మపురి అరవింద్ బహిరంగంగా చేసిన సూచనలు కమలనాథుల్లో కలకలం రేపాయి. అరవింద్ ఈ వ్యాఖ్యలపై పార్టీలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అరవింద్ వ్యాఖ్యలపై కొందరు విస్మయం వ్యక్తం చేస్తుండగా.. చాలాకాలంగా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న ఆయన ఈ విమర్శలు చేయడంలో తమకెలాంటి ఆశ్చర్యమూ కలగలేదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఇంతకాలం ఉప్పునిప్పుగా ఉన్న వీరి మధ్య విభేదాలు భగ్గుమనడానికి జగిత్యాల రాజకీయమే కారణమన్న విషయం మాత్రం ఆసక్తికరంగా మారింది.

శ్రావణిపై అరవింద్ కినుక..

బీఆర్‌ఎస్ నుంచి ఇటీవలే బీజేపీలో చేరిన జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ భోగ శ్రావణి వ్యవహారం ధర్మపురి అరవింద్ బండి సంజయ్‌పై ఆగ్రహానికి కారణంగా తెలుస్తోంది. ఇటీవలే బీజేపీ తీర్థం పుచ్చుకున్న శ్రావణి.. జనవరి 25న బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆమె విలేకరుల సమావేశంలో విలపించిన తీరు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆమె అరవింద్ ఆహ్వానం మేరకే పార్టీకి రాజీనామా చేశారని బీఆర్‌ఎస్ జిల్లా నేతలంతా ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను నిజం చేసేలా ఆమె మార్చి ఒకటిన ఢిల్లీలో కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ సమక్షంలో అరవింద్ నేతృత్వంలో కమలం పార్టీలో చేరారు. జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉండటంతో ఆమెకు ఎమ్మెల్యేగా టికెట్ కూడా ఇప్పించేందుకు అరవింద్ హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన అమిత్‌షాకు శ్రావణి బండి సంజయ్‌తో కలిసి స్వాగతం పలకడం అరవింద్ కోపానికి కారణమైందని సమాచారం. పార్టీలో చేర్పించిన తనను కాదని, బండితో కలిసి అమిత్ షాకు స్వాగతం పలకడం అరవింద్ వర్గం జీర్ణించుకోలేకపోయిందని తెలిసింది. ఈ పరిణామంతోనే అరవింద్ తన ఆగ్రహాన్ని మీడియా ముందు కవిత విషయం ద్వారా ప్రస్తావించారని కమలనాథులు చెబుతున్నారు.

గతంలోనూ కరీంనగర్ కేంద్రంగానే..

గతేడాది ఆరంభంలోనూ బండి సంజయ్‌పై కరీంనగర్‌కు చెందిన పలువురు సీనియర్లు తిరుగుబాటు సమావేశం నిర్వహించారు. తమకు ప్రాధాన్యం దక్కడం లేదంటూ వారు నిర్వహించిన సమావేశంపై అధిష్టానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక దశలో వివాదం ముదిరింది. సీనియర్లకు షోకాజ్‌లు జారీ చేస్తారని ప్రచారం జరిగినా.. తరువాత అది టీ కప్పులో తుపానులా సమసిపోయింది. అప్పుడుఇప్పుడు బండి సంజయ్‌పై పార్టీ నాయకులు వ్యతిరేక వ్యాఖ్యలు చేసేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలే కారణమమయ్యాయని స్థానిక బీజేపీలో చర్చ సాగుతోంది.

కవిత వ్యవహారం ఆయుధంగా..

గతంలో ఎమ్మెల్సీ కవిత, అరవింద్ మధ్య జరిగిన వాగ్యుద్ధం రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించింది. కవిత అనుచరులు హైదరాబాద్‌లోని అరవింద్ ఇంటిపైనా దాడి చేశారు. ఆ విషయం రెండుపార్టీల మధ్య మాటల మంటలు రేపింది. ఆ సమయంలో ధర్మపురి అరవింద్‌కు పార్టీ మొత్తం అండగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా అరవింద్‌కు వివిధ రూపాల్లో సంఘీభావం కూడా తెలిపింది. ఇపుడు అదే కవితను పరుషంగా విమర్శించారంటూ అదే ధర్మపురి అరవింద్.. సొంత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిపై నేరుగా విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టడం పార్టీలో చర్చానీయాంశంగా మారింది. పార్టీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్న అరవింద్‌పై మొదటి నుంచి బండి వర్గం అంటీముట్టనట్లుగానే ఉంటోందని ప్రచారం ఉంది. ఈ క్రమంలో వీరిద్దరి విభేదాలకు జగిత్యాల రాజకీయాలు మరింత ఆజ్యం పోశాయని, అందుకే, కవితపై వివాదాస్పదవ్యాఖ్యలను ఆయుధంగా చేసుకుని అరవింద్.. నేరుగా రాష్ట్ర అధ్యక్షుడిపై విమర్శలకు దిగారని పార్టీ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో సోమవారం పలు ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో జువేరియా తెలిపారు. కరీంనగర్ నగరంలో 1,6,8,10,15,18,41,45,46,49,53,56 డివిజన్‌లలో, హుజురాబాద్ పట్టణం 5, 15 వార్డుల్లో, అదే మండలంలోని చిన్న పాపయ్యపల్లి, బొత్తలపల్లిలో శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 9, 30 వార్డులు, అదే మండలంలోని గండ్రపల్లి, వీణవంక మండలం ఎలబాక, శ్రీరాములపేట, బేతికల్, చిగురుమామిడి మండలం రేకొండ, గునుకులపల్లి, చొప్పదండి పట్టణంలో 10వ వార్డు, అదే మండలంలోని వెదురుగట్ట, గుమ్లాపూర్, ఇల్లందకుంట మండలం రాచపల్లి, లక్ష్మాజిపల్లి, గంగాధర మండలం గర్శకుర్తి, చర్లపల్లి (ఎన్), ఉప్పర మల్యాల, రామడుగు మండలం షానగర్, వన్నారం, కొత్తపల్లి మండలం బొమ్మకల్, కమాన్‌పూర్, కరీంనగర్‌రూరల్ మండలం చర్లబూత్కూర్, గోపాల్‌పూర్, మానకొండూరు మండలం ముంజపల్లి, కొండపల్కల, పచ్చునూర్, సైదాపూర్ మండలం ఎక్లాస్పూర్, గొడిశాల, కేశవపట్నం మండలం చింతగుట్ట, లింగాపూర్, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, నల్లగొండ, గన్నేరువరం మండలం మాదాపూర్‌లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా జిల్లా జట్టు



బహుమతులతో జిల్లా జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌ను జిల్లా జట్టు కైవసం చేసుకుంది. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో ఈనెల 10 నుంచి 12 వరకు జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో భాగంగా ఆదివారం ఆదిలాబాద్ జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్‌లో కరీంనగర్ టీం విజేతగా నిలిచింది. జిల్లాజట్టు విజయం సాధించడం పట్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర రావు, బాసరవేణి లక్ష్మణ్, డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు నమిలికొండ ప్రభాకర్, వేల్పుల సురేందర్, కోచ్ మూల వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు.

కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన కమిటిశెట్టి సత్యవతి (60), కొలిపాక కృతిక్ (3)పై కోతులు దాడి చేశాయి. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం ఇంట్లో ఉండగా ఒక్కసారిగా కోతులు ప్రవేశించి దాడి చేశాయని వారివారి కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన ఇద్దరిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించినట్లు వైద్యులు తెలిపారు. కోతుల బెడద నుంచి కాపాడాలని కాంగ్రెస్ సీనియర్ నేత అమిరిశెట్టి తిరుపతి కలెక్టర్‌ను కోరారు

బాలుడిపై పందుల దాడి



గాయపడిన బాలుడు

కోల్‌సిటీ: గోదావరిఖని ఐబీ కాలనీకి చెందిన హేమచంద్ర అనే బాలుడిపై శనివారం రాత్రి పందులు దాడిచేసి గాయపర్చాయి. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. దీనిపై పలుసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రోజుకో చోట ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ శివారు మూలవాగులోని మంచినీటి బావిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. 40 ఏళ్ల వరకు ఉంటాడని, 5.5 ఎత్తు, తెలుపు రంగు చొక్కా, బ్లూ కలర్ జీన్స్ కలిగి ఉన్నట్లు తెలిపారు. తెలిసిన వారు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

యువకుడికి గాయాలు

ధర్మపురి : రథాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న సమయంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్య ఘట్టమైన స్వామి రథోత్సవ వేడుకలను ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథాలను ఊరేగింపుగా తీసుకెళ్తుండగా ధర్మపురికి చెందిన వంశీ అనే యువకుడి పాదంపై నుంచి రథం వెళ్లడంతో తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం వెంటనే 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శివారాధనలో జంగమయ్యలు

- విశిష్టంగా దండకాలు...
- శివపార్వతులకు రుద్రాక్షపూజలు
- ఏటా ప్రత్యేకత చాటుకుంటున్న వైనం
- నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారం



శివకల్యాణంలో పాల్గొన్న జంగమయ్యలు



“ఈ చిత్రంలో కనిపిస్తున్నది తాతా మనవడు. తాత పత్రి మల్లేశం, మనవడు మణిదీప్. మల్లేశం 45 ఏళ్లగా శివకల్యాణోత్సవంలో పాల్గొంటూ ఏటా దండకాలు వేస్తూ ఉన్నారు. తన మనవడు మణిదీప్‌తో ఈ ఏడాది నుంచి దండకాలు వేయించినట్లు చెబుతున్నారు. 1963 సంవత్సరంలో ప్రారంభమైన శివకల్యాణోత్సవాల్లో తక్కువ మంది భక్తులు వచ్చేవారనీ, కేవలం పది మంది వీరశైవులు మాత్రమే దండకాలు వేసేవారమనీ, కాలక్రమేణ భక్తుల రద్దీ పెరగడంతో ఇప్పుడు 35 మందితో దండకాలు వేస్తున్నామని చెబుతున్నారు. లోక కల్యాణార్థం జరిగే ఈ ఉత్సవాల్లో తామంతా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని తాతా మనవడు చెబుతున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు సైతం తమను ఎంతో ప్రో త్సహిస్తున్నారు. ఇది మా తాతల నుంచి వస్తున్న ఆచారమని తెలుపుతునన్నారు.”



“60 ఏళ్ల క్రితం ఆరంభమైన ఈ ఆచారం నేటికీ కొనసాగుతోంది. ఉత్సవాలకు రాజన్న ఆలయం నుంచి తమకు ప్రత్యేక ఆహ్వానం ఉంటుందని చెబుతున్నారు. తర్వాత వేములవాడకు వచ్చే శివపార్వతులు తమ వద్దకు చేరుకొని కేవలం రుద్రాక్షపూజ మాత్రమే చేసుకుంటారు. ఇలా పట్టణంలోని 28 కుటుంబాలు రాజన్న చెంత ఉపాధి పొందుతున్నట్లు చెబుతున్నారు.

– సాంబ శివుడు, వీరశైవ సంఘం నాయకులు”



“ఈ చిత్రంలో ఉన్నది రాజశేఖర్ గనాచారి. 27 ఏళ్లుగా తను ఖడ్గాలు వేస్తున్నానని చెబుతున్నారు. తాతల నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని సజావుగా కొనసాగిన్నామంటున్నారు. పరివార దేవతలను స్తుతిస్తూ వీరభద్రుడిని ఆహ్వానిస్తున్నట్లు చెబుతున్నారు. రాజశేఖరే కాకుండా యాభైమందికి పైగా ఇదే వృత్తిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా తామంతా నియమి, నిష్టలతో స్వామివారి ఉత్సవాల్లో పాల్గొంటామంటున్నారు.”

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో 1963 నుంచి ప్రారంభమైన శివకల్యాణోత్సవాలు ప్రత్యేకత సంతరించుకుంటున్నాయి. ఇప్పటి వరకు లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని శివుడి కల్యాణోత్సవంలో పాల్గొంటారు. అనారోగ్యంతో కొందరు.. ఆర్థిక భారంతో మరికొందరు.. కుటుంబ సమస్యలతో ఇంకొందరు ఎములాడ రాజన్ననే సర్వస్వంగా భావిస్తున్నారు. శివకల్యాణం లేదా శ్రీరామ నవమిరోజున మెడలో రుద్రాక్షమాల ధరించి త్రిశూలం చేతిలో పట్టుకుని రాజన్న పెళ్లి వేడుకల్లో పాల్గొనడం అనాధిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారం, ఆనవాయితీలో ఇక్కడి వీరశైవులు (జంగమయ్యలు) శివారాధనలో పరితపించిపోతున్నారు. ఏటా జరుపుకునే శివ కల్యాణోత్సవాల్లో ప్రధాన భూమిక వీరశైవులదే. వీరభద్రుడికి వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం ఇక్కడి జంగమయ్యలు పూజా విధానాలు కొనసాగిస్తుంటారు. శివకల్యాణోత్సవంలో వీరభద్రుడికి ఆహ్వానం పలికే విధానంలో వీరశైవ అర్చకులు దండకాలు (ఖడ్గాలు) వేస్తూ స్వామివార్లను ఆహ్వానిస్తుంటారు. లోక కల్యాణార్థం జరిగే శివుడి కల్యాణం నిర్విఘ్నంగా కొనసాగేందుకు వీరభద్రుడిని ఆహ్వానించడం ఓ ప్రత్యేకత అని ఇక్కడి వీరశైవులు పేర్కొంటున్నారు. 28 కుటుంబాలు స్వామివారి ప్రసాదంగా వర్ని స్వీకరించి ఈ ఉత్సవాల్లో పాల్గొంటామని చెబుతున్నారు.

ఇక్కడి విశేషం..

రాష్ట్రంలోని మిగతా శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి రోజునే కల్యాణోత్సవాలు జరుపుకుంటారు. కానీ వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మాత్రం ‘స్మార్థ వైదిక’ పద్ధతిని అనుసరించి మహా శివరాత్రి అనంతరం కామదహనం మరుసటి రోజున పార్వతీ రాజరాజేశ్వరుల వివాహం జరుపుకునే సాంప్రదాయం నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగుతోంది. ఈశ్వరుడు తపస్సులో ఉండగా, మన్మథుడు తన బాణాన్ని సంధించి తపస్సును భగ్నం చేశాడనీ, దీంతో ఈశ్వరుడికి కోపమొచ్చి మన్మథున్ని త్రినేత్రంతో దహనం చేశాడనీ, అందుకోసమే కామదహనం తర్వాత మరుసటి రోజు ఈశ్వరుడు పార్వతిని కల్యాణం చేసుకుంటాడని అర్చకులు చెబుతున్నారు.

ఇల్లు సల్లంగుండాలని..

ఏటా రాజన్నను పెళ్లాడే శివపార్వతులు ముందుగా ఇల్లు సల్లంగుండాలని రుద్రాక్షపూజ చేసుకుంటారు. తమ ఆరోగ్యం బాగుండాలని, ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలనీ, అనేక సమస్యలతో సతమతమవుతున్న వారంతా వయో, లింగభేదం లేకుండా ఇక్కడి వీరశైవులతో రుద్రాక్షపూజ నిర్వహించిన అనంతరం రాజన్న కల్యాణోత్సవంలో పాల్గొంటారు. ఈ క్రమంలో ఇక్కడి వీరశైవులు వీరికి ప్రత్యేక పూజలు నిర్వహించి రుద్రాక్షధారణ నిర్వహిస్తారు. అనంతరం వారంతా రాజన్న సేవలో తపించడంతోపాటు తమతమ కుటుంబ వ్యవహారాల్లోనూ కొనసాగుతుంటుంటారు. రాజన్నకు ఉచిత ప్రచార కర్తలుగా పనిచేస్తుంటారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



మొలుగూరి బిట్టూ (ఫైల్)

జ్యోతినగర్ : ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. అన్నపూర్ణ కాలనీలో తల్లి మంగతో మొలుగూరి బిట్టూ (30) నివాసముంటున్నాడు. ఆదివారం తల్లి వరంగల్‌కు వెళ్లగా ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తాను చనిపోతున్నానంటూ కరీంనగర్‌లో ఉంటున్న తన మేనమామకు సందేశం పంపించినట్లు తెలుస్తోంది. బిట్టూ కృష్ణానగర్‌లో వాహనాల వ్యాపారం చేసేవాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు తండ్రి అనారోగ్యంతో, సోదరి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, తల్లి మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఎస్సై జీవన్ తెలిపారు.

ఇంట్లోంచి వెళ్లి.. కెనాల్‌లో శవమై..



చిన్న మల్లయ్య (ఫైల్)

ధర్మపురి : మద్యం మత్తులో మూడురోజుల కింద ఇంట్లోంచి వెళ్లిన ఓ వ్యక్తి మృతదేహం కెనాల్‌లో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గిరిజన గ్రామమైన బోదరి నక్కల చెరువు గూడెంకు చెందిన సర్పంచ్ అద్దరి బుచ్చవ్వ భర్త చిన్న మల్లయ్య (58) మద్యం మత్తులో మూడురోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లాడు. కొడుకు అద్దరి శేఖర్ ఈనెల 10న ధర్మపురి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి తెలిసిన చోటల్లా గాలిస్తున్నారు. ఆదివారం గ్రామ సమీపంలోని రాయకుంట మినీ కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

కొండగట్టు చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

- 12కిలోల వెండి స్వాధీనం
- మరికొందరి కోసం గాలింపు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

జగిత్యాల క్రైం : కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో గతనెల 23న దొంగతనానికి పాల్పడి వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్ ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కొండగట్టు అంజన్న ఆలయంలో దొంగతనానికి పాల్పడిన రాంశెట్టి జాదవ్, చోరీల్లో తీసుకెళ్లిన వెండి ఆభరణాలను ఆయన కొడుకు దేవిదాస్ జాదవ్ ఇద్దరు కలిసి బీదర్ జిల్లా టాస్‌కు చెందిన విఠల్‌రావు దేశ్‌ముఖ్ వద్ద కరిగించి 12 కేజీల వెండిని విక్రయించేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఆదివారం రాజారాం గ్రామ శివారులోని రాజస్థాన్ దాబా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా మల్యాల సీఐ రమణమూర్తి, ఎస్‌ఐ చిరంజీవి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నిజం వెల్లడించారని, వారినుంచి 12 కిలోల వెండి కడ్డీలు స్వాధీనం చేసుకున్నటట్లు తెలిపారు. ఈ కేసును ఛేధించిన మ ల్యాల సీఐ రమణమూర్తి, ఎస్‌ఐ చిరంజీవి, కానిస్టేబుళ్లు తిరుపతి, సుమన్‌ను అభినందించారు.

ప్రైవేటు ఓబీలో ఇష్టారాజ్యం

- రాజుకున్న హోలీ పండుగ బోనస్ వివాదం
- కార్మికుడిని చితకబాదిన యాజమాన్యం
- తిరగబడిన కాంట్రాక్టు కార్మికులు
- పోలీసుల రాకతో సద్దుమణిగిన వివాదం



కార్మికులతో చర్చలు జరుపుతున్న సీఐ, కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని:ప్రైవేటు ఓబీలో ఇష్టారాజ్యం సాగుతోంది. ఓబీలో పనిచేస్తున్న వలస, కాంట్రాక్టు కార్మికుడిని కాంట్రాక్టర్ మనుషులు చితకబాదడం వివాదాస్పదమైంది. దాడి విషయం తెలుసుకుని 300మంది కార్మికులు ఏకమై ఓబీ కాంట్రాక్టర్‌పై తిరగబడ్డారు. రాళ్ల విసిరి అక్కడున్న కార్యాలయం అద్దాలు పగులగొట్టారు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో రెండు రోజులుగా వివాదం కొనసాగుతోంది. హోలీ రోజు డ్యూటీ చేస్తే రూ.500 ఇస్తామని ఓబీ కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. డ్యూటీ ముగిసిన తర్వాత హామీ ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని అడగటంతో తాము అడ్వాన్స్‌గానే ఇస్తామని, బోనస్‌గా ఇవ్వబోమని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను నిలదీయడంతోపాటు బూతులు తిట్టినట్లు తెలుస్తోంది. దీంతో కాంట్రాక్టర్ వ్యక్తులు సదరు వ్యక్తిని చితకబాదినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బీహార్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర కాంట్రాక్టు కార్మికులు 300మంది ఏకమై ఎదురు దాడికి దిగారు. గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టు కార్మికులు శాంతించారు.

మొదటి నుంచీ వివాదాస్పదమే..

ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మె సమయంలోనూ యాజమాన్యం తీరు వివాదాస్పదంగా మారింది. గతంలో ఓ కార్మికుడు కాంట్రాక్టర్ తీరును నిరసిస్తూ క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఈప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీసింది. కాంట్రాక్టు కార్మికుల రిక్రూట్‌మెంట్ సమయంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు వచ్చాయి. ప్రిన్సిపులర్ ఎంప్లాయిలర్ బాధ్యత వహించాల్సిన సింగరేణి యాజమాన్యం ఈ విషయాలను గోప్యంగా ఉంచుతూ కాంట్రాక్టు పక్షం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేజిక్ రాజాకు స్ఫూర్తి పురస్కారం



పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ : ప్రముఖ కళాకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజాకు స్ఫూర్తి పురస్కారం వరించింది. తెలంగాణా భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి త్రి దశాబ్ది వార్షికోత్సవం సందర్భంగా పురసస్కారాన్ని అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో పలు రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న వారికి స్ఫూర్తి పురస్కారాలతో సత్కరించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఇతర ప్రముఖ కవులు, రచయితలు, కళారంగంలో సేవలు అందిస్తున్నందుకు గాను మేజిక్ రాజాను స్ఫూర్తి పురస్కారం–2023కితో సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న మేజిక్ రాజాను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధుకర్ వైద్యులు, సభ్యులు చదువు వెంకట రెడ్డి, కట్కూరి శంకర్, నాతేశ్వరం శంకరం, పత్తిపాక మోహన్, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, దైవజ్ఞ శర్మ, స్వామి రెడ్డి, మౌన శ్రీ మల్లిక్, కందుకూరి శ్రీరాములు పాల్గొన్నారు.

బాలుడిని చేరదీసిన రైల్వే పోలీసులు



బాలుడిని చైల్డ్‌లైన్ టీంకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

రామగుండం : తల్లిదండ్రులు మందలించడంతో హైదరాబాద్‌కు చెందిన పదేళ్ల బాలుడు పారిపోయి తిరిగి తండ్రి వద్దకు చేరుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే..హైదరాబాద్ పట్టణంలోని పదేళ్ల బాలుడిని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లోంచి పారిపోయి రైలులో రామగుండంకు చేరుకున్నాడు. రైల్వే ఉన్నతాధికారుల సమాచారం మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సీఐ బుర్ర సురేశ్ గౌడ్ అప్రమత్తమయ్యారు. రైలు రామగుండంకు చేరుకోగా బాలుడిని రైల్వే పోలీసులు చేరదీసి చైల్డ్‌లైన్ 1098 కు సమాచారం అందించారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ బొబ్బిలి శ్రీధర్ ఆదేశాల మేరకు టీం సభ్యుడు రేణికుంట్ల సతీశ్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని బాలుడిని తబితా ఆశ్రమంలో చేర్పించాడు. సాయంత్రం బాలుడి తండ్రి సి.రాగా రావడంతో కౌన్సిలింగ్ ఇచ్చి బాలుడిని అప్పగించారు. ఇక్కడ ఆర్పీఎఫ్ ఏఎస్సై మల్లేశ్వరయ్య, కానిస్టేబుల్ ముకేష్ కుమార్, సీసీఐ నిర్వాహకుడు వీరేందర్ నాయక్, తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

- 14 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ
- పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఘటన..



ఇంట్లోని వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు

వెల్గటూర్ : మండలకేంద్రానికి కూతవేటు దూరంలోనే పోలీస్‌స్టేషన్ ఉన్నా.. తాళం వేసిన ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్ యజమాని బీరెల్లి శ్రీనివాస్ తన మామ కొత్త మురళి నూతన గృహ ప్రవేశం నిమిత్తం ఈనెల 9న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. శుభకార్యం ముగిసిన అనంతరం శ్రీనివాస్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోనే ఉన్నాడు. భార్య వనిత శనివారం రాత్రి వెల్గటూర్‌లోని ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లోని 14 తులాల బంగారం, రూ.లక్ష నగదు, విలువైన వెండి వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు. బాధితుడు బీరెల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



స్వామిరెడ్డి ఫైల్

చిగురుమామిడి : మండలంలోని పీచుపల్లి గ్రామానికి చెందిన గూడూరు స్వామిరెడ్డి (54) ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్సై దాస సుధాకర్ తెలిపిన వివరాలు.. స్వామిరెడ్డి రోజూ మాదిరిగానే వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. పొలం పక్కనే ఉన్న పత్తి చేను చుట్టూ చిన్న ముల్కనూర్‌కు చెందిన లోకిని రాములు, తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన భూనాద్రి ఐలయ్య అడవి పందుల కోసం విద్యుత్‌తీగలను అమర్చారు. ఇది తెలియని స్వామిరెడ్డికి విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతికి కారకులైన వారిపై కేసునమోదు చేశామన్నారు.




ఎద్దుగుట్ట మల్లన్న కల్యాణోత్సవం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరధి పెద్దూరు శివారులోని ఎద్దుగుట్ట మల్లన్న, ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా మల్లన్న ఆలయానికి వెళ్లి మొక్కులు సమర్పించుకున్నారు.

చోరీలకు పాల్పడిన దొంగ అరెస్టు

- బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం (కోరుట్ల) : తరచూ చోరీలకు పాలప్పడుతూ తప్పించుకొని తిరుగుతున్న దొంగను అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. లక్ష్మణ్ నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన లక్ష్మణ్ చోరీలకు పాల్పడుతూ మహారాష్ట్రలోని ధర్మాబాద్‌లో ఉంటున్నాడు. గతనెల 21న ఇబ్రహీంపట్నం గోధూర్‌లో ఇంటి తాళం పగులగొట్టి రూ. 24 వేలు ఎత్తుకెళ్లాడు. ఇప్పటికే 14 పోలీస్‌స్టేషన్లలో ఇతనిపై 22 కేసులున్నాయని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు ద్విచక్రవాహనాలు, 42 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు చెప్పారు. జగిత్యాల, కరీంనగర్ జైలు ఎస్కార్ట్ పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించాడు. లక్ష్మణ్‌ను విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. అతని నుంచి ద్విచక్రవాహనం, రూ.15 వేల విలువగల సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఉమాసాగర్, సీసీఎస్ కానిస్టేబుల్ కిరణ్‌ను అభినందించారు. ఎస్సై ఉమాసాగర్, ఏఎస్సైలు రాములు, జమీల్, కానిస్టేబుల్ రాజేందర్ ఉన్నారు.

బద్దిపోచమ్మకు బోనం మొక్కు



బోనం మొక్కులు చెల్లించుకున్న నామాల ఉమ

వేములవాడ: బద్దిపోచమ్మకు వేములవాడ పట్టణ సెస్ డైరెక్టర్ నామాల ఉమ ఆదివారం బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె వెంట జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు లక్ష్మీరాజం, రాఘవరెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును
■ సిరిసిల్ల గాంధీనగర్, లక్ష్మీటాకీస్ ఎదురుగా మార్కెట్ ఏరియాలో 3 షెటర్లు 4 ఫ్లోర్లు 2000 చ.ఫీట్లు గలది బిల్డింగ్ కిరాయకు ఇవ్వబడును. సంప్ర|| 9440488956, 9490257222. [K-1219911]

WANTED
■ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు M/F టెలికాలర్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను జీ: 10–15K, బోడుప్పల్, Pillar No.77, ఫోన్: 7981203120, 9032055834 [H-792949]
■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:18K, ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9640258899, 9640468899 [H-786847]

FACULTY TEACHERS
■ Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-, Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 8523058441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు. [B-985]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

అన్నమనేనికి సన్మానం



సుధాకర్‌రావును సన్మానిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్: 33వ డివిజన్ భగత్‌నగర్‌కు చెందిన అన్నమనేని సుధాకర్‌రావు రాష్ట్ర రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. సంఘం సభ్యులు చీటీ రామారావు, గొరిశెట్టి మనోహర్‌రావు, వెంకటయ్య, గాంధీ, హరికిషన్, సంపత్‌రావు, యశ్వంత్ రెడ్డి, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ పెన్షనర్లకు కరువు భత్యం ఇవ్వాలి

కరీంనగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ పెన్షనర్లకు బాకీ ఉన్న మూడు విడతల కరువు భత్యాన్ని వెంటనే ఇవ్వాలని, ప్రతి నెలా మొదటి తేదీనే వేతనాలు చెల్లించాలని బీజేపీ విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ సెల్ రాష్ట్ర కో–చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు విడతల డీఏలను ప్రకటించకపోవడం, ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు.

శ్రీరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

కరీంనగర్ కల్చరల్: 17వ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడు మాధవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2023 మార్చి 1 నుంచి డిసెంబర్ 31, 2024 కాలపరిమితి కోసం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసో సియేషన్ గౌరవ సలహాదారులుగా కోల ప్రశా ంత్, కొండపల్లి సతీశ్‌కుమార్, ఎ.లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడిగా డి.మాధవరావు, ఉపాధ్యక్షులుగా బల్మూరి విజయసింహారావు, బి.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గజవాడ ఆంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.నర్సింహాచారి, న్యాయ సలహాదారుగా బాస సత్యనారాయణరావు ఎన్నికయ్యారు. అలాగే సంయుక్త కార్యదర్శులుగా ఎం.కిషన్ ప్రసాద్. బి.శ్రీశైలం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జె.శరత్‌రావు, టి.శ్రీ కాంత్ గౌడ్ ఇతర కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హుజూరాబాద్: వరంగల్ జిల్లా పరకాలలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ తెలిపారు. స్పారింగ్, కట్టాస్ విభాగాల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఆదివారం వారిని ఎస్సీ కార్పొరేషన్ బండ శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, పోపా జిల్లా ఉపాధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, బీఆర్ఎస్‌వై ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ హుస్సేన్, న్యూ కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌సిటీ: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఈ నెల 7 నుంచి 30 వరకు స్వచ్ఛోత్సవ్- 2023 క్యాంపెయిన్ నిర్వహిస్తుందని కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, మహి ళా ఎంటర్‌ప్రెన్యూర్స్, స్వయం సహాయక సంఘాలు, చిన్న తరహా మహిళా ఎంటర్ ప్రైజెస్, స్టార్టప్స్, ఎన్జీవోలు వివిధ అంశాల్లో పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈనెల 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్, ఫీకాల్ యుసేడ్ వాటర్ ట్రీట్‌మెంట్, చెత్త సేకరణ తదితర అంశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వారాంతం.. క్రీడలకు ప్రాధాన్యం



అంబేద్కర్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న రెవెన్యూ అధికారులు

- నిత్యం వ్యాయామం, సెలవు రోజుల్లో క్రికెట్, టెన్నిస్ ఇతర ఆటలు
- కుటుంబంతో గడుపుతూ ఆదర్శంగా నిలుస్తున్న రెవెన్యూ అధికారులు

కరీంనగర్ అర్బన్: ఆరోగ్యంగా ఉంటే ఐశ్వర్యం ఉన్నట్టేనని అంటున్నారు ఆ రెవెన్యూ అధికారులు. నిత్యం దస్త్రాలతో కుస్తీ.. మానసిక ఒత్తిడి మామూలే. రెవెన్యూ శాఖ అంటేనే విరామం లేని బాధ్యతలు. ఇక కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే వారి పరిస్థితి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరోగ్యమే మహాభాగ్యమని ముందుకుసాగుతున్నారు.. ఎంత ఒత్తిడి ఉన్నా నిత్యం వ్యాయామంతో పాటు వారాంతాలు, సెలవు రోజుల్లో క్రికెట్, టెన్నిస్ ఇతర క్రీడలతో మానసికోల్లాసం పొందుతున్నారు. కరీంగనర్ కాంక్రీట్ నగరం విస్తరిస్తుండగా మానవ సంబంధాలే మృగ్యమైపోతున్నాయి. ఉద



రెవెన్యూ అధికారులు

యం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు ఉరుకులు, పరుగుల జీవితమే. కుటుంబంతో గడపడం, ఆరోగ్యానికి సమయమిచ్చేవారు తక్కువే. ఈ క్రమంలో వీరంతా ఆదర్శంగా నిలుస్తున్నారు.

బృందంగా ఏర్పడ్డారు..

రెవెన్యూ శాఖలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ నుంచి తహసీల్దార్ వరకు దాదాపు 30 మంది బృందంగా ఏర్పడ్డారు. గత కొన్నేళ్లుగా ఆటలకు ప్రాధాన్యమిస్తున్నారు. రోజూ కుర్చీకి పరిమితమై విధులు నిర్వహిస్తే పొట్ట పెరగడంతోపాటు మానసిక ఆందోళన, చిరాకు, ఒత్తిడి కలుగుతాయి. అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామం చేస్తున్నామని చెబుతున్నారు.

రెండేళ్లుగా వ్యాయామం



గతంలో ఆరోగ్యానికి పెద్దగా ప్రాధాన్యమిచ్చేవాన్ని కాదు. ఉదయం లేచిన నుంచి పడుకునేవరకు రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించేది. మానసిక ఒత్తిడి దూరం కావాలంటే వ్యాయామమే ఔషధమని భావించా. రెండేళ్లుగా చేస్తున్న.

– నేరెళ్ల కిషన్, నాయబ్ తహసీల్దార్, కలెక్టరేట్

ఆనందం.. ఆరోగ్యం



కుటుంబాన్ని, ఉద్యోగాన్ని చూస్తుండటంతో ఆరోగ్యంపై శ్రద్ధ కరువవుతోంది. రోజూ వ్యాయామం చేయడం వల్ల ఆనందం, ఆరోగ్యం లభిస్తాయి. శరీరం తేలికగా ఉండి, రోజంతా ఉత్సాహంగా అనిపిస్తుంది.

– కముటం శ్రవణ్, నాయబ్ తహసీల్దార్, కరీంనగర్ అర్బన్

అనేక ప్రయోజనాలు



శారీరకంగా ధృఢంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. నిత్యం కసరత్తు వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. వైద్యులు చెబితేనే చేస్తామనడం సరికాదు. ఎవరి ఆరోగ్యంపై వారిదే బాధ్యత.

– ఖాజా, నాయబ్ తహసీల్దార్, సివిల్ సప్లయ్

పరిచయాలు పెరుగుతాయి



రోజూ వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం లభిస్తుంది. కొత్తవారితో పరిచయాలు పెరుగుతాయి. ఒకరికొకరు తోడున్నామనే భావన కలిగి, అది కొండంత ధైర్యాన్నిస్తుంది.

– ముజమిల్, నాయబ్ తహసీల్దార్, కరీంనగర్ రూరల్

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఇతర దేశాల్లో వ్యాయామం తప్పనిసరి. శరీరాకృతిలో మార్పు లొస్తే జరిమానా విధిస్తారు. మన దగ్గర అలాంటి పరిస్థితి లేదు. ఆరోగ్యంపై ప్రతిఒక్కరికీ శ్రద్ధ అవసరం. నిత్యం వ్యాయామం చేయాలి.

– గండె లక్ష్మీనర్సింహారావు, తహసీల్దార్, కొత్తపల్లి

చురుగ్గా పని చేస్తాం..



నిత్యం వ్యాయామంతో కొత్తగా ఆలోచించగలుగుతాం. చురుగ్గా పని చేస్తాం. నా జీవితంలో వ్యాయామం చేయకముందు రోజులకు చేసిన తర్వాత రోజులకు ఎంతో తేడా ఉంది.

– సంపత్, ఎన్‌ఐసీ అధికారి

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ డీఎఫ్‌వో, సివిల్ ఆసుపత్రి ఫీడర్ల పరిధిలోని వావిలాలపల్లి, అంబేడ్కర్ రోడ్, రెనే ఆసుపత్రి రోడ్, సివిల్ ఆసుపత్రి నుంచి సెవెన్ హిల్స్ రోడ్, రాజీవ్‌చౌక్ నుంచి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రోడ్, డీఎఫ్‌వో ఎక్స్ రోడ్ నుంచి వెంకటేశ్వర దేవాలయం రోడ్, డాక్టర్స్ స్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

మిగులు బడ్జెట్ రాష్ట్రంలో వేతన వెతలు

సప్తగిరికాలనీ: ప్రతినెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించడం ప్రభుత్వం బాధ్యత అని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. కానీ గత రెండేళ్లుగా 12 తేదీ వరకు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో వేతన వెతలు తీరడం లేదన్నారు. ఫిబ్రవరి నెల జీతం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆదాయ పన్ను చెల్లించడానికే సరిపోయిందని తెలిపారు. ఆ కాస్త అమౌంట్‌ను సకాలంలో జమ చేయకపోవడం వల్ల బ్యాంక్‌లో చెల్లింపులకు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఇది భవిషత్‌లో బ్యాంక్ లోన్ తీసుకోవడానికి సమస్యగా మారుతుందని అన్నారు.

కవాతు సక్సెస్‌తో బీఆర్ఎస్‌లో గుబులు

కరీంనగర్‌టౌన్: భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలో చేపట్టిన కరీంనగర్ కవాతు సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో గుబులు మొదలైందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరెందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం చూసిన అధికార పార్టీ నాయకులు తమ కోటకు బీటలు వారతాయనే ఉద్దేశంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ముఖ్యంగా మేయర్ సునీల్‌రావు చేసిన ఆరోపణలు విడ్డూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎలాంటి మచ్చ లేని నేతలుగా ప్రజాదరణ పొందుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌లను విమర్శించే స్థాయి అధికారం కోసం పార్టీలు మారే మేయర్ సునీల్‌రావుకు లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి, పదవులు అనుభవించినప్పుడు ఈ నేతల గురించి తెలియదా



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

అని ప్రశ్నించారు. నగరపాలక సంస్థలో విచ్చలవిడిగా కమీషన్ల దందా, అవినీతి జరుగుతున్నాయని, దమ్ముంటే వాటికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. మరోసారి తమ నాయకులపై మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, రోహిత్‌రావు, కుర్ర పోచయ్య, జీడి రమేశ్, మామిడి సత్యనారాయణరెడ్డి, ధన్నసింగ్, అనిల్‌కుమార్, ఎండీ చాంద్, పొరండ్ల రమేశ్, షహన్నా, నదీం, ముక్క భాస్కర్, రమేశ్, అజ్మత్, కమల్, ఇమామ్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీవి చిల్లర రాజకీయాలు

కరీంనగర్‌టౌన్: ఎమ్మెల్సీ కవిత లిక్కర్ దందా, ఈడీ కేసుల దృష్టిని మరల్చడానికే ప్రగతి భవన్ డైరెక్షన్‌లో బీఆర్ఎస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణను సాధించుకోవడంలో మన భాష, యాస పాత్రను మరిచిపోయిన కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ తెలంగాణ యాసలో మాట్లాడిన మాటలను వక్రీకరించి, ఏదో మహిళా జాతినే అవమానించినట్లు చిత్రీకరిస్తూ ఆందోళనలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. దీన్ని నిరసిస్తూ ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ఎంపీ సంజయ్ కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు దుబాల శ్రీనివాస్, కొరిటాల



బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

శివరామయ్య, కళ్లెం వాసుదేవరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, కటకం లోకేష్, జాడి బాల్‌రెడ్డి, పుప్పాల రఘు, బండ రమణారెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, నరహరి లక్ష్మారెడ్డి, మామిడి చైతన్య రమేశ్, వరాల జ్యోతి, సుధాకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

కరీంనగర్‌కల్చరల్: మహిళలపై హింస రోజురోజుకూ పెరిగిపోతోందని, రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలైమయ్యాయని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. ఐద్వా శ్రామిక మహిళ(సీఐటీయూ), ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, యూటీఎఫ్ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల వారోత్సవ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. హత్యలు, అత్యాచారాలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, నేరస్తులకు వెంటనే శిక్షలు అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.కృష్ణవేణి, ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కో–కన్వీనర్ శ్రీవాణి, డీవైఎఫ్‌ఐ గర్ల్స్ కో–కన్వీనర్ నీరజ, శ్రామిక మహి



మాట్లాడుతున్న నాగమణి

ళా సమన్వయ జిల్లా నాయకురాలు సంపూర్ణ, ఐద్వా సలహాదారు గుడి కందుల సత్యం, రైతు సంఘం అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు రజనీకాంత్, తిరుపతి, ప్రజాసంఘాల నాయకులు ద్యావ అన్నపూర్ణ, మాదాసు యమున, నరాల లావణ్య, శారద, లక్ష్మి రాజకుమారి, సంధ్య తదితరులున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనం ఎత్తుకున్న మేయర్ సునీల్‌రావు



పట్నం వేస్తున్న భక్తులు



బోనాలతో తరలివెళ్తున్న భక్తులు



గోపాల్‌పూర్‌లో బోనాలతో మహిళలు

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గాయత్రీ పీఠాధిపతి నందికొండ జగద్గురు కాళ హస్వాచార్య స్వామి ప్రవచనాలు ఇచ్చారు. మహిళలు ఆలయం వద్ద నుంచి బోనాలు ఎత్తుకొని, డప్పుచప్పుళ్లు, కోలాట నృత్యాల మధ్య కోతిరాంపూర్‌లోని పోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, విశ్వబ్రాహ్మణ సంఘం బాధ్యులు గొల్లపల్లి శ్రీనివాస్, శ్రీరామోజు నాగరాజు, మియపుర బ్రహ్మం, వేములవాడ రవీంద్రాచారి, అనసూరి రమేశ్, ముత్తోజు రామ్, లత తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ గోదాంలో..

కరీంనగర్‌లోని సీడబ్ల్యూసీ గోదాంలో పోచమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయ హమాలీ సంఘం ప్రెసిడెంట్ కాల్వ సదయ్య, కార్యదర్శి కొండపల్లి సత్యనారాయణ, బైర అశోక్, మాచర్ల ముత్యం, ఎడ్ల సతీశ్, గోలి రవీందర్, మెతుకు మల్లేశం, ముక్కెర సారయ్య తదితరులు పాల్గొన్నారు.

మడేలేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో..

కరీంనగర్‌లోని న్యూదోబివాడ మడేలేశ్వర రజక సహకార సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మడేలేశ్వర ఆలయం నుంచి డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా కోతిరాంపూర్‌లోని పోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్తకొండ రాజయ్య, ఉపాధ్యక్షుడు రాచకొండ నాగరాజు, ప్రధాన కార్యదర్శి జంగపల్లి కుమార్, కార్యదర్శి కొత్తకొండ సంపత్, డైరెక్టర్లు వసంత, తార, లక్ష్మీనర్సయ్య, శ్రీధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్‌లో ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలోని లక్కమారికాపు, దాడి కాపు సంఘాల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ గుడి వద్దకు వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్
- అలరించిన అల్ఫోర్స్ టైనీటాట్స్ 'అద్యాపన్'

కొత్తపల్లి: విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్‌కు పునాదులు పడతాయని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో 'అద్యాపన్' పేరుతో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవాన్ని జెడ్పీ సీఈవో ప్రియాంక, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డిలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అనుకున్న రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యనందిస్తున్నారని నరేందర్ రెడ్డిని అభినందించారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ పుస్తక పఠనం, సామాజిక స్పృ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ కర్ణన్, జెడ్పీ సీఈవో ప్రియాంక

హను అలవర్చుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలోనే లక్ష్యాన్ని ఎంచుకొని, సాధించాలని చెప్పారు. అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలనలో జిల్లాను అగ్రగామిగా నిలుపుతున్న కలెక్టర్ దం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పతులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని, క్రమశిక్షణతో చదివి, జీవితంలో విజయం సాధించాలని చెప్పారు. పాఠశాల వార్షిక ప్రణాళికలో భాగంగా అత్యున్నతంగా రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పారమిత'లో ముగిసిన హోలీ సత్సంగ్

కరీంనగర్ కల్చరల్: మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు కొనసాగిన 'ధర్మ'(ఏ హోలీ సత్సంగ్) కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. విద్యార్థులు పంచ ప్రయాగ, గయత్రయ, ధన్వంతరి, గీతామందిరం, వారణాసి దర్శనం, జ్యోతిర్లింగాలు, గ్రహవీక్షణం, సంస్కృతి, సైన్స్ తదితర అంశాలపై అద్భుతమైన ప్రదర్శనలు చేశారు. రామాయణం, మహాభారతం వంటి కావ్యాలపై వేసిన నాటికలు చూపరులను ఆకట్టుకున్నారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇనగంటి ప్రసాదరావు మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు విలువలు నేర్పి, మూలాలను తెలపాల్సిన బాధ్యత



మనందరిపై ఉందన్నారు. డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ఆనంద్ కమలాకర్, బాలాజీ, ప్రశాంత్, కవిత, తిరుపతిరావు తదితరులున్నారు.

ఫొటోస్టోరీ



వంతెనపై గుంతలు

తీగలగుట్టపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ వంతెనపై రెండు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు కింద ఉన్న పైపులు పగిలిపోవడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు తెలిపారు. ఆ గుంతలను గుర్తించేందుకు వీలుగా వాటిపై దుంగలను ఉంచారు. కర్రకు సంచిని కట్టారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి, గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: సంతోష్, డీఈ, ఎస్సారెస్పీ
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 97015 70597

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899

తవ్విన కొద్దీ... 'చీట్స్'

అక్రమాలపుట్ట మార్గదర్శిలో నలుగురు మేనేజర్ల అరెస్టు ● ఒక్క రూపాయి కూడా లేకుండా కంపెనీ పేరిట వేలాది చిట్టీలు

సాక్షి, అమరావతి: సోదాలు చేస్తున్న కొద్దీ అక్రమాల పుట్టగా బయటపడుతున్న మార్గదర్శి చిట్ ఫండ్స్ వ్యవహారంలో అరెస్టులకు తెరలేచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్న సీఐడీ అధికారులు... నలుగురు బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసి ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఇప్పటికే ఏ1గా రామోజీరావును, ఏ2గా చెరుకూరి శైలజను, ఏ3గా బ్రాంచి మేనేజర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన సీఐడీ... ఫోర్‌మన్లుగా పిలిచే కామినేని శ్రీనివాసరావు (విశాఖ- సీతమ్మధార బ్రాంచి), సత్తి రవి శంకర్ (రాజమండ్రి), బి.శ్రీనివాసరావు (విజయవాడ- లబ్బీపేట), గొరిజవోలు శివరామకృష్ణ (గుంటూరు)లను అరెస్టు చేసి ఆయా ప్రాంతాల్లో న్యాయమూర్తుల ఎదుట హాజరు పరిచారు. వీరిలో కొందరికి 24 వరకూ రిమాండు విధించారు. ఈ సందర్భంగా వెలుగుచూసిన అక్రమాలు అధికారులను సైతం దిగ్భ్రాంతికి గురిచేశాయి. చిట్ సభ్యుల స్థానంలో వేల చిట్లలో తమ పేరే రాసేసుకున్న మార్గదర్శి సంస్థ... నిబంధనల మేరకు దానికి పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు!!. చిట్లలో తనకు వచ్చే కొద్దిపాటి డిస్కౌంట్ల మొత్తాన్నే దాదాపు అన్ని చిట్లలోనూ డూప్లికేట్ చేసి చూపించి... దాన్నే తమ సొమ్ముగా పేర్కొనటంతో, ఇదంతా పచ్చి 'గొలుసు' వ్యవహారంగా మారిపోయింది. గొలుసులో ఏ చిన్న లింకు తెగినా... ఇది సంస్థ దివాలాకు దారితీసే ప్రమాదముంది. అదే జరిగితే చిట్ సభ్యుల సొమ్ము వాళ్లకు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతోపాటు చిట్లలకు వేర్వేరు బ్యాంకు ఖాతాలను నిర్వహించాల్సి ఉండగా... అన్నిటికీ ఒకే ఖాతాను నిర్వహిస్తూ వాటిలో డబ్బును ఇష్టం వచ్చినట్టుగా మళ్లించటం కూడా విస్మయం కలిగిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో గ్రూపు సంస్థల్లోకి కోట్లాది రూపాయలు మళ్లిస్తుండటంతో పాటు... హైరిస్క్ ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లోకి కూడా ఈ ఖాతా నుంచి చిట్ సభ్యుల సొమ్మును మళ్లించటం గమనార్హం. వీటన్నిటితో పాటు... చట్ట విరుద్ధ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసేసినా డిపాజిట్లు తీసుకోవటం మాత్రం రామోజీ రావు ఆపలేదని తాజా సోదాల్లో వెల్లడయింది. చిట్ సభ్యుల నుంచి అక్రమంగా డిపాజిట్లు తీసుకుంటూ... బ్యాంకుల్లో అయితే వాటిపై టీడీఎస్ (ఆదాపు పన్ను) చెల్లించాలని, తమ దగ్గరైతే అలాంటిదేమీ ఉండదని నమ్మబలుకుతుండటం మోసాలకు పరాకాష్టగా అధికారులు చెబుతున్నారు. ఆ అక్రమాల వివరాలివీ...

ఒక్క రూపాయి చెల్లించకుండా... తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్ణీత చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని 27, 32 సెక్షన్లలో నిర్దేశించిన ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50 శాతం వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. కానీ వాటికోసం మార్గదర్శి ఇప్పటిదాకా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది. ఒకవేళ పరిస్థితులు ప్రతికూలించి కొన్ని గ్రూపుల్లో చిట్ల సభ్యులు తమ చందా చెల్లించలేకపోతే... ఇక మిగతా వాళ్లకు చిట్లు పాడుకున్నా సరే డబ్బులు రావటం కష్టం. ఎందుకంటే కంపెనీ పేరిట ఉన్న వేటికీ డబ్బులు లేవు కాబట్టి!!.

ఇదిగో ఉదాహరణ.... ఎంసీఎఫ్ గుంటూరు బ్రాంచిలో 45 గ్రూపుల చిట్టీలు వేశారు. వాటిలో మొత్తం 2,040 టికెట్లు (చందాదారులు) ఉన్నాయి. 858 టికెట్లు మార్గదర్శివే. వాటి చందాగా మార్గదర్శి రూ.16.96 కోట్లు చెల్లించాలి. కానీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని బ్రాంచి మేనేజర్(ఫోర్‌మేన్) అంగీకరించారు. కేవలం రికార్డుల్లో ఎంట్రీలను అటూ ఇటూ జంబ్లింగ్ చేసి చూపిస్తోంది. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ మొత్తంగా 2,300 చిట్టీలను నిర్వహిస్తోంది. వాటిలో లక్షమందికిపైగా చందాదారులున్నారు. వాటిలో కొన్ని వేల టికెట్లు మార్గదర్శివే. కానీ సంస్థ యాజమాన్యం తన వాటాగా ఒక్క రూపాయి కూడా పెట్టలేదు. గొలుసు కట్టు మాదిరిగా ఒక చిట్ సొమ్మును వేరే చోట సర్దుబాటు చేస్తూ... కొందరికి ష్యూరిటీల పేరిట ఆలస్యం చేస్తూ... మరికొందరికి డిపాజిట్ల పేరిట తరవాత ఇస్తామని చెబుతూ రోజులు నెట్టుకొస్తోంది. అదీ కథ.

ఒక్క బ్యాంకు ఖాతా చాలట!!

చిట్‌ఫండ్ సంస్థలు తమ నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. చిట్టీల ఒప్పందాల్లో బ్యాంకు పేరును చెబుతోంది తప్ప ఖాతాల నంబర్లు, ఇతర వివరాలను ఇవ్వటమే లేదు. ప్రతి చిట్టీకీ ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతా ఉండాల్సి ఉండగా... దాన్నీ పాటించటం లేదు. అన్నీ ఒకే బ్యాంకు ఖాతాలో భారీగా పోగేస్తోంది. నిజానికిదో పెద్ద ఆర్థిక కుట్ర. నిబంధనల ప్రకారం చిట్టీల బ్యాంకు ఖాతాలపై సదరు బ్రాంచి మేనేజర్ (ఫోర్‌మేన్)కు చెక్ పవర్ ఉండాలి. ఆ మేనేజరే అన్నీ చూడాలి. కానీ మార్గదర్శిలో ఏ బ్రాంచి మేనేజర్‌కూ చెక్ పవర్ లేదు. అంతా హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచే నడిపిస్తున్నారు. అక్కడ ఒకరికే చెక్ పవర్ కల్పించడం వెనుక గూడుపుఠాణి ఏమంటే... ఆ ఖాతా నుంచి నిధులు మళ్లించటం ఈజీ కనక. మ్యూచువల్ ఫండ్స్, ఇతర స్టాక్ మార్కెట్ సాధనాల్లో పెట్టుబడి పెట్టడం నేరమైనా... మార్గదర్శి చేస్తున్నది అదే. తమ గ్రూపు సంస్థ ఉషోదయ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5శాతం వాటాను మార్గదర్శి చిట్స్ కొనుగోలు చేసింది. ఇతర సంస్థల్లోకీ అక్రమంగా నిధులు మళ్లించింది. హైరిస్క్ ఉన్న వీటిలో పెట్టుబడులు పెడుతున్నట్లు చందాదారులకు కనీసం తెలియకుండా... దశాబ్దాలుగా రామోజీ సాగిస్తున్న ఆర్థిక దోపిడీ ఇది.

డిపాజిట్లు సేకరించటం నేరమే అయినా...

చిట్టీ పాడిన చందాదారుడికి చిట్టీ మొత్తం చెల్లించినట్టుగా చిట్స్ రిజిస్ట్రార్‌కు చూపిస్తున్న మార్గదర్శి... ఆ చందాదారుడికి పూర్తిగా చెల్లించకపోవటం గమనార్హం. ష్యూరిటీలు సరిగా లేవన్న కారణాలతో పలువురు చందాదారుల నుంచి ఫ్యూచర్ సెక్యూరిటీ పేరిట మిగిలిన కాలానికి చెల్లించాల్సిన చందాను తమ వద్దే ఉంచుకుంటున్నారు. దానికి ఓ రశీదు ఇస్తున్నారు. దానిపై 4-5 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఇలా డిపాజిట్లు సేకరించటం చట్టప్రకారం నేరం. రామోజీ మాత్రం అదేమీ పట్టించుకోవటం లేదు. దానికి ఇదిగో ఉదాహరణ...

ఒకే వ్యక్తి నుంచి రూ.కోటికిపైగా అక్రమ డిపాజిట్లు

మార్గదర్శిలో ఓ చందాదారునికి 24 చిట్టీలున్నాయి. ఆయన నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ 'రశీదు' రూపంలో రూ.కోటికు పైగా డిపాజిట్లు వసూలు చేసింది. దీనిపై ఆ సభ్యుడిని విచారించగా విస్మయకర అంశాలు వెల్లడయ్యాయి. టీడీఎస్ మినహాయించుకోకుండా తాము డిపాజిట్లు సేకరిస్తున్నామని మార్గదర్శి చిట్స్ తనకు చెప్పిందని ఆయన తెలిపారు. బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే టీడీఎస్ చెల్లించాలి. అదే మార్గదర్శిలో అయితే టీడీఎస్ అవసరం లేదని చెప్పి ఆయన్ని ఆకర్షించారు. ఇది ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం నేరం. నిజానికి గతంలో మార్గ దర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఎలాంటి అనుమతు లూ లేకుండా రూ.2,600 కోట్లు డిపాజిట్లుగా వసూలు చేశారు. దీన్ని నాటి ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ బయటపెట్టడంతో కేసులు నమోదయ్యాయి. విచిత్రమేంటంటే కేసులు కొనసాగుతుండగా... నేరాన్ని కప్పిపుచ్చుకోవటానికి మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను రామోజీ రావు మూసేశారు. ఇలా డిపాజిట్లు సేకరించటం ఐటీ చట్టం ప్రకారం నేరం. ఎంత సేకరిస్తే అంత మొత్తాన్ని పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఐటీ కూడా రామోజీకి నోటీసులు జారీ చేసింది. దానిపైనా పలు కేసులు నడుస్తున్నాయి. అలాంటి సమయంలో సంస్థను కుట్రపూరితంగా మూసేయటమే కాక... ఇపుడు చిట్స్ ముసుగులో రకరకాల పేర్లతో డిపాజిట్లు సేకరిస్తుండటం గమనార్హం.

మేనేజర్ల పేరిట మరో పన్నాగం...

అవినీతి బాగోతం బయటపడే సమయంలో దానికి సాంకేతిక కారణాలు చూపించి తప్పించుకోవటంలో రామోజీది అందెవేసిన చెయ్యి. అదే తరహాలో చిట్స్ విషయంలోనూ ఈ ఉల్లంఘనలన్నింటినీ తమ బ్రాంచి మేనేజర్ల(ఫోర్‌మెన్) నెత్తిన రుద్దీ తప్పించుకునే దుర్మార్గానికి తెరతీశారు రామోజీ. కానీ స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఈ కేసును శాస్త్రీయంగా అధ్యాయనం చేసి... తగిన ఆధారాలు సేకరించడం ద్వారా రామోజీ ఎత్తును చిత్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు బయటపడగానే రామోజీరావు తన ఈనాడు పత్రికలో అరపేజీ ప్రకటన ఇచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు సంబంధించి అన్ని వ్యవహారాలు బ్రాంచి మేనేజర్లే మాత్రమే చూస్తారు ...సర్వాధికారాలు వారివేనని అందులో పేర్కొన్నారు. అంతేకాదు తెలంగాణ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో అదే మాట చెప్పారు. తద్వారా బ్రాంచి కార్యాలయాల్లో అక్రమాలతో తనకు సంబంధం లేదని చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేశారు. కానీ స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ విభాగాలు రామోజీరావు కుట్రను సమర్థంగా తిప్పికొట్టాయి. ఎందుకంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు కేవలం నిమిత్త మాత్రులు. వారికి తమ బ్రాంచిలోని ఖాతాలకు సంబంధించి కనీసం చెక్ పవర్ కూడా లేదు. అంటే వారికి సర్వాధికారాలు ఉన్నాయని రామోజీ ఇచ్చిన ప్రకటనలో గానీ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో గానీ చెప్పినవన్నీ అబద్ధాలేనన్నది స్పష్టమైంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అన్ని అక్రమాలకు రామోజీరావు, ఆయన కోడలు శైలజే పూర్తి బాధ్యులనేది సుస్పష్టం.

జెండాను గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు కృతజ్ఞతలు

● పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం జగన్



సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. '12 వసంతాలు పూర్తి చేసుకుని, నేడు 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభిమానులకు, కార్యకర్తలకు, నాయకులకు, రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. గత 12 ఏళ్లుగా ప్రయాణంలో నాతో నిలబడి, నాకు వెన్నుదన్నుగా ఉన్న ప్రతి ఒక్కరికీ, మన పార్టీ జెండాను తమ గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు. మన ప్రయాణం ఎప్పటికీ ఇలాగే కొనసాగుతూ ఉండాలని కోరుకుంటున్నాను' అని ఆదివారం ట్వీట్ చేశారు.



ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు వైఎస్సార్‌సీపీ ఓ రోల్ మోడల్ అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీని దేశంలోనే ఆదర్శవంతమైన పార్టీగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సజ్జల.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మరోవైపు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు, నేతలు పండగలా నిర్వహించారు.

ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుంది

- అరెస్టు చేస్తే చేయనివ్వండి.. నేను అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా
- కడపలో మీడియాతో వైఎస్ భాస్కర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- వైఎస్ వివేకా హత్యకేసులో సీబీఐ విచారణ కోసం హాజరైన భాస్కర్‌రెడ్డి



కడప అర్బన్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో కీలకమైన ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 12న తమ ముందు విచారణకు హాజరుకావాలని సీబీఐ అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆయన కడప కేంద్రకారాగారంలోని గెస్ట్‌హౌస్‌లో ఉన్న సీబీఐ అధికారుల ముందు హాజరయ్యేందుకు వెళ్లారు. అక్కడ సీబీఐ అధికారులెవరూ అందుబాటులో లేరు. మళ్లీ నోటీసులు ఇస్తామని, అప్పుడు విచారణకు హాజరుకావాలని అక్కడి సిబ్బంది సూచించడంతో ఆయన వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే అవినాశ్‌రెడ్డి అన్ని విషయాలు చెప్పారని, తాను చెప్పేదేమీ లేదని పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం సహకరించకపోయినా విచారణకు సహకరించాలనే ఉద్దేశంతో వచ్చానన్నారు. విచారణ అధికారులు అందుబాటులో లేరని, మరోసారి నోటీసులు ఇస్తామని చెప్పారని తెలిపారు. తిరిగి తనకు నోటీసులు ఇస్తే విచారణకు వస్తానని స్పష్టం చేశారు. ఈ కేసు పరిష్కారం కావాలంటే వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో వెలుగుచూసిన లేఖ బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ లేఖ బయటకు వస్తేనే అన్ని విషయాలు బయటకొస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో తాను ఇంతకంటే ఏమీ చెప్పలేనని వ్యాఖ్యానించారు. అరెస్టుపై జరుగుతున్న ప్రచారంపైన కూడా ఆయన స్పందించారు. కేసు తప్పుదోవ పట్టిస్తున్నారని చెబుతూ.. 'అరెస్టు చేసుకుంటే చేసుకోండి, అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా..' అని చెప్పారు.

బాసరలో భక్తుల రద్దీ



అమ్మవారి సన్నిధిలో భక్తులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థులు అధిక సంఖ్యలో అమ్మవారి సన్నిధికి వచ్చారు. ప్రతిఏటా పరీక్షలకు ముందు ఆలయంలో పూజలు చేసి అమ్మవారిని దర్శించుకుని వెళ్తారు. ఆదివారం వేకువ జాము గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తర్వాత నదిఒడ్డున ఉన్న సూర్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఐక్యరాజ్య సమితి సదస్సుకు పొనకల్ వాసి



శరత్‌కుమార్

జన్నారం: జన్నారం మండలవాసికి అరుదైన అవకాశం లభించింది. పొనకల్‌కు చెందిన పల్లెర్ల శరత్‌కుమార్ ఢిల్లీలోని ప్రభుత్వ కార్యాలయంలో ఎన్విరాల్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్నాడు. స్విట్జర్లాండ్‌లోని ఇంటర్‌కెన్‌సిటీలో ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహించే ఐక్యరాజ్య సమితి సదస్సుకు వెళ్లే భారత ప్రతి నిధి బృందానికి పల్లెర్ల శరత్‌కుమార్ నామినేట్ అయ్యాడు. 198 దేశాల భాగస్వామ్యంతో జరగనున్న ఈ సదస్సులో శరత్‌కుమార్ వాతావరణ మార్పులపై వివరించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడుతూ అరుదైన ఈ అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని, చాలా ఆనందం ఉందన్నారు.

సమాజసేవే లక్ష్యంగా హెచ్‌ఆర్‌సీఐ

- నంస్థ జాతీయ చైర్మన్ శ్రీకాంత్

పాతమంచిర్యాల: సమాజసేవే లక్ష్యంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందని జాతీయ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని షణ్ముఖసాయి కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం తెలంగాణ హెచ్ఆర్‌సీఐ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం తమ సంస్థ పోరాటం చేస్తోందని తెలిపారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే బాధితుల పక్షాన నిలబడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో సంస్థ ద్వారా వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏటా డిసెంబర్ 10న మానవ హక్కుల పరిరక్షణ డే జరుపుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నందం నర్సింహారావు, సౌత్ ఇండియా అధ్యక్షుడు బెల్లపు హరిప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



తిరుమల్‌రావుకు నియామకపత్రం అందిస్తున్న చైర్మన్ శ్రీకాంత్

హెచ్‌ఆర్‌సీఐ అధ్యక్షుడిగా తిరుమల్‌రావు

తెలంగాణ హెచ్‌ఆర్‌సీఐ అధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన బేతి తిరుమల్‌రావు ఎన్నిక కాగా, జాతీయ చైర్మన్ శ్రీకాంత్ నియామకపత్రం అందించారు. రాష్ట్ర కమిటీలో 54 మంది సభ్యులుంటారని, ఇందులో అడ్వొకేట్లు, మీడియా ప్రతినిధులు, అన్నిరంగాలకు చెందిన వారు ఉంటారన్నారు. 33 జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి జనరల్‌బాడీ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జన్నారం ఎఫ్‌డీవోకు సన్మానం



సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

జన్నారం: హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో జన్నారం ఎఫ్‌డీవో సిరిపురం మాధవరావు దంపతులను ఆదివారం రిటైర్డ్ అటవీ ఉన్నతాధికారుల అసోసియేషన్ నాయకులు సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ పీసీసీఎఫ్ పీకే ఝా, నాయకులు ఆయన్ను పూలమాలతో సత్కరించారు. అడవుల అభివృద్ధిలో భాగంగా మాధవరావు చేసిన కృషికి గాను సన్మానించారు. ఇలాంటి గౌరవం దక్కడం ఆనందంగా ఉందని మాధవరావు విలేకరులతో తెలిపారు.

'గుర్తింపు'పై నేడు కీలక సమావేశం

- కార్మిక సంఘాలతో భేటీకానున్న సీఎల్‌సీ
- హాజరు కానున్న కార్మిక సంఘాలు
- ఎన్నికల తేదీ ప్రకటించే అవకాశం
- ఇప్పటికే గనులపై ఎన్నికల సందడి



సింగరేణి కార్మికులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు ఎన్నికలపై కీలక ప్రకటన వెలువడే సమయం ఆసన్నమైనట్లు కనిపిస్తోంది. సంస్థ వ్యాప్తంగా ఉన్న గుర్తింపు, ప్రాతినిధ్య, జాతీయ సంఘాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చీఫ్ లేబర్ కమిషనర్ (సీఎల్‌సీ) హైదరాబాద్‌లో సోమవారం సమావేశం కానున్నారు. ఈ మేరకు అన్ని యూనియన్లకు సమాచారం పంపారు. ఇందులో అన్ని కార్మిక సంఘాలతో చర్చించి ఎన్నికల నిర్వహణకు తేదీని ప్రకటించే అవకాశముంది. వాస్తవానికి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం పదవికాలం ఎప్పుడో ముగిసింది. ఎన్నికలు నిర్వహించాలని రెండేళ్ల క్రితమే అన్ని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. అయితే అప్పుడు కోవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉండడం, సింగరేణి విస్తరించి ఉన్న కొన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికలకు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో గుర్తింపు ఎన్నికల వాయిదా పడుతూ వచ్చాయి. దీంతో గతేడాది డిసెంబర్‌లో అన్ని కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి పలు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేశాయి. ఆ సమ్మె డిమాండ్లలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహించాలనేదే ప్రధానంగా పెట్టుకున్నారు. దీనికి యాజమాన్యం, సీఎల్‌సీ అంగీకరించినా.. ముందడుగు మాత్రం పడలేదు. అలా.. దశలవారీగా ఎన్నికల ప్రక్రియ వాయిదా పడుతూనే ఉంది. ఈ క్రమంలో సింగరేణిలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ హైకోర్టులో రిట్ వేసింది. దీంతో కోర్టు ఎన్నికలపై వెంటనే స్పందించాలని సింగరేణి యాజమాన్యం, ఆర్ఎల్‌సీని కోరింది. మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల ప్రకారమైతే ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహించాలి. హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్‌ను నియమించింది. రంగంలోకి దిగిన ఆయన సమావేశానికి అన్ని సంఘాలు హాజరుకావాలని లేఖలు పంపారు.

ఎన్నికల తేదీ ప్రకటించే చాన్స్..

సీఎల్‌సీతో జరిగే సమావేశంలో గుర్తింపు సంఘం ఎన్నికల తేదీని ప్రకటించే అవకాశాలున్నాయి. అయితే మార్చి నెల ఉత్పత్తి సమయం కావడంతో ఈనెల తర్వాత ఎప్పుడైనా సింగరేణిలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి అధికంగా ఉండే అవకాశం ఉండటంతో జూన్‌లో ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యం కోరే అవకాశాలున్నాయి. ఈక్రమంలో ఎన్నికల విషయంలో సీఎల్‌సీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

అప్పుడే ప్రారంభమైన సందడి..

బొగ్గు గనులపై ఎన్నికల సందడి అప్పుడే ప్రారంభమైంది. కార్మికుల్లోకి వెళ్లేందుకు ప్రధాన అస్త్రమైన గేట్‌మీటింగ్‌ల ద్వారా కార్మిక సంఘాలు ప్రచారాన్ని తీవ్రతరం చేశాయి. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు జాతీయ కార్మిక సంఘాలు అన్ని గనులపై గేట్ మీటింగ్‌లు పెడుతూ కార్మికులకు దగ్గరవడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. సింగరేణిలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని యూనియన్ శ్రేణులకు అధిష్టానాలు ఆదేశాలు జారీ చేశాయి.

మల్లన్న సన్నిధిలో పోటెత్తిన భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కోనేరులో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఒగ్గుపూజారులతో పట్నాలు వేయించారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను పాలకవర్గం పర్యవేక్షించింది.



పట్నాలు వేస్తున్న ఒగ్గుపూజారులు

రోలార్ స్కేటింగ్ పోటీలకు స్పందన




పోటీలకు హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా రోలార్ స్కేటింగ్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి రోలార్ స్కేటింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి సుమారు 90 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, నిర్వాహణ కార్యదర్శి గట్టు అనిల్‌కుమార్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీ-థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు సరఫరా పునరుద్ధరణ

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రానికి శనివారం నుంచి దశలవారీగా బొగ్గు, ఆయిల్ సరఫరాను పునరుద్ధరించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కాగా జనవరి 26నుంచి బొగ్గు, ఆయిల్ సరఫరా నిలిపివేయడంతో చివరి దశలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విద్యుత్ మంత్రి, సీఎండీని కలిసి సమస్యను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఇప్పటివరకు సుమారు 25వేల లీటర్ల ఆయిల్, 1500 టన్నుల బొగ్గు సరఫరా జరిగిందన్నారు. తరచూ బాయిలర్ ట్యూబ్స్ లీకేజీతో విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిచిపోతుందన్నారు. సమస్య పరిష్కారానికి రూ.15 కోట్లు నిధులు కేటాయిస్తే పదేళ్ల పాటు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అధికారులు కోరుతున్నారు.



కోల్ యార్డులో డంపింగ్ చేస్తున్న బొగ్గు నిల్వలు

మందు బాబూ.. మందు!

మద్యం కొనాలంటే మందుబాబులు వైన్స్ లేదా బెల్ట్ షాప్‌కు వెళ్తారు. దండేపల్లి మండల కేంద్రంలో మాత్రం మద్యం కిరాణా షాపుల్లోనూ దొరుకుతోంది. మండల కేంద్రం నుంచి పెద్దయ్య దేవుని ఆలయానికి వెళ్లే మార్గంలో కిరాణా షాపుల యజమానులు.. ఇలా రోడ్డుపై పూజ, వంట సామగ్రితోపాటు మద్యం కూడా ప్రదర్శనకు పెట్టి మరీ విక్రయిస్తున్నారు. ఫుల్ బాటిల్ మద్యానికి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు.

- దండేపల్లి



సన్నిధి

బౌద్ధవాణి

ఆకాశంలో...

పొంగిడితే పొంగిపోవడం, తెగిడితే కుంగిపోవడం స్థిరచిత్తం లేని వారు చేసేపని. సత్యదర్శనం చేసినవారు, మనో రుగ్మతలు పోగొట్టుకున్న ప్రాజ్ఞులు పొగడ్తలకు పొంగిపోరు. నిందలకు కుంగిపోరు. అలాంటివారి మనస్సు స్థిరంగా, దృఢంగా ఉంటుంది. ఎందుకంటే... ఏది సత్యమో ఏది అసత్యమో వారికి తెలుసు. వారు ఎప్పుడూ ఆదమరపుగా లేకుండా ఎరుకతోనే ఉంటారు.

తాము విన్న మాటల్ని గుడ్డిగా నమ్మరు. కాబట్టి చెప్పుడు మాటలు వారి చెవులనే తాకవు. వారు ఏది విన్నా, దేన్ని చదివినా, దేన్ని చూసినా వెంటనే ప్రతిస్పందించరు. ఎరుకతో ఆలోచిస్తారు. ఎరుకతో గ్రహిస్తారు. ఎరుకతో స్పందిస్తారు. తొందరపాటుకీ, తొట్రుపాటుకీ ఆమడ దూరంలో ఉంటారు.

కొందరు భిక్షువులకి ఈ తొందరపాటు ఉండేది. అలాంటి భిక్షువులు కొందర్ని ఒకసారి బుద్ధుని దగ్గరకు తీసుకువచ్చారు. అప్పుడు బుద్ధుడు వారితో

'' భిక్షువులారా! ఒక గొప్ప చిత్రకారుడు ఉన్నాడు. అతను ఎరుపు, నీలం, పసుపు, ఆకుపచ్చ, తెలుపు, నలుపు రంగుల్ని తీసుకు వచ్చాడు. ఆ చిత్రకారుడు ఆ కుంచెల్ని రంగుల్లో ముంచి ఇదిగో చూడండి. ఇక్కడ ఈ ఆకాశంలో అందమైన చిత్రాలు గీస్తాను. వనాల్నీ, భవనాల్నీ, పర్వతాల్నీ, ప్రకృతి సోయగాల్నీ చిత్రీకరిస్తాను. చూడండి'' అంటూ కుంచెలు తీసుకున్నాడు. ఆకాశంలో ఏవేవో చిత్రించాడు. ''ఓ భిక్షువులారా! ఆ చిత్రాలు కనిపిస్తాయా?''

''లేదు భగవాన్''

''ఎందుకని?''

''ఆకాశం తెల్లని వస్త్రం కాదు, గోడ కాదు''

''అంటే... ఆకాశానికి రూపం లేదు. కాబట్టి రూపం లేని దాని మీద రూపాలను చిత్రించడం జరగదు. ఆ చిత్రాల్ని కనిపించేట్టు చేయడం కుదరదు. అసంభవం!


పైగా ఆకాశంపై చిత్రాలు గీయడానికి పూనుకున్న వ్యక్తికి అలసట, ఆయాసం మాత్రమే మిగులుతాయి. అది వృథాప్రయాస. మీ మనస్సు కూడా అలా ఆకాశంలా ఉండాలి. పొగడ్తలూ, తెగడ్తలూ ఆకాశం మీద చిత్రించే చిత్రాల్లా మీ మనస్సు మీద కనిపించకూడదు. అప్పుడే మీ హృదయం నిర్మలమవుతుంది.

అలా కాకుండా.. మీరు ప్రతిదానికీ ప్రతిస్పందిస్తే మీరు స్థిరచిత్తాన్ని కోల్పోతారు. మాటకు మాట అంటారు. చేతకు చేత చూపుతారు. మీ జీవితాల్ని జగడాలతో గడిపేస్తారు.

ఒక గట్టి గుండ్రని చట్రంపై ఒక తోలును గట్టిగా బిగించితే... ఏమవుతుంది? తాకితేనే ధ్వని పుడుతుంది. కొట్టితే గట్టి శబ్దం చేస్తుంది. మీటిన దాన్ని బట్టి మోత పుట్టిస్తుంది. కానీ, అదే చర్మాన్ని బిగుతుగా కట్టకపోతే... ఎలాంటి శబ్దాన్ని చేయదు. గరగరలు చేయదు. అలాంటి తోలు మీద ఎంతగా కొట్టినా అది వృథా ప్రయాస మాత్రమే అవుతుంది. మన మనస్సు కూడా బిర్రుగా బిగదీసుకుని ఉండకూడదు. ఎల్లప్పుడూ సమతా స్థితిలోనే ఉండాలి. అప్పుడే అది అందరికీ ఉపయోగపడేది అవుతుంది. అందర్నీ సమభావంతో చూస్తుంది. ద్వేషించే వారిని కూడా ప్రేమిస్తుంది. పొగడ్తలకు పొంగదు. తెగడ్తలకు కుంగదు'' అని చెప్పాడు.

ఆ భిక్షువులు శ్రద్ధగా విన్నారు. తమ ప్రవర్తన మార్చుకున్నారు. సమతా స్థితి అలవరచుకున్నారు.

–డా. బొర్రా గోవర్ధన్



మంచి మాట

ప్రతికూలమూ అనుకూలమే!



ఎదురుదెబ్బలు తగిలితే మనం బెదిరిపోకూడదు; పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే మనం చెదిరిపోకూడదు. ఏ పరిణామానికీ మనం బెదిరిపోకూడదు; ఏ పర్యవసానానికీ మనం చెదిరిపోకూడదు. బెదిరిపోయి భయపడుతూ ఉండడం జీవనం కాకూడదు; చెదిరిపోయి చతికిలపడిపోవడం జీవితం కాకూడదు. జీవన గతి ప్రగతిని, జీవితస్థితి అభ్యున్నతిని పొందాలి.

'ఇప్పుడు ఇది అంతం కాదు; ఇది అంతానికి ఆరంభం కూడా కాదు; కానీ ఇది ఆరంభానికి అంతం కావచ్చు' అని విన్స్టన్ చర్చిల్ చెప్పిన మాటల్ని ఆలోచనలోకి తీసుకుని ఎదురుదెబ్బలు తగిలినప్పుడూ, పరిస్థితులు ప్రతికూలించినప్పుడూ మనం ప్రతిస్పందించాలి. ఎదురుదెబ్బలు తగిలినప్పుడూ, ప్రతికూలమైన పరిస్థితులప్పుడూ మన గతి అంతమైపోయిందనో, మనం ఇక ఇంతే అనో కాకుండా కొత్త ఆరంభానికి ఇది అంతం అయి ఉండచ్చు అన్న ఆశాభరితమైన ఆలోచనతో మనం భవిష్యత్తును చేపట్టేందుకు ఉద్యుక్తులం అవ్వాలి. ఎదిగినవాళ్లందరూ ఎదురుదెబ్బలు తిన్నవాళ్లే. ప్రయోజకులు అయిన వాళ్లందరూ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నవాళ్లే. ఏ తరుణంలో అయినా మన తీరే మనకు మేలు చేస్తుంది, మనల్ని మేలైన వాళ్లను చేస్తుంది.

'వర్తమాన క్షణాలలో ఉన్న దాన్ని అంగీకరించు నువ్వే దాన్ని ఎంపిక చేసుకున్నట్టుగా' అని జర్మన్ తాత్త్వికుడు ఎక్హార్ట్ టోల్ సరైన సూచన చేశారు. తగిలిన ఎదురుదెబ్బల్ని , ప్రతికూల పరిస్థితుల్ని మనం అంగీకరించాలి. నిజానికి అవి మనం ఎంపిక చేసుకున్నవి కాకపోయినా జరిగాయి కాబట్టి వాటిని మనం అంగీకరించాలి. అంగీకరించకుండా మనల్ని మనం మభ్యపెట్టుకోవడంవల్ల, వాటి దెబ్బకు కుంగిపోవడం వల్ల మనం వాటిని అధిగమించలేం. వాటిని మనం అధిగమించి తీరాలి.

ఎదురుదెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించిన జీవితమే విజయవంతమైన జీవితం అవుతుంది. జీవితం అంటూ ఉన్నాక అది విజయవంతం అవ్వాలి.

అబ్రహం లింకన్ 1831లో వ్యాపారంలో విఫలం అయ్యాడు. 1832లో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. 1833లో వ్యాపారంలో మరోసారి విఫలమయ్యాడు. 1835 లో తీవ్రమైన నరాల జబ్బుతో బాధపడ్డాడు. 1838 లో స్పీకర్ పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. 1840లో ఎలక్టర్ పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. 1843, 48లలో కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి పోటీ చేసి ఓడిపోయాడు. 1855 లో సెనెట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. 1856లో ఉపాధ్యక్షుడి పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. 1858 లో సెనెట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. 1860లో అమెరికా అధ్యక్షుడయ్యాడు. అబ్రహం లింకన్ ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నాడు; ఎన్నో ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొన్నాడు. వాటిని అధిగమించినందుకు పొందిన విజయంగా ఆయన అమెరికా అధ్యక్షుడయ్యాడు. ఎదురుదెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించగలిగితే ఏం సాధించవచ్చో అబ్రహం లింకన్ జీవితం తెలియజేస్తోంది. ప్రపంచచరిత్రలో ఇటువంటి ఉదంతాలు చాల ఉన్నాయి. ఎదురుదెబ్బలు, ప్రతికూల పరిస్థితులు ఎవరికైనా తప్పవు. అవి ఉంటూనే ఉంటాయి. మనకు ఎదురు దెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించాలన్న సంకల్పం, ప్రయత్నం బలంగా ఉండాలి. ఆశ, ఆకాంక్ష, ఆసక్తి ఈ మూడూ మనిషి ప్రగతికి, అభ్యున్నతికి ఎంతో ముఖ్యం. వీటికి తోడుగా లేదా ఊతంగా నమ్మకం అనేది ఉండాలి. 'ఓ నమ్మకమా! మాకు నమ్మకాన్నివ్వు, భయం నుంచి విముక్తి నివ్వు, అంతులేని సంపదలకు మమల్ని అధిపతుల్ని చెయ్యి...' అంటూ సాగుతూ వేదంలో ఒక ప్రార్థన ఉంది. మనకు నమ్మకం కావాలి; మనం నమ్మకాన్ని నమ్ముకోవాలి. మన సంకల్పాన్ని, ప్రయత్నాన్ని నమ్ముకుని ఎదురుదెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించి మనం రాణించాలి, రాజిల్లాలి.

– రోచిష్మాన్

అమృత బిందువులు

- మేడిపండు పైకి అందంగా కనిపిస్తుంది. కానీ, లోపల అన్నీ పురుగులే ఉంటాయి. మనిషి జీవితం కూడా అంతే. ఒకరి జీవితం మరొకరికి అందంగానే కనబడుతుంది. కానీ, ఆ జీవితంలో దాగి ఉన్న కష్టాలు, కన్నీళ్ళు ఎవరికీ కనిపించవు.

***

- మనం మనిషిగా పుట్టడమే ఒక అద్భుతం. బతికి ఉండటం ఒక అదృష్టం. ముడిపడుతున్న బంధాలన్నీ వరాలు. ఎదురు పడుతున్న అడ్డంకులన్నీ మనకు విలువైన పాఠాలు. కష్టం గురించి చింతించకు. ఉన్నన్నాళ్లు ఆనందంగా గడిపేసేయి.

***

- జీవితంలో అన్నీ కోల్పోయినా ఒకటి మాత్రం మనకోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దాని పేరే భవిష్యత్తు.

***

- గొప్పగా బతకక పోయినా తృప్తిగా బతకాలి. డబ్బుంటే అన్నీ వస్తాయి కానీ, డబ్బే ప్రధానం కాదు. మనకంటూ నలుగురు ఉన్నారు అంటే, అది చాలు ఈ జీవితానికి.



మాటే మంత్రమా..!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తేనెటీగ అన్ని పువ్వులలోని మకరందాన్ని చుక్క చుక్క సేకరించి తీసుకొచ్చి తేనెపట్టు పెట్టి అందులో గదులు కట్టి ఎంతో జాగ్రత్తగా దాస్తుంది. చుట్టుపక్కల ఏమాత్రం అలికిడి అయినా దాడిచేసి దరిదాపులలోకి రాకుండా కుట్టి తరిమేస్తుంది. ఇంత కష్టపడి దాచినదీ అదేమయినా అనుభవిస్తుందా ...అనుభవించదు. మరిదేనికయినా వదిలిపెడుతుందా, వదిలిపెట్టదు. చివరకు ఏమవుతుంది. ఎవడో చూస్తాడు. ఆ చెట్టు కింద మంటపెడతాడు, పొగపెడతాడు. ఆ పొగ తాకిడికి, ఆ వేడికి తట్టుకోలేక గూడు వదిలి తేనెటీగలు అన్నీ పారిపోగానే చెట్టెక్కి తేనెపట్టు పీకేసి తెచ్చుకుంటాడు. దానిలోని తేనెనంతా సంగ్రహిస్తాడు. పిండగా మిగిలిన పిప్పిని ముక్కలు ముక్కలు చేసి పారేసిపోతాడు. తరువాత తేనెటీగలు వచ్చి చూసుకుంటే ఏముంటుందక్కడ? మరో చెట్టు వెతుక్కుని మళ్ళీ తేనెపట్టు పేర్చడం మొదలుపెడుతుంది. అంతే తప్ప అంతకుమించి దానిలో మార్పురాదు. మరి మనిషి బుద్ధి జీవిఅయి ఉండీ ఇలానే ప్రవర్తిస్తే ఎలా!!! ఇటువంటివారికి బుద్ధి చెప్పడానికి వేమన ఒక మంచి నీతి సూత్రాన్ని మనకందించాడు. ధనము కూడబెట్టి దానంబు చేయక/తాను దినక లెస్స దాచుకొనగ/ తేనెటీగ గూర్చి తెరువరికియ్యదా/విశ్వదాభిరామ వినుర వేమ....కొందరు ధనార్జనే ధ్యేయంగా ఒళ్ళు హూనం చేసుకుని, చివరకు కుటుంబంతో కూడా సంతోషంగా గడపనంత తీరికలేకుండా సంపాదిస్తూనే ఉంటారు. దాన్ని వాళ్ళు అనుభవించరు సరికదా, చూస్తూ చూస్తూ అవతలి వారు ఎంతటి బాధలో ఉన్నా తాము సహాయం చేయగల స్థితిలో ఉన్నా ఒక్క పైసా విదిల్చరు. తేనెటీగ దాచినట్లు దాచిపెడుతుంటారు. మనిషి జీవితంలో ధనం అనేది అత్యంత ప్రధానమైనది. ఎంత సంపాదించాడో అంతా దానం చేసేయమని ఎవ్వరూ చెప్పరు. తన కష్టార్జితం తాను అనుభవించాల్సిందే. అలాగే కొంత భవిష్యత్ అవసరాలకోసం దాచుకోవాల్సిందే. అది శాస్త్ర సమ్మతమే. దాచుకొమ్మనే చెప్పాయి. అయితే సమతౌల్యం పాటించాలి. తాను అనుభవించాల్సిన దానికన్నా ఎక్కువ అనుభవించిన వాడు తనకు తాను ద్రోహం చేసుకొన్నవాడవుతాడు. తాను అనుభవించాల్సినదానికన్నా ఎక్కువ ఖర్చుపెట్టేసిన వాడు భవిష్యత్ తరాలకు ద్రోహం చేసినవాడు. శంకర భగవత్పాదులు మోహముద్గరంలో ఇలా అంటారు...''మా కురు ధన జన యవ్వన గర్వం/ హరతి నిమేషాత్కాలః సర్వం/ మాయామయమిదమఖిలం హిత్వా/బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా.'' ... అంటే ధనం కానీ, నీ యవ్వనం కానీ, వీటిని గమనించి నీ పక్కన చేరిన జనం కానీ ..వీటిని చూసి మిడిసి పడవద్దు. కాల ప్రవాహంలో ఇవేవీ మిగలవు, నీ వెంటరావు. చెరువులో నీరింకిపోతే చేపలు కూడా అదృశ్యమయినట్లు నీ దగ్గర ధనం, యవ్వనం లేని నాడు నీ వెంట ఎవ్వరూ ఉండరు. కాలం అన్నింటినీ లాక్కుపోతుంది. అలా తీసేయకముందే శరీరంలో ఉన్న యవ్వన బలాన్ని పదిమందికి పనికి వచ్చేట్టు చేసినవాడు ధన్యుడు. నీ అవసరాలకు పోను మిగిలిన ధనాన్ని ఆపదలో ఉన్న వారిని ఉద్ధరించడానికి ఖర్చుపెట్టు. నీకున్న విద్యను పదుగురి అభ్యున్నతి కోసం పంచిపెట్టు. అని చెబుతున్నారు శంకరులు. వేమన చెప్పిందీ అదే.... ఇవి మన జీవితాలను ప్రయోజనకరంగా తీర్చిదిద్దుకోవడానికి ఉపయోగపడే మంత్రాలు. వీటిని ఎప్పుడూ మననం చేసుకుంటూ ఉంటే మనం బాగుపడడమే కాదు, నలుగురికీ ఆదర్శమవుతాం.

సినిమా

కథ విన్నారా ?



● చిరంజీవి

హీరో చిరంజీవి, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రస్తుతం మెహర్ రమేశ్ దర్శకత్వంలో 'భోళాశంకర్' సినిమా చేస్తున్నారు చిరంజీవి. ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. దీంతో తన తర్వాతి సినిమాపై ఫోకస్ పెట్టారు మెగాస్టార్. ఈ క్రమంలోనే ఆయన కొత్త కథలు వింటున్నారు. దర్శకులు పూరి జగన్నాథ్, ప్రభుదేవా వంటి వారు చిరంజీవికి కథలు చెప్పారని టాక్. తాజాగా రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి పేరు తెరపైకి వచ్చింది. బీవీఎస్ రవి కథకు తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తారట. ఈ సినిమాకు చిరంజీవి కుమార్తె సుష్మిత కొణిదెల ఓ నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. అయితే ఈ విషయాలపై పూర్తి అధికారిక సమాచారం అందాల్సి ఉంది. కాగా చిరంజీవి హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్నట్లు గతంలో ఓ ప్రకటన వచ్చింది. అయితే ఈ సినిమా గురించి మరో అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది.

భారీ తారాగణం హిట్ అవ్వాలి - ఎస్వీ కృష్ణారెడ్డి



● అలీ, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, సదన్, బీవీ రెడ్డి

''భారీ తారాగణం' మూవీ ట్రైలర్ బాగుంది. దర్శకుడు శేఖర్, నిర్మాత బీవీ రెడ్డి మంచి కంటెంట్ ఉన్న కథని ఎంచుకున్నారు. సదన్ స్క్రీన్‌పై హీరో ధనుష్‌లాగా కనిపిస్తున్నాడు. ఈ సినిమా హిట్ అవ్వాలి'' అని డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. సదన్ హీరోగా, దీపికా రెడ్డి, రేఖ నిరోష హీరోయిన్లుగా శేఖర్ ముత్యాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారీ తారాగణం'. బీవీ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, నటుడు అలీ విడుదల చేశారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ– ''నటీనటులు, సాంకేతిక నిపుణుల సపోర్ట్ వల్లే సినిమా బాగా వచ్చింది. త్వరలో విడుదల చేస్తాం'' అన్నారు. ''ప్రేమ, వినోదం, థ్రిల్లింగ్ అంశాలతో మా సినిమా రూపొందింది'' అన్నారు శేఖర్ ముత్యాల. ''ఇలాంటి మంచి చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు సదన్, దీపికా రెడ్డి, రేఖ నిరోష. ఈ చిత్రానికి కెమెరా: ఎమ్‌వీ. గోపి, సంగీతం: సుక్కు.

చమక్ చమక్ పోరి..



● అతుల్య, కిరణ్

కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా రమేష్ కాదూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదలకానుంది. ఇందులో భాగంగా చిత్ర మ్యూజిక్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేసింది యూనిట్. సాయి కార్తీక్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చమక్ చమక్ పోరి..' అంటూ సాగే మాస్ లిరికల్‌ని తొలి పాటగా ఈ నెల 15న విడుదల చేస్తున్నారు. ''పక్కా మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. 'చమక్ చమక్ పోరి..' పాటలో కిరణ్, అతుల్య రవి మాస్ డాన్స్‌ను చూస్తారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్.సి.దిలీప్, సురేష్ సారంగం, లైన్ ప్రొడ్యూసర్: అలేఖ్య పెదమల్లు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బాబా సాయి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బాల సుబ్రమణ్యం కేవీవీ.



● తమన్నా

ఆ అవసరం లేదు - తమన్నా

బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ, హీరోయిన్ తమన్నా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారనే వార్తలు కొన్నాళ్లుగా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు తమన్నా. ''మేమిద్దరం(విజయ్‌ను ఉద్దేశిస్తూ..) కలిసి ఓ సినిమా చేశాం. అప్పట్నుంచి మా రిలేషన్‌షిప్ గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. వీటన్నింటిపై స్పందించాల్సిన అవసరం నాకు లేదు. ఈ అంశంపై నేను ఇంతకుమించి చెప్పాల్సిన విషయాలు కూడా ఏమీ లేవు. అయినా హీరోయిన్స్ గురించి ఇలాంటి అవాస్తవాలు ఎలా తెరపైకి వస్తున్నాయో నాకు అర్థం కావడం లేదు. డాక్టర్ నుంచి బిజినెస్ మేన్ వరకు నాకు తెలియకుండానే కొందరు ఇప్పటికే నా పెళ్లి చాలాసార్లు చేశారు (వ్యంగ్యంగా..)'' అని చెప్పుకొచ్చారు తమన్నా. ఇక రజనీకాంత్ 'జైలర్', చిరంజీవి 'భోళాశంకర్' చిత్రాల్లో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే.

ప్రేక్షకుల మనసుల్లో కూర్చుంటాం - నాగశౌర్య

''ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' సినిమా రికార్డులు బద్దలు కొట్టేస్తుందని చెప్పను.. కానీ, ఈ సినిమాతో ప్రేక్షకుల మనస్సులో మేము కుర్చీలు వేసుకొని కూర్చుంటాం. ఈ మూవీ తర్వాత 10, 15 ఫ్లాప్‌లు తీసినా ప్రేక్షకులు మమ్మల్ని క్షమిస్తారు.. అంత మంచి సినిమా ఇది'' అని హీరో నాగశౌర్య అన్నారు. శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో అడివి శేష్, నిర్మాతలు అశ్వినీదత్, సునీల్ నారంగ్, రవిశంకర్, దామోదర ప్రసాద్, కోన వెంకట్, ప్రసన్న కుమార్, దర్శకులు బాబీ కొల్లి, మారుతి, నందినీ రెడ్డి అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ–''రచయితగా, దర్శకుడిగా నాకు మంచి పేరు వచ్చిందంటే దానికి ప్రధాన కారణం నాగశౌర్య. తను అద్భుతమైన నటుడు. ఈ మూవీలో నాకు ఇష్టమైన 1960లోని ఓ పాటను రీమిక్స్ చేశాను.. ఆ పాట పాడిన మోహనకృష్ణ ఇంద్రగంటిగారికి థ్యాంక్స్'' అన్నారు. ''ఇంతమంచి సినిమాలో భాగమయ్యే చాన్స్ ఇచ్చిన విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్లగార్లకు థ్యాంక్స్'' అన్నారు దాసరి పద్మ.



● అవసరాల, నాగశౌర్య, మాళవిక, పద్మజ, కృతీప్రసాద్, వివేక్

వైవిధ్యమైన అరి

అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్, 'శుభలేఖ' సుధాకర్, 'చమ్మక్' చంద్ర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' ఫేమ్ జయ శంకర్ దర్శకత్వం వహించారు. ఆర్వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, శేషు మారంరెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత అభిషేక్ అగర్వాల్ విడుదల చేసి, మాట్లాడుతూ–''ఇలాంటి కథలు చేయాలంటే ధైర్యం కావాలి. నిర్మాతలకు ఇది తొలి మూవీ అయినా బాగా తీశారు. ఈ మూవీ హిట్ కావాలి''



● జయశంకర్, అభిషేక్ అగర్వాల్, శేషు మారంరెడ్డి

అన్నారు. ''వైవిధ్యమైన కథతో వస్తున్న చిత్రం'అరి'. కథతో పాటు కథనం, సంగీతం హైలెట్ అవుతాయి'' అన్నారు శేషు మారంరెడ్డి. ''మా నిర్మాతలు శేషు, ఆర్వీ రెడ్డిగార్ల సపోర్ట్ మర్చిపోలేనిది. 'అరి' సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అన్నారు జయ శంకర్. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: శివశంకర వరప్రసాద్.

పవర్‌ఫుల్ గెస్ట్



● సంజయ్ దత్

'జవాన్'కు గెస్ట్ కానున్నారట సంజయ్ దత్. షారుక్ ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జవాన్'. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయ్ సేతుపతి, ప్రియమణి కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ దీపికా పదుకొనె ఓ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నట్లుగా వార్తలు వచ్చాయి. తాజాగా మరో పవర్‌ఫుల్ గెస్ట్ పాత్రలో నటుడు సంజయ్ దత్ నటించనున్నారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. కథ పరంగా ఈ క్యారెక్టర్‌కి మంచి ప్రాధాన్యత ఉండటంతో సంజయ్ దత్ ఓకే చెప్పారట. ఏప్రిల్‌లో ముంబైలో జరిగే షెడ్యూల్‌లో షారుక్, సంజయ్ కాంబినేషన్ సీన్స్‌ను చిత్రీకరిస్తారట మేకర్స్. 'జవాన్' ని జూన్ 2న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది చిత్రయూనిట్. కానీ, ఈ విడుదల తేదీలో మార్పు ఉంటుందని బీటౌన్ టాక్. కాగా ప్రస్తుతం కశ్మీర్‌లో జరుగుతున్న విజయ్ 'లియో' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు సంజయ్ దత్.

కొత్త కబురు



● రోషన్

'నిర్మలా కాన్వెంట్' (2016), 'పెళ్లిసందడి' (2021) చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరో రోషన్. ప్రస్తుతం తన తర్వాతి ప్రాజెక్ట్స్ కోసం కథలు వింటున్నారు. అయితే రోషన్ నెక్ట్స్ మూవీ వైజయంతీ మూవీస్, వేదాన్షన్ పిక్చర్స్ పతాకాలపై రూపొందనుంది. త్వరలోనే ఈ మూవీ ప్రారంభం కానుంది. కాగా ఈ సినిమా దర్శకుడు, నటీనటులు, సాంకేతిక నిపుణుల పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

రిచో రిచ్!

గీత్ ఆనంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. నవాబ్ గ్యాంగ్, అశ్విన్–అరుణ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రిచో రిచ్..' అనే పాటని విడుదల చేశారు. అసుర సాహిత్యం అందించిన ఈ పాటను రిక్కీ, అసుర పాడారు. రవి కస్తూరి మాట్లాడుతూ– ''ఇంటెన్స్ క్యారెక్టర్స్ మధ్య జరిగే ఎమోషనల్ జర్నీ ఇది. హీరో ఒక లూజర్‌గా మిగిలిపోతున్న టైమ్‌లో తన లైఫ్‌లో ఒక గేమ్ స్టార్ట్ అవుతుంది. ఆ గేమ్ తనని ఏ స్థాయికి తీసుకెళుతుంది? అనేదే 'గేమ్ ఆన్' కథ'' అన్నారు. ''రొటీన్ సినిమాలకు భిన్నంగా ఉండే కథ ఇది. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి'' అన్నారు దయానంద్. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్, ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అభిషేక్ ఏ.ఆర్.



● గీత్ ఆనంద్, నేహా సోలంకి




ఇంగ్లండ్‌కు షాక్: బంగ్లాదేశ్‌దే సిరీస్

టి20 ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌తో ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ నాలుగు వికెట్లతో గెలిచి సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. ఈ రెండు జట్ల మధ్య ఇదే తొలి ద్వైపాక్షిక టి20 సిరీస్ కావడం విశేషం. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ (4/12) ఇంగ్లండ్‌ను దెబ్బ కొట్టాడు. అనంతరం బంగ్లాదేశ్ 18.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి గెలిచింది.

రన్నరప్ అంకితా రైనా

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో భారత నంబర్‌వన్ అంకితా రైనా రన్నరప్‌గా నిలిచింది. బెంగళూరులో ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో 241వ ర్యాంకర్, 30 ఏళ్ల అంకిత 2 గంటల 19 నిమిషాల్లో 6–0, 4–6, 0–6తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన 15 ఏళ్ల బ్రెండా ఫ్రువిర్తోవా చేతిలో పరాజయం పాలైంది. అంకిత తొలి సెట్‌ను గెలిచి, రెండో సెట్‌లో 3–0తో ఆధిక్యంలోకి ఉన్నా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది.





హర్మన్‌ప్రీత్ 'హ్యాట్రిక్' ఆసీస్‌పై భారత్ విజయం

రూర్కెలా: కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 'హ్యాట్రిక్' నమోదు చేయడంతో... ప్రొ హాకీ లీగ్‌లో భారత జట్టు 5–4 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా జట్టును బోల్తా కొట్టించింది. టీమిండియా సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ 13, 14, 55వ నిమిషాల్లో పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచగా... జుగ్‌రాజ్ సింగ్ (17వ ని.లో), సెల్వం కార్తీ (25వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున జోషువా బెల్ట్‌జ్ (3వ ని.లో), విలోట్ (43వ ని.లో), బెన్ స్టెయినెస్ (53వ ని.లో), టిమ్ హోవర్డ్ (57వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రెండు జట్లకు పది చొప్పున పెనాల్టీ కార్నర్‌లు రాగా... భారత్ మూడింటిని, ఆసీస్ రెండింటిని గోల్స్‌గా మలిచాయి. నేడు జరిగే మరో లీగ్ మ్యాచ్‌లో జర్మనీతో భారత్ ఆడుతుంది.

కివీస్ లక్ష్యం 285

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో తొలి టెస్టులో న్యూజిలాండ్ జట్టు విజయానికి 257 పరుగుల దూరంలో ఉంది. 285 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 28 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 83/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 105.3 ఓవర్లలో 302 పరుగులకు ఆలౌటైంది. ఏంజెలో మాథ్యూస్ (235 బంతుల్లో 115; 11 ఫోర్లు) వీరోచిత ఆటతో 14వ సెంచరీ సాధించాడు. కెరీర్‌లో 101వ టెస్టు ఆడుతున్న మాథ్యూస్ ఐదో వికెట్‌కు చండీమల్ (42; 2 ఫోర్లు)తో కలిసి 105 పరుగులు జోడించాడు. కివీస్ బౌలర్లలో టిక్నెర్ నాలుగు, హెన్రీ మూడు వికెట్లు తీశారు. ఈ టెస్టులో న్యూజిలాండ్ గెలిచినా, 'డ్రా'గా ముగిసినా... ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టు ఫలితంతో సంబంధం లేకుండా భారత జట్టు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

కోహ్లి కొట్టిన సెంచరీతో...

అహ్మదాబాద్ టెస్టుపై పట్టు మనదే • భారత్ 571 ఆలౌట్
విరాట్ కోహ్లి భారీ శతకం • మెరిసిన అక్షర్ పటేల్
టీమిండియాకు 91 పరుగుల ఆధిక్యం • నేడు ఆసీస్ బ్యాటర్లకు పరీక్ష


కోహ్లి

నాలుగో టెస్టులో నాలుగో రోజు నాలుగో శతకం నమోదైంది. ఒక టెస్టులో నాలుగు సెంచరీలు కొత్తేం కాదు... కానీ ఈ 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో మాత్రం ఇది గొప్ప విశేషం. ఎందుకంటే ఇంతకుముందు జరిగిన మూడు టెస్టులు కూడా మూడో రోజుల్లోనే ముగిశాయి. స్పిన్నర్లు తిప్పేసిన ఆ మ్యాచ్‌ల్లో బ్యాటర్లు విలవిలలాడారు. గత మ్యాచుల్ని శాసించిన బౌలర్లపై ఇరు జట్ల బ్యాటర్లు సెంచరీలతో విరుచుకుపడ్డారు. ఫలితంగా నాలుగో టెస్ట్‌లో చివరి రోజు ఆట ఆసక్తికరం కానుంది.

అహ్మదాబాద్: విరాట్ కోహ్లి (364 బంతుల్లో 186; 15 ఫోర్లు) భారీ శతకంతో చివరి టెస్టులో భారత్ పట్టు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 178.5 ఓవర్లలో 571 పరుగుల వద్ద ఆలౌటైంది. నాలుగో రోజు ఆటలో అక్షర్ పటేల్ (113 బంతుల్లో 79; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) కోహ్లితో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన 91 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఆఖరి రోజు సోమవారం ఉదయం ఆతిథ్య బౌలర్లు కూడా సమష్టిగా ఓ చేయి వేసి... ఆసీస్‌ను 200 పరుగుల్లోపు కట్టడి చేస్తే ఛేదించే లక్ష్యం మన ముందుంటుంది. తద్వారా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ వేటకు శుభం కార్డు పడుతుంది.

1205 రోజుల తర్వాత...

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి... సుదీర్ఘ టెస్టు సెంచరీ నిరీక్షణకు తెరదించాడు. ఆఖరి టెస్టులో మూడంకెల స్కోరు ముచ్చట తీర్చుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 289/3 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆదివారం ఆట ప్రారంభించిన భారత్‌కు జడేజా (84 బంతుల్లో 44; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) రూపంలో గట్టిదెబ్బే తగిలింది. బ్యాటింగ్‌కు కలిసొచ్చే పిచ్‌పై కోహ్లికి జతయిన ఆంధ్ర క్రికెటర్ శ్రీకర్ భరత్ (44; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) జతయ్యాడు. 'రన్ మెషిన్' అండతో భరత్ భారీ సిక్సర్లతో అలరించాడు. 363/4 వద్ద లంచ్‌కు వెళ్లొచ్చాక ఎంతో ఓపిగ్గా ఆడిన కోహ్లి 241 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 2019లో నవంబర్ 23న క్రికెట్ మక్కా ఈడెన్ గార్డెన్స్‌లో బంగ్లాదేశ్‌పై కోహ్లి 27వ టెస్టు శతకం సాధించాడు. మళ్లీ 43 టెస్టుల తర్వాత



భారత గడ్డపైనే 28వ సెంచరీ చేసి 1205 రోజుల నిరీక్షణకు ముగింపు పలికాడు. ఐదో వికెట్‌కు 84 పరుగులు జోడించాక లయన్ బౌలింగ్‌లో భరత్... హ్యాండ్స్‌కాంబ్ చేతికి చిక్కాడు. అనంతరం అక్షర్ పటేల్ కూడా పట్టుదలతో ఆడటంతో ఆస్ట్రేలియాకు కంగారు తప్పలేదు.


అక్షర్

ఇద్దరి జోడీ కుదరడంతో భారత్ భారీస్కోరుకు బాటపడింది. మూడో సెషన్‌లో టీమిండియా 500 మార్క్‌ను అందుకోగా, కోహ్లి 150 పరుగులు పూర్తయ్యాయి. కాసేపటికే అక్షర్ 95 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. అక్షర్‌ను స్టార్క్ బౌల్డ్ చేయడంతో ఆరో వికెట్‌కు 162 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత కాసేపటికే భారత్ ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆసీస్ ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోకుండా 3 పరుగులు చేసింది. కునెమన్ (0 బ్యాటింగ్), హెడ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

56 భారత గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన విదేశీ జట్టు బౌలర్‌గా నాథన్ లయన్ గుర్తింపు పొందాడు. భారత్‌లో 11 టెస్టులు ఆడిన లయన్ 56 వికెట్లు పడగొట్టాడు. డెరిక్ అండర్‌వుడ్ (ఇంగ్లండ్; 16 టెస్టుల్లో 54 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును లయన్ బద్దలు కొట్టాడు.

10 తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కొట్టిన సిక్స్‌లు. ఆస్ట్రేలియాపై ఓ టెస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్ కొట్టిన అత్యధిక సిక్స్‌లు ఇవే. 1986లో ముంబైలో, 2013లో చెన్నైలో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్‌ల్లో భారత్ ఎనిమిది చొప్పున సిక్స్‌లు కొట్టింది.

3 ఓ టెస్ట్ మ్యాచ్‌లో తొలి ఆరు వికెట్లకు 50 అంతకంటే ఎక్కువ పరుగుల భాగస్వామ్యాలు నమోదు చేసిన మూడో జట్టుగా భారత్ నిలిచింది. గతంలో ఆస్ట్రేలియా (1960లో వెస్టిండీస్‌పై), పాకిస్తాన్ (2015లో బంగ్లాదేశ్‌పై) ఈ ఘనత సాధించాయి.

అయ్యర్ అవుట్!

భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నాలుగో రోజు బ్యాటింగ్‌కు దిగలేదు. వెన్నునొప్పితో బాధపడిన అతనికి స్కానింగ్ కూడా తీశారు. ముందు జాగ్రత్తగా జట్టు మేనేజ్‌మెంట్ అతన్ని ఆడించలేదు. మూడో రోజు ఆటలోనే అతనికి నొప్పి మొదలైనట్లు తెలిసింది. గాయం తీవ్రత దృష్ట్యా అతను ఈ నెల 17 నుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌కు కూడా దూరమయ్యే అవకాశాలున్నాయి.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలిఇన్నింగ్స్: 480; **భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ (సి) లబుషేన్ (బి) కునెమన్ 35; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 128; పుజారా (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 42; కోహ్లి (సి) లబుషేన్ (బి) మర్ఫీ 186; జడేజా (సి) ఖాజా (బి) మర్ఫీ 28; భరత్ (సి) హ్యాండ్స్‌కాంబ్ (బి) లయన్ 44; అక్షర్ (బి) స్టార్క్ 79; అశ్విన్ (సి) కునెమన్ (బి) లయన్ 7; ఉమేశ్ (రనౌట్) 0; షమీ (నాటౌట్) 0; అయ్యర్ (అబ్సెంట్ హర్ట్); ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (178.5 ఓవర్లలో ఆలౌట్) 571.** వికెట్ల పతనం: 1–74, 2–187, 3–245, 4–309, 5–393, 6–555, 7–568, 8–569, 9–571. **బౌలింగ్:** స్టార్క్ 22–3–97–1, గ్రీన్ 18–1–90–0, నాథన్ లయన్ 65–9–151–3, కునెమన్ 25–3–94–1, మర్ఫీ 45.5–10–113–3, హెడ్ 3–0–8–0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: కునెమన్ (బ్యాటింగ్) 0; హెడ్ (బ్యాటింగ్) 3; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 3.** **బౌలింగ్:** అశ్విన్ 3–2–1–0, రవీంద్ర జడేజా 2–1–1–0, షమీ 1–0–1–0.

ఎదురులేని ముంబై



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఎనిమిది వికెట్లతో యూపీ వారియర్స్‌ను ఓడించింది. ముంబైకిది వరుసగా నాలుగో విజయం కాగా... టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు సాధించింది. ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ (46 బంతుల్లో 58; 7 ఫోర్లు, 1 సిక్స్), తాలియా మెక్‌గ్రాత్ (37 బంతుల్లో 50; 9 ఫోర్లు) రాణించారు. అనంతరం ముంబై 17.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసి గెలిచింది. యస్తిక భాటియా (27 బంతుల్లో 42; 8 ఫోర్లు, 1 సిక్స్), నట్ సీవర్ (31 బంతుల్లో 45 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (33 బంతుల్లో 53 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) యూపీ బౌలర్లను ధనాధన్ ఆటతో హడలెత్తించారు. నేడు జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది.

ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సీ



బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నీలో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్ రెండో అంచె మ్యాచ్‌లో ముంబై సిటీ ఎఫ్‌సీ 2–1తో బెంగళూరును ఓడించింది. తొలి అంచె మ్యాచ్‌లో బెంగళూరు 1–0తో ముంబైపై గెలిచింది. రెండు మ్యాచ్‌ల తర్వాత రెండు జట్లు ఒక్కో విజయం సాధించడం.. గోల్స్ పరంగానూ 2–2తో సమంగా ఉండటంతో... విజేతను నిర్ణయించడానికి 'షూటౌట్'ను నిర్వహించారు. 'షూటౌట్'లో బెంగళూరు 9–8తో ముంబై సిటీపై గెలిచి ఫైనల్ చేరుకుంది. కోల్‌కతాలో నేడు హైదరాబాద్ ఎఫ్‌సీ, ఏటీకే మోహన్ బగాన్ జట్ల మధ్య రెండో అంచె సెమీఫైనల్ జరుగుతుంది. తొలి మ్యాచ్ 'డ్రా' కావడంతో... ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్లోకి ప్రవేశిస్తుంది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నీట్ యూజీ ప్రవేశ పరీక్ష

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్–యూజీ 2023(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్–అండర్ గ్రాడ్యుయేట్) పరీక్షకు నోటిఫికేషన్ విడుదలచేసింది.ఎంబీబీఎస్,బీడీఎస్, బీఎస్ఎంఎస్,బీయూఎంఎస్,బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా ఈ పరీక్షను నిర్వహిస్తారు.

» **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీతో సైన్స్‌లో ఇంటర్మీడియట్ /ప్రీ–డిగ్రీ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 17 ఏళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.03.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.04.2023
» **నీట్ 2023 పరీక్ష తేది:** 07.05.2023
» **పరీక్ష సమయం:** మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20 గంటల మధ్య జరగనుంది.
» **వెబ్‌సైట్:** www.neet.nta.nic.in

ఏపీ హైకోర్టులో 30 సివిల్ జడ్జి పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలోని హైకోర్టు.. ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పోస్టుల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **అర్హత:** న్యాయశాస్త్రంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 01.03.2023 నాటికి 35 ఏళ్లు మించకూడదు.» **వేతనం:** నెలకు రూ.77,840 నుంచి రూ.1,36,520 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), రాతపరీక్ష, మౌఖిక పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.03.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.04.2023.
» **స్క్రీనింగ్ టెస్ట్ హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్:** 15.04.2023. » **స్క్రీనింగ్ పరీక్ష తేది(కంప్యూటర్ ఆధారిత పరీక్ష):** 24.04.2023.
» **ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ:** 27.04.2023. » **వెబ్‌సైట్:** hc.ap.nic.in

ఏపీ బీసీ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలు

విజయవాడలోని మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే 103 బీసీ బాలబాలికల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం, సేట్ సిలబస్)లో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ ప్రకటన వెలువడింది. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **పరీక్ష వివరాలు:** మహాత్మా జ్యోతిబా పులే ఏపీ బీసీడబ్ల్యూ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023.
» **విద్యార్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాల్లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి 2022–23 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలి. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధిత జిల్లా లోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి.
» **వయసు:** ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్ల మధ్య; ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఆదాయ పరిమితి:** విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
» **ప్రవేశ పరీక్ష:** ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఓఎంఆర్ షీట్ విధానంలో 50 మార్కులకు ఉంటుంది.ప్రశ్నపత్రం తెలుగు/ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. తెలుగు(10 మార్కులు), ఇంగ్లిష్(10 మార్కులు),గణితం(15 మార్కులు), పరిసరాల విజ్ఞానం(15 మార్కులు)సబ్జెక్టులో నాలుగో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
» **ఎంపిక విధానం:** అర్హులైన అభ్యర్థులకు ప్రవేశపరీక్షలో ప్రతిభ,రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ(అనాథ /మత్స్యకార)ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 16.04.2023.
» **వెబ్‌సైట్:** www.mjpapbcwreis.apcfss.in

ఏపీఈసెట్–2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్సీహెచ్‌ఈ).. ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్)–2023 నోటిఫికేషన్ విడుదలచేసింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) అభ్యర్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.ఈ పరీక్షను కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ (జేఎన్‌టీయూకే) నిర్వహిస్తోంది.
» **కోర్సులు:** బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ. » **అర్హత:**పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.03.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.
» **పరీక్ష తేది:** 05.05.2023.
» **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

» త్వరలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు
» ఆ వెంటనే పలు ఎంట్రన్స్ టెస్ట్‌లు
» పరీక్షల ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
» కొద్దిపాటి చిట్కాలతో ఒత్తిడిని జయించే అవకాశం

ఒత్తిడి జయిస్తే.. విజయమే!!


పరీక్షల కాలం

అకడమిక్ పరీక్షలు.. ప్రవేశ పరీక్షలు. ఎగ్జామ్ ఏదైనా..టాప్ మార్కులు సాధించాలని విద్యార్థులు తీవ్రంగా శ్రమిస్తుంటారు! ముఖ్యంగా పరీక్షల సీజన్ మొదలైందంటే.. రేయింబవళ్లు, నిద్రాహారాలు మాని పుస్తకాలే ప్రపంచంగా గడిపేస్తుంటారు. దీంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్న పరిస్థితి! చదివిన అంశాలను గుర్తుంచుకోవడం ఎలా.. పరీక్ష హాల్లో గుర్తుకొస్తాయా.. పరీక్షసరిగా రాయగలనా.. ఇలాంటి ప్రతికూల ఆలోచనలతో మరింత ఆందోళన!! కొద్దిపాటి చిట్కాలతో ఒత్తిడిని జయించి.. పరీక్షల్లో విజయం సాధించొచ్చు అంటున్నారు నిపుణులు. తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు, ఆ తర్వాత ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. విద్యార్థులు ఒత్తిడిని జయించి.. పరీక్షల్లో విజేతగా నిలిచేందుకు నిపుణుల సలహాలు..

• అకడమిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు, గ్రేడ్స్ సాధించాలి. అప్పుడే భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు దక్కుతాయి!
• ఎంట్రన్స్ టెస్ట్‌లలో బెస్ట్ ర్యాంకు సొంతం చేసుకోవాలి. అప్పుడే ఆశించిన కోర్సుల్లో, కోరుకున్న ఇన్‌స్టిట్యూట్‌లో అడ్మిషన్ లభిస్తుంది.
• నేటి విద్యార్థి లోకంలో ఇలాంటి ఆలోచనలే ఎక్కువ!! ఫలితంగా నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా సబ్జెక్ట్‌లో పొందిన నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పరీక్ష సమయంలో ప్రదర్శించలేక నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. దీనికి కారణం.. ఎగ్జామ్ ఫోబియా అనేది నిపుణుల అభిప్రాయం . ఈ భయాన్ని అధిగమిస్తే.. ఎలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా పరీక్షలు రాసి విజయం సాధించొచ్చు అంటున్నారు.

ఆత్మవిశ్వాసమే అలంబనగా

పరీక్షలంటే భయపడుతూ ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు.. దాన్ని అధిగమించేందుకు తొలి సాధనం.. ఆత్మవిశ్వాసం! దీనికోసం స్వీయ సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవాలని సూచిస్తున్నారు. పరీక్షల్లో పోటీ గురించి తీవ్రంగా ఆలోచించడం, సహచరులతో పోల్చుకోవడం వంటివి ఒత్తిడి పెంచుతాయి. అందుకే ముందుగా విద్యార్థులు పరీక్షల గురించి అతిగా ఆలోచించడం మానేయాలి అంటున్నారు నిపుణులు. మానసిక వైద్యుల అభిప్రాయం ప్రకారం–పోటీ,పోల్చుకోవడం..ఇవి రెండు విద్యార్థుల ఒత్తిడికి ప్రధాన కారణాలు! కాబట్టి విద్యార్థులు సహచరులతో పోల్చుకోవడం కంటే తమ సామర్థ్యాలపై నమ్మకం పెంచుకుంటే సగం ఒత్తిడిని జయించినట్లే!!

ఫలితం గురించి ఆలోచనలు

ఆయా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల స్ట్రెస్‌కు మరో ప్రధాన కారణం.. ఫలితం గురించి ఆందోళన చెందడం! ఇది ఎంత మాత్రం సరికాదని మానసిక నిపుణులు అంటున్నారు. ప్రిపరేషన్ సమయంలో ఫలితం గురించి ఆందోళన చెందకుండా.. సబ్జెక్ట్‌ను అవగాహన చేసుకోవడంపైనే దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు. చదవాల్సిన సిలబస్ అంశాలను క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేస్తూ ముందుకు సాగాలి. అలా కాకుండా ఫలితం ఎలా ఉంటుందో.. టాప్ మార్కులు వస్తాయో లేదో అంటూ ఆందోళన చెందితే.. చదివింది కూడా మరిచిపోయే ప్రమాదం ఉంది. అది చివరకు ఫలితంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి ప్రిపరేషన్ సమయంలో విద్యార్థులు పరీక్ష ఫలితాలు,భవిష్యత్తు పరిణామాల గురించి ఆలోచించడం సరికాదన్నది నిపుణుల సలహా!

ప్రాధాన్యత క్రమం

పరీక్షల ఒత్తిడిని జయించేందుకు ఉపయోగపడే మరో మార్గం.. ప్రాధాన్యత క్రమంలో సిలబస్‌ను పూర్తి చేయడం. విద్యార్థులు తొలుత తాము చదవాల్సిన అంశాలను ప్రాధాన్యత క్రమంలో అంటే పరీక్ష కోణంలో అతి ముఖ్యమైనవి, ముఖ్యమైనవి, ఓ మాదిరిగా చదవాల్సినవి.. ఇలా ఒక జాబితా రూపొందించుకోవాలి. వీటితో డైలీ లేదా వీక్లీ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. వీలైతే వాటిని డైరీలోనో లేదా తమకు నిత్యం కనిపించే విధంగా వాల్ క్యాలెండర్‌లోనో నోట్ చేసుకోవాలి. చాలామంది విద్యార్థులు ప్రాధాన్యత క్రమం పాటించక.. అన్ని అంశాలు చదవాలనే ఆదుర్దాలో ఆందోళనకు గురవుతుంటారు. ఉదాహరణకు ఒక రోజు చదవాల్సిన నాలుగు లేదా అయిదు అంశాల్లో.. మొదట ముఖ్యమైన రెండు టాపిక్స్‌పై దృష్టిపెట్టి సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత మిగతా టాపిక్స్ వేగంగా పూర్తిచేసే ప్రయత్నం చేయాలి.

తొలుత తేలికైనవి

విద్యార్థులు తాము చదవాల్సిన టాపిక్స్‌ను ఈజీ (తేలికైనవి)..మోడరేట్(మధ్యస్థం).. డిఫికల్ట్(క్లిష్టమైనవి).. అనే మూడు విభాగాలుగా వర్గీకరించుకోవాలి. తొలుత తేలికైన అంశాలతో ప్రిపరేషన్ ప్రారంభించాలి. ఫలితంగా మిగతా రెండు విభాగాలను (మోడరేట్, డిఫికల్ట్) ఎదుర్కొనే ముందస్తు సంసిద్ధత లభిస్తుంది. ఇలా కాకుండా.. పరీక్ష కోణంలో ముఖ్యమైనవి అనే భావనతో ఇష్టం లేకున్నా.. కష్టమైన అంశాలతో ప్రిపరేషన్ ప్రారంభిస్తే ఒత్తిడి మరింత పెరుగుతుంది.

ప్రశాంత వాతావరణం

ఆయా పరీక్షలకు ప్రిపరేషన్ సాగించే క్రమంలో.. పరిసరాల ప్రభావం కూడా ఎంతో ఉంటుంది. కాబట్టి విద్యార్థులు తాము చదివే గది వాతావరణం , పరిసరాలు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. గదిలో టీవీ, కంప్యూటర్ వంటివి లేకుండా చూసుకోవాలి. అదే విధంగా.. బయటి నుంచి ఎలాంటి శబ్దాలు వినిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతోపాటు సహజమైన గాలి, వెలుతురు వచ్చే ప్రాంతంలో కూర్చుంటే.. మానసికంగా, శారీరకంగా ఆహ్లాదకరంగా ఉండడమే కాకుండా.. ప్రశాంతంగా ప్రిపరేషన్ సాగించే వీలుంటుంది.

రిలాక్సేషన్ టెక్నిక్స్

పరీక్షలంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే విద్యార్థులు..రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించడం మేలు చేస్తుంది. వాస్తవానికి క్లిష్టమైన అంశాలు చదువుతున్నప్పుడు.. లేదా అప్పటికే చదివిన విషయాలు గుర్తుకురానప్పుడు ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు విద్యార్థులు ఉపశమన చిట్కాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. టెన్షన్‌కు గురవుతున్న భావన కలిగిన వెంటనే పుస్తకాలను కొద్దిసేపు పక్కనపెట్టేయాలి. తమకు ఇష్టమైన సంగీతం, పాటలు వినడం, లేదా యోగా, మెడిటేషన్, గార్డెనింగ్ వంటివి చేయాలి. కొంతమంది టీవీ చూస్తుంటారు. అలాంటి విద్యార్థులు టీవీల్లో ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డిస్కషన్స్, డిబేట్స్ వైపు దృష్టి పెట్టకూడదు. ఇవి కొంత ఉద్రేకపూరిత వాతావరణంలో సాగుతాయి. ఇలాంటివి చూడటం వల్ల మరింత టెన్షన్ తప్పితే, దానివల్ల ఫలితం ఉండదు.

సానుకూల దృక్పథం

పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు పూర్తిగా సానుకూల దృక్పథంతో అడుగులు వేయాలి. ముఖ్యంగా తమ చుట్టూ ప్రతికూల వాతావరణం లేకుండా చూసుకోవాలి. ప్రతికూల ధోరణితో ఉండే వ్యక్తులకు దూరంగా ఉండడం ఎంతో ముఖ్యం. దీంతోపాటు తాము గతంలో సాధించిన ఫలితాల నుంచి స్ఫూర్తి పొందాలి. ఒత్తిడికి గురైన సందర్భంలో.. తాము గతంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాలి. ఫలితంగా తాము హాజరు కాబోతున్న పరీక్షలో మెరుగ్గా రాణించగలమనే మానసిక ధీమా లభిస్తుంది. తమ సబ్జెక్ట్ నైపుణ్యాలపై నమ్మకం పెరుగుతుంది. ఎలాంటి ఆందోళన లేకుండా ఏకాగ్రతతో ప్రిపరేషన్ సాగించేందుకు వీలవుతుంది.

పరీక్ష రోజుకు సిద్ధంగా

కీలకమైన పరీక్ష రోజు చూపే ప్రతిభే భవిష్యత్తును నిర్దేశిస్తుందని గుర్తించాలి. వాస్తవానికి చాలా మంది పరీక్ష రోజున అనవసర ఆందోళనకు గురవుతారు. దీంతో కొశ్చన్ పేపర్ చేతిలోకి రాగానే అలసటకు లోనవుతారు. దీనికి పరిష్కారంగా పరీక్ష హాల్లోకి వీలైనంత ముందుగా ప్రవేశించాలి. అక్కడి వాతావరణానికి అలవాటు పడాలి. పరీక్షకు వెళ్లేందుకు అవసరమైన హాల్‌టికెట్, ఇతర పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఫలితంగా చివరి క్షణంలో ఆందోళన నుంచి విముక్తి లభిస్తుంది.

యోగా.. ధ్యానం

ఒత్తిడి నివారణలో యోగా, ధ్యానం అద్భుత సాధనాలని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి రోజు కొద్దిసేపు మెడిటేషన్ చేయడం ద్వారా ఒత్తిడిని ఎదుర్కొనే సంసిద్ధత లభిస్తుందని చెబుతున్నారు. కాబట్టి విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయం యోగా, ధ్యానం వంటి వాటికి కేటాయించాలి.

ఒత్తిడిని జయించడానికి ముఖ్య సూచనలు

• ప్రతిరోజు దినచర్యను తమకు ఇష్టమైన వ్యాపకంతో ప్రారంభించాలి. • రోజూ కొద్దిసేపు యోగా, నడక, వ్యాయామం వంటివి చేయాలి.
• చదవాల్సిన అంశాల జాబితాను ముందుగానే రూపొందించుకోవాలి.
• విసుగు, కోపం, ఆవేదన, నిరాశ నిస్పృహలకు దూరంగా ఉండాలి.
• ఇతరుల విజయాలను చూసి ఆందోళన చెందకూడదు. వారు విజయం సాధించిన తీరుపై సానుకూల దృక్పథంతో సలహాలు స్వీకరించాలి.
• డెడ్‌లైన్స్,లాస్ట్ మినిట్ వరకు వేచి చూడకుండా.. ముందుగానే ప్రీ ప్లాన్ అప్రోచ్ అనుసరించాలి.
• ప్రతి రోజు తప్పనిసరిగా కనీసం ఆరు గంటలు నిద్రకు కేటాయించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
671	177
59,135	17,413

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	11,139	▽	199
డోజోన్స్	31,910	▽	345
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,748	▽	132
డాక్స్	15,428	▽	205
షాంఘై	3,230	▽	46
నికాయ్	28,144	▽	479

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.38	83.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	96.38	99.64
€	యూరో	ఎస్‌బీఐ	85.60	88.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.23	61.15
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.93	55.28
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.68	61.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.88	22.55
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.44	23.23
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.69	12.76

వైవిధ్యమే పెట్టుబడులకు రక్ష!

అన్నీ ఒకే చోట ఉంటే రిస్క్

- ఈక్విటీ, డెట్, బంగారం మంచి కలయిక
- వీటితో మెరుగైన రాబడులు
- కాల వ్యవధి, రిస్క్ ధోరణి ఆధారంగా ఎంపిక
- ఈక్విటీలకు ఎక్కువ కేటాయింపులు అవసరం

రిటైల్ ఇన్వెస్టర్లలో చాలా మందికి పరుగెత్తే కుందేలు అంటేనే ఇష్టం. తాబేలు వైపు చూసేది చాలా కొద్ది మందే. కానీ, అడవి అన్న తర్వాత అన్ని జంతువులకూ నీడనిచ్చిన మాదిరే.. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లోనూ ఒకటికి మించిన సాధనాలకు చోటు కల్పించాలి. ఇక్కడ కుందేలు అంటే ఈక్విటీ మార్కెట్. తాబేలు అంటే డెట్, గోల్డ్ అని చెప్పుకోవచ్చు. దీర్ఘకాలంలో ఈక్విటీలలో వచ్చినంత రాబడి మరే సాధనంలోనూ ఉంటుందని చెప్పలేం. కానీ, అన్ని కాలాలకూ, పెట్టుబడులు అన్నింటికీ ఈక్విటీ ఒక్కటే వేదిక కాకూడదు. ఏదైనా సంక్షోభం ఎదురైతే.. వేరే సాధనంలోని పెట్టుబడులు కొంత రక్షణనిస్తాయి. ఇన్వెస్టర్లు తమ రిస్క్ సామర్థ్యం ఆధారంగా ఈక్విటీతోపాటు ఇతర సాధనాల మధ్య కూడా కొంత పెట్టుబడులను వైవిధ్యంగా చేసుకోవాలి. అప్పుడే పెట్టుబడుల ప్రయాణం సాఫీగా సాగుతుంది. ఈ వివరాలన్నీ తెలియజేసే కథనమిది...





ఈక్విటీ, డెట్ మార్కెట్లలో గతేడాది నుంచి అస్థిరతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఏడాది దాటిపోయింది. అన్ని దేశాలూ ద్రవ్యోల్బణ రిస్క్‌ను ఎదుర్కొంటున్నాయి. కంపెనీల మార్జిన్లపై దీని ప్రభావం గణనీయంగానే ఉంది. ద్రవ్యోల్బణాన్ని కిందకు దించేందుకు సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపు ఆయుధాన్ని నమ్ముకున్నాయి. మన దగ్గరా గతేడాది మే నుంచి రెపో రేటు 2.5 శాతం పెరిగింది. అమెరికా, యూరప్ మాంద్యం ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఐటీ రంగంలో ఉద్యోగాలకు కోతలు పడుతున్నాయి. ఒకవైపు ఈక్విటీ, డెట్ మార్కెట్లు ఆటుపోట్లు చూస్తుంటే.. మరోవైపు బంగారం, వెండి గడిచిన ఏడాది కాలంలో మంచి ర్యాలీని చూశాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు మెరుగైన పెట్టుబడుల విధానమే అస్సెట్ అలోకేషన్. అంటే ఒకే విభాగం కాకుండా, ఒకటికి మించిన సాధనాల మధ్య పెట్టుబడులను వర్గీకరించుకోవడం. ఒక్కో విభాగం ఒక్కో రీతిలో పనితీరు చూపిస్తుంటుంది. కనుక అస్సెట్ అలోకేషన్‌తో దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాన్ని చూడొచ్చు. అంతేకాదు పోర్ట్‌ఫోలియో రిస్క్‌ను (ఒక్క బాక్సులోనే అన్ని గుడ్లు పెట్టడం)ను తగ్గించుకోవచ్చు. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)కూడా పెట్టుబడుల వైవిధ్యానికి అందుబాటులో ఉన్న సాధనాలు. గత పదిహేనేళ్ల కాలంలో వివిధ సాధనాలు ఎలా పనిచేశాయి? వైవిధ్యం ఏ విధంగా నష్టాలను పరిమితం చేసి, మెరుగైన రాబడులు ఇచ్చిందన్నది అర్థం చేసుకోవాలంటే కొన్ని గణాంకాలను విశ్లేషించుకోవాల్సిందే.

పనితీరు ఇలా..

2006 నుంచి 2022 వరకు డేటాను పరిశీలిస్తే.. ఈక్విటీ, డెట్, గోల్డ్, వెండి ఎలా ర్యాలీ చేసిందీ తెలుస్తుంది. 2006లో ఈక్విటీ 41.9 శాతం, 2007లో 56.8 శాతం చొప్పున ర్యాలీ చేసింది. డెట్ ఆ రెండు సంవత్సరాల్లో ఒకే అంకె రాబడులను ఇచ్చింది. బంగారం స్వల్పంగా లాభాలను ఇచ్చింది. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం ప్రభావంతో 2008లో ఈక్విటీ మార్కెట్ 51 శాతం పడిపోయింది. కానీ, బంగారం అదే ఏడాది 26.1 శాతం ర్యాలీ చేసింది. 2011లో యూరోజోన్ సంక్షోభం తలెత్తింది. దీంతో ఈక్విటీ మార్కెట్ 23.8 శాతం పడిపోయింది. కానీ, బంగారం 31.7 శాతం రాబడులను ఇచ్చింది. డెట్‌లో రాబడి 8 శాతంగా ఉంది. అంతెందుకు కరోనా సంవత్సరం 2020లోనూ ఈక్విటీ మార్కెట్ 50 శాతం వరకు పడిపోగా, అంతే వేగంగా రికవరీ అయి, ఆ ఏడాది నికరంగా 16%రాబడినిచ్చింది. అదే ఏడాది బంగారం 28% రాబడులను ఇచ్చింది. 2021లో బంగారం నికరంగా నష్టాలను మిగల్చితే.. ఈక్విటీలు రాబడులు మెరుగ్గా ఉన్నాయి. ఇక్కడి గణాంకాలను పరిశీలిస్తే, అన్ని సాధనాలు ఒకే తీరులో కాకుండా.. భిన్న సమయాల్లో భిన్నమార్గంలో చలిస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు. అందుకనే పోర్ట్‌ఫోలియోలో వీటన్నింటికీ చోటు ఇవ్వాలని చెప్పేది. ఇక్కడ బంగారం రాబడికి ఎంసీఎక్స్, బాండ్ల పనితీరునకు క్రిసిల్ షార్ట్ టర్మ్ ఇండెక్స్ గణాంకాలను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

పెట్టుబడుల మిశ్రమం

వైవిధ్యం కోసం ఈక్విటీలకు తోడుగా ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల (డెట్) వరకే పరిమితం కాకూడదు. ఈక్విటీ, డెట్‌కు తోడు బంగారం కూడా జోడించుకోవడం మెరుగైన విధానమని చెప్పుకోవచ్చు. కేవలం ఈక్విటీ, డెట్‌తో కూడిన పోర్ట్‌ఫోలియోతో పోలిస్తే, ఈక్విటీ, డెట్, గోల్డ్‌తో కూడిన పోర్ట్‌ఫోలియోలోనే మెరుగైన రాబడులు ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2002 నుంచి 2022 వరకు ఈ సాధనాల్లో మూడేళ్ల రోలింగ్ రాబడులను గమనించినట్టయితే.. 65:35 నిష్పత్తిలో ఈక్విటీ, డెట్ పోర్ట్‌ఫోలియో 67.2 శాతం సమయంలో 10 శాతానికి పైగా వార్షిక రాబడులను ఇచ్చింది. అదే 65:20:15 నిష్పత్తిలో ఈక్విటీ, డెట్, గోల్డ్ పోర్ట్‌ఫోలియో మాత్రం 71.7% కాలంలో 10 శాతానికి పైనే రాబడులను ఇచ్చింది. కానీ, గత 20 ఏళ్ల కాలంలో ఈక్విటీ, డెట్ పోర్ట్‌ఫోలియో వార్షిక రాబడి 14.3 శాతంగా ఉంటే, ఈక్విటీ, డెట్, గోల్డ్‌తో కూడిన పోర్ట్‌ఫోలియోలో రాబడి 15.4 శాతం చొప్పున ఉంది. ఈక్విటీ, డెట్‌కు బంగారాన్ని జోడించుకోవడం వల్ల ఒక శాతం అదనపు రాబడులు కనిపిస్తున్నాయి. మల్టీ అస్సెట్ పోర్ట్‌ఫోలియో రిస్క్‌ను అధిగమించి దీర్ఘకాలంలో మెరుగైన రాబడులను ఇచ్చాయి. మిశ్రమ పోర్ట్‌ఫోలియో వల్ల మూడేళ్లకు మించిన కాలంలో ప్రతికూల రాబడులకూ అవకాశం దాదాపుగా ఉండదు. గత ఐదేళ్లలో మల్టీ అస్సెట్ పథకాలు, అగ్రెస్సివ్ హైబ్రిడ్ లేదా డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ మెరుగైన పనితీరు చూపించాయి.



ఎంత చొప్పున..

అస్సెట్ అలోకేషన్ విషయంలో ఏ సాధనానికి ఎంత పెట్టుబడులు కేటాయించాలన్నది ముఖ్యమైన అంశం అవుతుంది. ఇది ఇన్వెస్టర్ రిస్క్ సామర్థ్యం, పెట్టుబడుల కాలం, రాబడుల అంచనాల ఆధారంగా నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. అందరికీ ఒక్కటే ప్రామాణిక సూత్రం పనిచేయదు. యుక్త వయసులో ఉన్న వారు ఈక్విటీలకు ఎక్కువ కేటాయింపులు చేసుకోవాలి. వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళ్లాలి. అదే సమయంలో డెట్, గోల్డ్‌కు కేటాయింపులు పెంచుకుంటూ వెళ్లాలి. రిటైర్మెంట్ తర్వాత కూడా కొంత మేర పెట్టుబడులు ఈక్విటీల్లోనే ఉండాలి. అప్పుడే ద్రవ్యోల్బణం నుంచి పెట్టుబడులకు రక్షణతోపాటు, మెరుగైన రాబడులను సొంతం చేసుకోవడానికి వీలుంటుంది. 100 నుంచి ఇన్వెస్టర్ తన వయసును తీసివేయగా, మిగిలేంత ఈక్విటీలకు కేటాయించుకోవచ్చన్నది ఒక సూత్రం. ఉదాహరణకు 30 ఏళ్ల ఇన్వెస్టర్ 70 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీలకు తప్పనిసరిగా మెజారిటీ పెట్టుబడులు కేటాయించుకోవడం అవసరం. దీర్ఘకాలంలో (7 ఏళ్లకు మించి) ఈక్విటీలు సగటున రెండంకెల రాబడులను ఇచ్చాయి. ఇక ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు (డెట్) స్థిరమైన రాబడులకు మార్గం అవుతుంది. వైవిధ్యంతోపాటు, నష్టాలకు అవకాశం ఉండదు. బంగారం అన్నది ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్‌గా అనుకూలిస్తుంది. ఈక్విటీలు ప్రతికూలతలు ఎదుర్కొంటున్న సందర్భాల్లో అండగా నిలిచే సాధనం ఇది. బంగారం కేవలం హెడ్జింగ్ కోసమే కాకుండా, దీర్ఘకాలంలో డెట్‌కు మించి రాబడులను ఇవ్వగలదని గణాంకాలు చెబుతున్నాయి. 2006 నుంచి 2012 మధ్య కాలంలో రెండంకెల వార్షిక రాబడులను ఇచ్చింది. కానీ, ఆ తర్వాత 2013 నుంచి 2015 వరకు నష్టాలను ఎదుర్కొన్నది. ఇక వెండి అన్నది పారిశ్రామిక కమోడిటీ. ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెళ్లలో దీని అవసరం ఉంటుంది. ఈ రంగాలు వృద్ధి చెందే కొద్దీ వెండికి డిమాండ్ పెరుగుతుంది. ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు చూపిస్తున్న దశలో వెండికి డిమాండ్ పెరుగుతుంది. ఒకవేళ వెండిలోనూ ఇన్వెస్ట్ చేయాలనే ఆసక్తి ఉంటే సిల్వర్ ఈటీఎఫ్‌లకు 5 శాతం లోపు కేటాయింపులను పరిశీలించొచ్చు. బంగారం కోసం సావరీన్ గోల్డ్ బాండ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. భౌతిక బంగారం మెరుగైన పెట్టుబడి సాధనం కాబోదు. నేరుగా ఇన్వెస్ట్ చేసుకునే ఆసక్తి లేకపోయినా లేదా అంత పరిజ్ఞానం లేకపోయినా నిరాశ పడక్కర్లేదు. మార్కెట్లో మెరుగైన మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ ఉన్నాయి. ఇన్వెస్టర్లు వీటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. మల్టీ అస్సెట్ పథకాలు చాలా వరకు ఈక్విటీ, డెట్, బంగారానికి 65:20:15 నిష్పత్తిలో పెట్టుబడులు కేటాయిస్తుంటాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ మల్టీ అస్సెట్ అలోకేషన్, హెచ్‌డీఎఫ్‌సీ మల్టీ అస్సెట్, ఎస్‌బీఐ మల్టీ అస్సెట్ తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి.

నేటితో ముగియనున్న యస్ బ్యాంక్ షేర్ల లాకిన్

అమ్మకాలు వెల్లువెత్తవచ్చని అంచనాలు

ముంబై: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ షేర్ల మూడేళ్ల లాకిన్ వ్యవధి సోమవారంతో ముగియనుంది. దీంతో మార్కెట్లో భారీ అమ్మకాలు వెల్లువెత్తవచ్చని భావిస్తున్నారు. 2020 మార్చిలో యస్ బ్యాంక్‌లో దాదాపు 49 శాతం వాటాలు కొనుగోలు చేసిన తొమ్మిది బ్యాంకులు తాజాగా షేర్లను అమ్ముకుని నిష్క్రమించేందుకు ప్రయత్నించవచ్చని అంచనా. వ్యక్తిగత ఇన్వెస్టర్లకు (రిటైల్, సంపన్న వర్గాలు, ప్రవాస భారతీయులు) చెందిన 135 కోట్ల షేర్లు, ఈటీఎఫ్‌లకు చెందిన 6.7 కోట్ల షేర్లు లాకిన్ అయి ఉన్నాయి. 2022 డిసెంబర్ ఆఖరు నాటికి ఎస్‌బీఐకి 605 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. ఐసీఐసీఐ బ్యాంకులకు తలో 100 కోట్ల షేర్లు ఉన్నాయి. నిర్వహణపరమైన అవకతవకలతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన యస్ బ్యాంకును 2020 మార్చిలో రిజర్వ్ బ్యాంక్ తన చేతుల్లోకి తీసుకుంది. ఆ తర్వాత రూపొందించిన ప్రణాళిక ప్రకారం తొమ్మిది బ్యాంకులు తలో రూ. 10,000 కోట్లు సమకూర్చడం ద్వారా వాటాలు తీసుకుని యస్ బ్యాంక్‌ను నిలబెట్టాయి. అలా తీసుకున్న వాటాల్లో 75 శాతం షేర్లను మూడేళ్ల వరకూ విక్రయించకుండా లాకిన్ విధించారు. ఇతర ఇన్వెస్టర్లకూ ఇదే నిబంధన వర్తింపచేశారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-3-2023	
విశాఖ	435-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	426-00
విజయవాడ	426-00
రిటైల్ ధర (డజను)	66.00
12-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

రూ.20 లక్షల ఇన్వెస్ట్‌మెంట్ ఎలా..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నూతన పన్ను విధానం ప్రకారం ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన లాభాల పన్నును ఎలా పరిగణిస్తారు?

– హుస్సేన్, హైదరాబాద్

నూతన పన్ను విధానంలోనూ ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ విక్రయంపై వచ్చే దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్షపై పన్ను లేదు. రూ.లక్షకు మించిన లాభంపైనే 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. నూతన పన్ను విధానాన్ని ఎన్నో తగ్గింపులు, మినహాయింపులను తొలగించి ప్రవేశపెట్టారు. అయినప్పటికీ ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రయోజనాన్ని కొత్త విధానంలో తొలగించలేదు. సెక్షన్ 112ఏ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు.

నేను రూ.20 లక్షలు ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఐదు నుంచి పదేళ్ల వరకు ఈ పెట్టుబడులు కొనసాగించగలను. ఈ కాలానికి ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి.

– దుర్గాజ్యోతి, అమలాపురం

మీ ప్రశ్నకు మ్యూచువల్ ఫండ్స్ సులభ సమాధానం అవుతుంది. రిటైల్ ఇన్వెస్టర్లు మంచి రాబడులను సమకూర్చుకునేందుకు వారి ముందు అందుబాటులో ఉన్న ఎంపిక మ్యూచువల్ ఫండ్స్. మీరు చెప్పిన కాలానికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మంచి ఆప్షన్ అవుతుంది. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని (కరెన్సీ విలువను హరించేది) మించి రాబడులను ఇవ్వగలవు. స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు రిటైల్ ఇన్వెస్టర్లకు మ్యూచువల్ ఫండ్స్ మార్గం సులభమైనది. ఇప్పుడు ఏ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలన్న ప్రశ్న ఎదురవుతుంది. మొదటి సారి మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే, అటువంటి ఇన్వెస్టర్లకు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అనుకూలం. ఇవి 70 శాతం పెట్టుబడులు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన 30 శాతం మేర డెట్‌లో పెట్టుబడులు పెడతాయి. ఈక్విటీ పెట్టుబడుల ఆప్షన్‌తో మెరుగైన రాబడులను ఇవి ఇవ్వగలవు. డెట్‌లో పెట్టుబడులు మార్కెట్ అస్థిరతలను ఎదుర్కొనేందుకు రక్షణగా నిలుస్తాయి. ఈక్విటీ మార్కెట్లు పడిపోయినప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లోనూ అనిశ్చితులు కనిపిస్తాయి. కాకపోతే అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోలిస్తే ఈ క్షీణత అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో తక్కువగా ఉంటుంది. ఒకవేళ ఈక్విటీ పెట్టుబడుల పట్ల అవగాహన ఉంటే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఇప్పుడు మీరు రూ.20 లక్షలను తీసుకెళ్లి ఒకే విభాగంలో పెట్టేస్తారా..? అలా చేయకూడదు. ఎందుకంటే ఈక్విటీలు స్వల్పకాలంలో ఎంతో అస్థిరతల మధ్య చలిస్తుంటాయి. కనుక పెట్టుబడులన్నింటికీ ఒకే చోట ఇన్వెస్ట్ చేసినట్టయితే, ఆ తర్వాత మార్కెట్ పతనాన్ని చూస్తే పెట్టుబడుల విలువ గణనీయంగా తగ్గిపోతుంది. కనుక ఒకేసారి ఇన్వెస్ట్ చేయకుండా కొంత కాలానికి క్రమంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. దీనివల్ల కొనుగోలు వ్యయం సగటుగా మారుతుంది. అనుకూలంగా లేని సమయంలో మార్కెట్లోకి ప్రవేశించే రిస్క్ కూడా తగ్గుతుంది. మీరు ఈక్విటీల్లో పెట్టుబడులను 12–18 నెలల కాలంలో క్రమంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. ఏ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలో మీరు తేల్చుకోలేనప్పుడు మా అనలిస్టుల ఎంపిక జాబితాను పరిశీలించొచ్చు.

స్టార్టప్‌లకు ఎస్‌వీబీ సెగ

- తక్షణ అవసరాలకు నిధులపై ప్రభావం
- రిస్కులో 1 లక్ష ఉద్యోగాలు
- సమస్య స్వల్పకాలికమైనదే కావచ్చని పరిశీలకుల అభిప్రాయం



న్యూఢిల్లీ: సిలికాన్ వేలీ బ్యాంక్ (ఎస్‌వీబీ) మూసివేత వల్ల దానితో ముడిపడి ఉన్న అంకుర సంస్థల్లో ఆందోళన నెలకొంది. తక్షణ ఆర్థిక అవసరాలకు కావాల్సిన నిధుల కోసం అవి వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎస్‌వీబీలో డిపాజిట్లు ఉన్న దాదాపు 10,000 చిన్న సంస్థలు .. వచ్చే 30 రోజుల్లో తమ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో విఫలమయ్యే అవకాశం ఉందని అమెరికా ప్రభుత్వానికి సమర్పించిన పిటీషన్‌లో వై కాంబినేటర్ (వైసీ) తెలిపింది. దీని వల్ల 1 లక్ష పైగా ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు పేర్కొంది. ఇలాంటి పరిణామాలు తలెత్తకుండా కట్టడి చేయకపోతే .. యావత్ అమెరికా టెక్నాలజీ పరిశ్రమపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. 3,500 మంది పైచిలుకు సహ వ్యవస్థాపకులు, సీఈవోలు, రెండు లక్షల మంది పైగా స్టార్టప్ సంస్థల ఉద్యోగులు ఈ పిటీషన్‌పై సంతకం చేశాయి. వీటిలో పేవో, సేవ్‌ఇన్, శాలరీబుక్ వంటి భారతీయ సంస్థలు కూడా ఉన్నాయి. ఇన్‌క్యుబేటర్ సంస్థ అయిన వై కాంబినేటర్ కమ్యూనిటీలోని మూడో వంతు స్టార్టప్‌లకు ఎస్‌వీబీలో మాత్రమే ఖాతాలు ఉన్నాయి. ఎస్‌వీబీలో భారీగా డిపాజిట్లు ఉన్న కొన్ని బడా టెక్ సంస్థలకు (వై కాంబినేటర్‌తో సంబంధమున్నవి) అమెరికాతో పాటు భారత్‌లోనూ కార్యకలాపాలు ఉన్నాయని ఫిన్‌టెక్ కంపెనీ రికర్ క్లబ్ సీఈవో ఏకలవ్య గుప్తా తెలిపారు. దేశీయంగా గిఫ్ట్ సిటీలో అకౌంట్లు తెరిచేందుకు ఆయా స్టార్టప్‌లకు తాము సహాయం అందిస్తున్నట్లు వివరించారు. మరోవైపు, గతంలోలాగా ఎస్‌వీబీని ప్రభుత్వం బెయిలవుట్ చేయబోదని అమెరికా ఆర్థిక మంత్రి జేనెట్ యెలెన్ స్పష్టం చేశారు. అయితే, డిపాజిటర్లందరికీ వారి సొమ్ము తిరిగి అందేలా చూసేందుకు చర్యలపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. 15 ఏళ్ల క్రితం నాటి ఆర్థిక సంక్షోభానికి నేటి పరిస్థితులకు వ్యత్యాసం ఉందని, అప్పటితో పోలిస్తే ఇప్పుడు అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ మరింత పటిష్టంగా ఉందని చెప్పారు.

సత్వర టేకోవర్‌కు ఆస్కారం..

ఈ సమస్య స్వల్పకాలికమైనదే కావచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. క్లయింట్ల సొమ్మును తిరిగి చ్చేందుకు సరిపడేంత అసెట్లు ఎస్‌వీబీ దగ్గర ఉండటంతో పాటు, పలు ప్రముఖ సంస్థల ఖాతాలూ ఉన్న నేపథ్యంలో బ్యాంకును సత్వరమే ఏదో ఒక సంస్థ టేకోవర్ చేయొచ్చని తెలిపాయి. రాబోయే వారం రోజుల్లోనే ఇది జరగవచ్చని ఇన్‌మొబి గ్రూప్ సహ వ్యవస్థాపకుడు అభయ్ సింఘాల్ చెప్పారు. స్వల్పకాలికంగా ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు కోసం 7–8 బిలియన్ డాలర్ల నిధులు అవసరం కావచ్చని, అవి అందితే ప్రస్తుతానికి సమస్య పరిష్కారం కావచ్చని ఆయన పేర్కొన్నారు. ఏవో కొన్నింటిపై మినహా మిగతా స్టార్టప్‌లపై ఎస్‌వీబీ సంక్షోభ ప్రభావం ఉండకపోవచ్చని జెన్‌ప్యాక్ట్ వ్యవస్థాపకుడు ప్రమోద్ భాసిన్ అభిప్రాయపడ్డారు. ఈ సమస్య స్థానికమైనదే తప్ప అంతర్జాతీయమైనది కాదని పేర్కొన్నారు. భారతీయ స్టార్టప్‌లకు ఎస్‌వీబీతో చెప్పుకోతగ్గ స్థాయిలో లావాదేవీలేమీ లేవు కాబట్టి అవి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదని పరిశ్రమ నిపుణుడు, 5ఎఫ్ వరల్డ్ చైర్మన్ గణేష్ నటరాజన్ చెప్పారు. ఎస్‌వీబీతో లావాదేవీలు జరిపే సంస్థలు కూడా కాస్త ఓపిక పడితే తమ సొమ్మును తిరిగి పొందడానికి వీలుంటుందన్నారు. మరోవైపు, తమ రెండు అనుబంధ సంస్థలకు (కిడోపియా, మీడియావర్క్జ్) ఎస్‌వీబీలో సుమారు రూ. 64 కోట్లు ఉన్నాయని గేమింగ్, స్పోర్ట్స్ మీడియా ప్లాట్‌ఫామ్ సంస్థ నజారా టెక్నాలజీస్ వెల్లడించింది. అయితే, వాటి చేతిలో తగినన్ని నిధులు ఉన్నాయని, ఎస్‌వీబీ పరిణామం వల్ల వాటి వ్యాపారంపై ప్రభావమేమీ పడబోదని పేర్కొంది.

అంకురాలతో భేటీ కానున్న కేంద్ర మంత్రి..



దేశీ సంస్థలపై ఎస్‌వీబీ పరిణామాల ప్రభావాన్ని అంచనా వేయడంపై కేంద్రం దృష్టి సారించింది. దీనిపై కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ వారంలో దేశీ స్టార్టప్‌ల ప్రతినిధులతో భేటీ కానున్నారు. దేశ నిర్మాణంలో కీలకంగా ఎదుగుతున్న అంకుర సంస్థలకు ప్రభుత్వం ఏ విధంగా తోడ్పాటు అందించగలదన్నది తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడగలదని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.

కేంద్ర సాహిత్యఅకాడమీ తెలుగు విభాగం కన్వీనర్‌గా

మృణాళిని ఎన్నిక


మృణాళిని


కిషోర్


సత్యనారాయణ


ప్రసేన్

- తెలుగు విభాగంలో ఆమె తొలి మహిళా కన్వీనర్
- సభ్యులుగా ఎస్వీ సత్యనారాయణ, మందలపర్తి కిషోర్, ప్రసేన్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్‌గా ప్రొఫెసర్ మృణాళిని ఎన్నికయ్యారు. ఢిల్లీలోని రవీంద్రభవన్‌లో జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. తెలుగుభాష ఔన్నత్యానికి మృణాళిని చాలాకాలంగా సేవలందిస్తున్నారు. కథకురాలిగా, వ్యాసకర్తగా, పరిశోధకురాలిగా, పాత్రికేయురాలిగా ఆమె పలు కోణాల్లో భాష ఉన్నతి కోసం కృషి చేస్తూ వస్తున్నారు. మృణాళినితోపాటు రచయిత మందలపర్తి కిషోర్ ఆంధ్రప్రదేశ్ పక్షాన, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, కవి, పాత్రికేయుడు ప్రసేన్ తెలంగాణ పక్షాన తెలుగు విభాగం కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. కన్వీనర్ పదవి కోసం మృణాళిని, ఎస్వీ సత్యనారాయణ పోటీ పడ్డారు. మృణాళినికి 33 ఓట్లు, సత్యనారాయణకు 28 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఆమె ఐదు ఓట్ల తేడాతో గెలిచారు. కన్వీనర్‌గా ఎన్నికైన మృణాళినిని, మిగతా ముగ్గురు మండలి సభ్యులను అకాడమీ కార్యదర్శి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తదితరులు అభినందించారు. గతంలో ఓ పర్యాయం మృణాళిని తెలుగు విభాగం కౌన్సిల్ సభ్యురాలిగా ఐదేళ్లపాటు పనిచేశారు. తెలుగు విభాగంలో ఆమె తొలి మహిళా కన్వీనర్ కూడా కావటం విశేషం. ఈ పదవిలో ఆమె ఐదేళ్లపాటు కొనసాగనున్నారు.

యువత కేంద్రంగా కార్యకలాపాలు: మృణాళిని

'సాహిత్య అకాడమీ అనగానే రచయితలు, సాహితీవేత్తలతో గోష్ఠులు లాంటివి జరుగుతుంటాయనే భావన ఉంది. ఇప్పుడు యువత కేంద్రంగా సాహితీ సదస్సులు, ప్రచురణలు తీసుకురావాలన్నది నా ఆలోచన. యువతలో తెలుగు భాషపై ఆసక్తిని, మక్కువను పెంచాల్సిన అవసరం చాలా ఉంది. వారు తెలుగుభాష, తెలుగు ప్రచురణలవైపు ఆసక్తి చూపేలా, సాహితీ సృజనను జోడించి సదస్సులు నిర్వహిస్తాం. వీలైతే ఆడియో బుక్స్‌ను అందుబాటులోకి తెచ్చి, వారు పుస్తకాలు వింటూ తద్వారా చదవటంపై ఇష్టం పెంచుకునేలా ప్రయత్నిస్తాం, రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తెలుగు వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనే విషయంపై నలుగురు సభ్యులం దృష్టి సారిస్తాం. కన్వీనర్ పదవిని హోదాగా కాకుండా గురుతరమైన బాధ్యతగా భావించి ఐదేళ్లపాటు అకాడమీ నియమనిబంధనలకు లోబడి తెలుగు భాషాభివృద్ధికి తోచినంత పని చేస్తాను'.

30న శ్రీవారి ఆలయంలో

శ్రీరామనవమి ఆస్థానాలు


ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీవీ వేణుగోపాల్

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30, 31 తేదీల్లో శ్రీరామనవమి, శ్రీరామ పట్టాభిషేకం పర్వదినాలను పురస్కరించుకుని టీటీడీ ఘనంగా ఆస్థానాలు నిర్వహించనుంది. 30న రంగనాయకుల మండపంలో శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేయనున్నారు. సాయంత్రం హనుమంత వాహన సేవ జరుగనుంది. రాత్రి శ్రీరామనవమి ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. మార్చి 31న శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు.

దర్భశయనం శ్రీనివాసాచార్యకు ఇంద్రగంటి పురస్కారం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖకవి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ పేరిట ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన 'ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం '2022వ సంవత్సరానికిగాను విలక్షణకవి దర్భశయనం శ్రీనివాసాచార్యకు లభించింది. శ్రీకాంత శర్మ తనయుడు ఇంద్రగంటి మోహనకృష్ణ స్వగృహంలో ఆదివారం జరిగిన సభలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శ్రీనివాసాచార్యను మెమెంటో, శాలువా, రూ.25 వేల నగదుతో సత్కరించారు. శ్రీకాంతశర్మ సహచరి ఇంద్రగంటి జానకీబాల ఆప్తవాక్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచార్య కవితాప్రస్థానం గురించి ముఖ్యఅతిథి కోడూరి విజయ్‌కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో సాహితీప్రముఖులు మహమ్మద్ ఖదీర్‌బాబు, సుబ్బరాయశాస్త్రి, ఎ.విద్యాదేవి, ఒమ్మి రమేశ్‌బాబు, కె.సజయ, ఇంద్రగంటి మోహనకృష్ణ, ఇంద్రగంటి కిరణ్మయి పాల్గొన్నారు.

భువనగిరిలో వెలుగుచూసిన

దాన శాసనం



సాక్షి, యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో అభివృద్ధి పనుల కోసం శనివారం చేపట్టిన తవ్వకాల్లో బయటపడిన పురాతన ఆలయ ఆనవాళ్లను కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. ఆలయాన్ని శ్రీ వీరభద్రేశ్వర క్షేత్రంగా, తెలుగు శాసనాన్ని దాన శాసనంగా గుర్తించింది. దాన శాసనంపై చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆదివారం వెల్లడించిన వివరాలివి. ఆచంద్రార్కం.. అంటే సూర్యచంద్రులు ఉన్నంతకాలం శ్రీవీరభద్రేశ్వర దేవరకు, గర్భగుడిలో నిర్వహించే పూజాదికాలు, ఇతర సేవల నిర్వహణకు వ్యాపారులు విక్రయించే సరుకులపై సుంకం వసూలు చేయాలని నిర్ణయించారు. దేవుని ధూపదీప నైవేద్యాలకు నిత్యం సోలెడు గానుగ నూనె ఉచితంగా ఇవ్వాలని భువనగిరికి చెందిన అష్టాదశ ప్రజలు (పద్దెనిమిది కులాలు) నిర్ణయించారు. భువనగిరి ప్రజలకు పుణ్యం కలిగేందుకు సుంకం ఇవ్వడానికి వ్యాపారులు, ఉచితంగా నూనె ఇవ్వడానికి అష్టాదశ ప్రజలు ముందుకొచ్చారు. దీనికోసం ఏర్పాటు చేసిందే దాన శాసనమని హరగోపాల్ వివరించారు. మహామండలేశ్వరుడైన కాకతీయ ప్రతాపరుద్ర దేవ మహారాజు పరిపాలనా కాలం శక సంవత్సరం 1240 కాళయుక్తి సంవత్సరం ఆషాడ శుద్ధ 15 పౌర్ణమి గురువారం (క్రీ.శ 1318 జూన్ 14న) దాన శాసనం వేసినట్లు హరగోపాల్ తెలిపారు.



మహిళలు ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ బండి పద్మ, గ్రేటర్ హైదరాబాద్ మున్నూరుకాపు సంఘం మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కొత్త కృష్ణవేణి శ్రీనివాస్ అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని తెలగ, బలిజ, కాపు సంఘం కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. -కవాడిగూడ



జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపట్టిన రథోత్సవానికి తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి రథం లాగి, మొక్కులు చెల్లించుకున్నారు. -ధర్మపురి



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శ్రీమల్లికార్జునస్వామి జాతర వైభవంగా జరుగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం బోనాల ఉత్సవం నిర్వహించారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 50వేల మందికి పైగానే బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. - మెట్‌పల్లి (కోరుట్ల)



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం రాజన్న రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అందంగా అలంకరించిన రథాలపై స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. -వేములవాడ

వ్యవసాయాన్ని ప్రోత్సహించే వారంతా రైతులే

హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవిదేవి



మర్రిగూడ: వ్యవసాయాన్ని ప్రోత్సహించే వారంతా రైతులేనని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పట్లోళ్ల మాధవిదేవి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా మర్రిగూడలోని గ్రామ భారతిలో నిర్మించిన పట్లోళ్ల రాంరెడ్డి భవనాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పట్లోళ్ల కుటుంబంలో జన్మించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామ భారతి విత్తనానికి రాంరెడ్డి ఆలోచన తోడ్పాటై.. నేడు వృక్షంగా ఏర్పడిందని తెలిపారు. తామంతా సేంద్రియ వ్యవసాయం ద్వారా ఎందరికో ఆదర్శంగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో రాణించిన నల్లగొండకు చెందిన శశికళ, ఆసిఫాబాద్‌కు చెందిన సునంద, భువనగిరికి చెందిన జిట్టా జ్యోతికి నారీ పురస్కారాలను ప్రదానం చేశారు. గ్రామ భారతి అభివృద్ధి కోసం రూ.లక్ష ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ, ఉద్యానవన కోర్సుల్లో అవకాశాలు వస్తే సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో దేవరకొండ ప్రిన్సిపల్ జడ్జి రవీంద్రకుమార్, అడిషనల్ ప్రిన్సిపల్ జడ్జి అజయ్‌ఉల్లమ్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా బీఆర్‌ఎస్ కార్యాలయ నిర్మాణం

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం కేసీఆర్ విధించిన నిర్ణీత గడువులోగా బీఆర్‌ఎస్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తి కావాలని నిర్మాణ సంస్థకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలోని వసంతవిహార్‌లో నిర్మిస్తున్న పార్టీ నూతన కేంద్ర కార్యాలయాన్ని ఆదివారం మంత్రి పరిశీలించారు.





Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.